కొన్నింటిని ఓర్చుకో
కొందరిని చూసి నేర్చుకో
ఎంత మనవాళ్లు అనుకున్నా
ఎవరు ఏక్షణం ఎలా
మారిపోతారో
ఎవరికీ తెలియదు..!

TS-11-0036701

# నేటి చర్చ
జాతీయ తెలుగు దిన పత్రిక

## విలేకరులు కావలెను

ప్రజా సమస్యలపై స్పందించే తత్వం మీకుందా..? సమాజంలో జరుగుతున్న అన్యాయాలకు, అక్రమాలకు అక్షర రూపమిచ్చి బాధితులకు అండగా నిలబడే ధైర్యం మీకుందా..? మీకోసమే చర్చన్యూస్ ఎదురుచూస్తోంది. కలం బలంతో ముందుకు సాగుదాం. తెలంగాణ వ్యాప్తంగా చర్చ దినపత్రికలో రాష్ట్రం, జిల్లాలు, నియోజకవర్గ, మండలాల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఉత్సాహవంతులైన యువతి, యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును.

నేటి చర్చ జాతీయ తెలుగు దిన పత్రిక

సంప్రదించవలసిన ఫోన్ నంబర్ 99666 41155

తెలంగాణ , సంపుటి : 01 సంచిక : 60 గురువారం, అక్టోబర్ 29, 2026 , పేజీలు - 12 వెల : 2/-

# కేంద్ర ఉద్యోగులకు 3 శాతం డీఏ పెంపు

**48.54 లక్షల మంది ఉద్యోగులు, 68.71 లక్షల మంది పెన్షనర్లకు లబ్ధి**




**న్యూఢిల్లీ,అక్టోబర్ 28 :** కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు కేంద్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. కరవు భత్యం (డీఏ), కరవు ఉపశమనం (డీఆర్)ను 3 శాతం పెంచుతూ కేంద్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం 60 శాతంగా ఉన్న డీఏ, డీఆర్ తాజా పెంపుతో 63 శాతానికి చేరనున్నాయి. ఈ పెంపు 2026 జూలై 1 నుంచి అమల్లోకి వస్తుంది. దేశవ్యాప్తంగా సుమారు 48.54 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, 68.71 లక్షల మంది పెన్షనర్లు ప్రయోజనం పొందనున్నారు. ఈ నిర్ణయంతో ప్రభుత్వ ఖజానాపై ఏడాదికి రూ.10,016.10 కోట్ల అదనపు భారం పడనుంది. పెరిగిన ధరల ప్రభావం నుంచి ఉద్యోగులు, పెన్షనర్లకు కొంత ఉపశమనం కల్పించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రం మిగతా2లో...



## కరువును సమిష్టిగా ఎదుర్కొందాం!

**అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలి**

**ముందస్తు చర్యలు చేపడుతున్నాం.. కేంద్రానికి ఇప్పటికే నివేదిక పంపించాం**

**అవసరమైతే ఢిల్లీకి అఖిలపక్ష బృందం**

**విపక్షాల సూచనలను పరిగణనలోకి తీసుకుంటాం: ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**

**హైదరాబాద్,అక్టోబర్ 28 :** ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో ఏర్పడిన కరువు పరిస్థితులను అందరం కలిసికట్టుగా ఎదుర్కొందామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అఖిలపక్ష నేతలకు విజ్ఞప్తి చేశారు. కరువు నివారణకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ముందస్తు చర్యలు చేపడుతోందని తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆయన అధ్యక్షతన ఎల్‌నినో మిగతా2లో...

# అప్రమత్తంగా ఉండండి..

## - తాగునీటి సమస్య రానివ్వొద్దు!

**ఎల్‌నినో నేపథ్యంలో అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు**

**క్యూర్ ఏరియాలో మురుగునీటి శుద్ధి కేంద్రాలు వందశాతం పనిచేయాలి**

**భవన నిర్మాణాలు, పార్కులు, రోడ్ల శుభ్రతకు శుద్ధి చేసిన నీటినే వినియోగించాలి**

**శుద్ధి చేసిన నీటి సరఫరాపై నిరంతర పర్యవేక్షణ.. నవంబర్ 1 నుంచి ఆదేశాల అమలు**



**హైదరాబాద్,అక్టోబర్ 28 :** ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో తాగునీటి సరఫరా విషయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నగరంలో ఎట్టి పరిస్థితుల్లోనూ తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని జలాశయాల్లో నీటి నిల్వలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. తాగునీటి సరఫరా, మురుగునీటి శుద్ధి కేంద్రాల నిర్మాణం, శుద్ధి చేసిన నీటి వినియోగంపై బుధవారం హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ క్యూర్ ఏరియాలోని మురుగునీటి శుద్ధి కేంద్రాలు (ఎస్టీపీలు) వందశాతం సామర్థ్యంతో మిగతా2లో...

## ఓటరు జాబితాలో పేరుంటే మళ్లీ ఫారం6 ఎందుకు?

**- ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించిన సుప్రీంకోర్టు**




**న్యూఢిల్లీ,అక్టోబర్ 28 :** ఢిల్లీలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై సుప్రీంకోర్టు కీలక ప్రశ్నలు లేవనెత్తింది. గతంలో ఓటర్లుగా నమోదైన వారి పేర్లు తొలగించినప్పుడు, మళ్లీ ఫారం6 సమర్పించాలని ఎందుకు కోరుతున్నారని ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించింది. సాధా రణంగా కొత్తగా ఓటరుగా నమోదు చేసుకునేవారు ఫారం6 ఉపయోగిస్తారని ధర్మాసనం గుర్తుచేసింది.ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని మిగతా2లో...

# ఏపీలో పరిషత్ ఎన్నికలు వాయిదా!

- **నవంబర్ 5న ఎంపీటీసీ, జడ్పీటీసీ పోలింగ్**
- **7వ తేదీన ఓట్ల లెక్కింపు.. ఎన్నికల సంఘం షెడ్యూల్‌లో మార్పులు**



**అమరావతి,అక్టోబర్ 28 :** ఆంధ్రప్రదేశ్‌లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల షెడ్యూల్‌లో రాష్ట్ర ఎన్నికల సంఘం కీలక మార్పులు చేసింది. నవంబర్ 3న నిర్వహించాల్సిన పోలింగ్‌ను నవంబర్ 5కు వాయిదా వేసింది. అదే రోజు జరగాల్సిన ఓట్ల లెక్కింపును నవంబర్ 7కు మార్చింది. ఈ మేరకు ఎన్నికల సంఘం బుధవారం ప్రకటన విడుదల చేసింది. ఎన్నికల నిర్వహణలో సిబ్బంది కొరత, ఇతర ఏర్పాట్ల పరంగా ఇబ్బందులు తలెత్తకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. **మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్‌లోనూ మార్పులు** ఇప్పటికే పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్‌లో ఎన్నికల సంఘం మార్పులు చేసింది.

మిగతా2లో...

## ఉద్యోగులు ఏఐపై అవగాహన పెంచుకోవాలి

**- ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు సాంకేతికతను వినియోగించాలి: భట్టి విక్రమార్క**




# వణికిస్తున్న అర్నాబ్ తుపాను!

**పంటలకు తీవ్ర నష్టం.. అప్రమత్తమైన అధికార యంత్రాంగం**






## మోడీ ఫాసిస్టు పాలనకు నూకలు చెల్లే రోజులు దగ్గర్లోనే!

- **ఎన్ని అడ్డంకులు సృష్టించినా ఢిల్లీ వెళ్లి తీరుతాం: మహేశ్‌కుమార్ గౌడ్**
- **ప్రత్యేక రైళ్లు కేటాయించకపోవడంపై కాంగ్రెస్ నేతల ఆగ్రహం**

**హైదరాబాద్,అక్టోబర్ 28 :** మోడీ ఫాసిస్టు పాలనకు నూకలు చెల్లే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. నవంబర్ 1న ఢిల్లీలో నిర్వహించనున్న 'ఓట్ బచావోదేశ్ బచావో' నిరసన కార్యక్రమానికి వెళ్లేందుకు మిగతా2లో...

# రాష్ట్రంలో ఎమర్జెన్సీ తరహా పాలన!

**సబితా ఇంద్రారెడ్డి హౌస్ అరెస్టుపై హరీశ్‌రావు ఖండన**

**ప్రజల గొంతు నొక్కడం సరికాదు: నిరంజన్‌రెడ్డి**



**హైదరాబాద్,అక్టోబర్ 28:** మూసీ ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లకుండా మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని గృహ నిర్బంధం చేయడంతో పాటు, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, బీఆర్ఎస్ నేత కార్తిక్‌రెడ్డిని అరెస్టు చేయడాన్ని బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత, మాజీ మంత్రి టి. హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. ప్రతిపక్ష నేతలను నిర్బంధిస్తూ రాష్ట్రంలో ఎమర్జెన్సీ తరహా పాలన సాగించడం సిగ్గుచేటని బుధవారం విడుదల చేసిన ప్రకటనలో విమర్శించారు.

మిగతా2లో...

# అప్రమత్తంగా ఉండండి..

(మొదటి పేజీ తరువాయి)

పనిచేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. శుద్ధి చేసిన నీటిని వృథా చేయకుండా వివిధ అవసరాలకు వినియోగించేలా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని సూచించారు. భవిష్యత్తులో నీటి అవసరాలు పెరిగే అవకాశాలను దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే తగిన ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. **భవన నిర్మాణాల్లో శుద్ధి చేసిన నీటినే వాడాలి**సచివాలయం, ముఖ్యమంత్రి కార్యాలయం, ఔటర్ రింగ్ రోడ్డు, మెట్రో రైలు పరిధి, ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో పచ్చదనం నిర్వహణకు శుద్ధి చేసిన నీటిని వినియోగించాలని సీఎం సూచించారు. పబ్లిక్ పార్కుల నిర్వహణ, రోడ్ల శుభ్రతకు కూడా శుద్ధి చేసిన నీటినే ఉపయోగించాలని ఆదేశించారు. భవన నిర్మాణాల్లో శుద్ధి చేసిన నీటిని వినియోగించాలనే నిబంధనను కచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేశారు.ప్రైవేటు మురుగునీటి శుద్ధి కేంద్రాల ఏర్పాటును ప్రోత్సహించాలని, డేటా కేంద్రాలకు కూడా శుద్ధి చేసిన నీటిని సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్టీపీల నిర్వహణకు సౌర విద్యుత్తును వినియోగించే అవకాశాలను పరిశీలించాలని సంబంధిత అధికారులకు తెలిపారు. శుద్ధి కేంద్రాల్లో ఆధునిక సాంకేతిక ప్రమాణాలను పాటించాలని, నీటి నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని స్పష్టం చేశారు. **శుద్ధి కేంద్రాలపై నిరంతర పర్యవేక్షణ**ప్రతి మురుగునీటి శుద్ధి కేంద్రం వద్ద ప్రత్యేక అధికారిని నియమించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అన్ని కేంద్రాలను కమాండ్ కంట్రోల్ కేంద్రంతో అనుసంధానించి, వాటి పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. శుద్ధి చేసిన నీటిని సరఫరా చేసే ట్యాంకర్లను గుర్తించి పర్యవేక్షించేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ నీటి వినియోగంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని, శుద్ధి చేసిన నీటి సరఫరా కోసం ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎస్టీపీల నిర్వహణ, శుద్ధి చేసిన నీటి వినియోగానికి సంబంధించి నవంబర్ 1 నుంచి ఆదేశాలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. ప్రస్తుతం 26 మురుగునీటి శుద్ధి కేంద్రాల నుంచి శుద్ధి చేసిన నీటిని పచ్చరంగు ట్యాంకర్ల ద్వారా పంపిణీ చేస్తున్నట్లు జలమండలి అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. వినియోగదారుల నుంచి కేవలం రవాణా ఛార్జీలు మాత్రమే వసూలు చేస్తున్నామని, నీటిని ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. **సమీక్షలో ఉన్నతాధికారులు** ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి మాణిక్‌రాజ్, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన, మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డి, జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి, టీజీఎన్‌పీడీసీఎల్ ఎండీ జితేష్ వి. పాటిల్, కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శి రవి, సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ముకుందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కరువును సమిష్టిగా ఎదుర్కొందాం!

(మొదటి పేజీ తరువాయి)

ప్రభావం, వర్షాభావ పరిస్థితులపై అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో రాజకీయ విమర్శలకు తావివ్వకుండా ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా అన్ని పార్టీలు ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. **కేంద్రానికి నివేదిక.. అవసరమైతే ఢిల్లీకి అఖిలపక్షం**రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులపై కేంద్ర ప్రభుత్వానికి ఇప్పటికే నివేదిక పంపించామని భట్టి విక్రమార్క వెల్లడించారు. అవసరమైతే అఖిలపక్ష ప్రతినిధి బృందాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి తెలంగాణకు రావాల్సిన సహాయంపై కేంద్రాన్ని కోరుతామని తెలిపారు. సమావేశంలో వివిధ పార్టీల నేతలు చేసిన సూచనలను నమోదు చేసుకున్నామని, సాధ్యమైన మేరకు వాటిని ప్రభుత్వ కార్యాచరణలో భాగంగా అమలు చేసేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు.ఎల్‌నినో ప్రభావంపై గతంలో శాసనసభలో చర్చించామని, శాస్త్రవేత్తలు, నిపుణులతో సంప్రదింపులు జరిపామని వివరించారు. కరువు పరిస్థితులపై అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసిందని, ప్రజల్లో అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ఎదురయ్యే పరిస్థితులను ముందుగానే అంచనా వేసి అవసరమైన సన్నద్ధతతో ఉన్నామని తెలిపారు.**తాగునీరు, పశువుల మేతకు ప్రాధాన్యం** దేశవ్యాప్తంగా వర్షపాతం లోటు ఉండటంతో పాటు ఎగువ రాష్ట్రాల్లోనూ వర్షాలు తక్కువగా కురవడం వల్ల ప్రాజెక్టుల్లోకి నీటి ప్రవాహాలు తగ్గాయని భట్టి విక్రమార్క ఆందోళన వ్యక్తం చేశారు. రిజర్వాయర్లలో అందుబాటులో ఉన్న నీటి నిల్వలను దృష్టిలో ఉంచుకుని వనరులను సమర్థంగా వినియోగించుకునేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. వర్షాభావ ప్రభావాన్ని తగ్గించేందుకు శాఖలవారీగా సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.

# రాష్ట్రంలో ఎమర్జెన్సీ తరహా పాలన!

(మొదటి పేజీ తరువాయి)

**రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు**
కాంగ్రెస్ ప్రభుత్వం కరువు బారిన పడిన రైతులను, కష్టాల్లో ఉన్న ప్రజలను ఆదుకోవడం మానేసి, మూసీ ప్రక్షాళన పేరుతో రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు చేస్తామని చెప్పడం ఏమిటని హరీశ్‌రావు ప్రశ్నించారు. కరువు బాధిత రైతులను ఆదుకోవడంపై చూపాల్సిన శ్రద్ధను ప్రభుత్వం చూపడం లేదని విమర్శించారు. **రైతులకు ఎకరాకు రూ.50 వేల పరిహారం ఇవ్వాలి**
మూసీ ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లకుండా తనను, తన కుమారుడిని గృహ నిర్బంధం చేయడంపై మాజీ మంత్రి పి. సబితా ఇంద్రారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులను ఆదుకోకుండా మూసీ ప్రాజెక్టుకు రూ.1.40 లక్షల కోట్లు ఖర్చు చేస్తామనడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కరువు బారిన పడిన రైతులకు ఎకరాకు రూ.50 వేల పరిహారం చెల్లించాలని, కాళేశ్వరం నీటిని వినియోగించి పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్బంధాలకు పాల్పడినా ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు .**ప్రజాభిప్రాయ సేకరణ అందరితో జరపాలి** ప్రజాభిప్రాయ సేకరణ పేరుతో ప్రజల గొంతు నొక్కడం సరికాదని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. సబితా ఇంద్రారెడ్డి, ఇతర బీఆర్ఎస్ నేతల అరెస్టులను అక్రమంగా అభివర్ణించారు. మూసీ ప్రజాభిప్రాయ సేకరణ విషయంలో ప్రభుత్వం విభజించి పాలించే విధానాన్ని అనుసరిస్తోందని విమర్శించారు. ప్రజలందరితో ఒకేసారి అభిప్రాయ సేకరణ జరపాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ తప్పులకు ప్రజాక్షేత్రంలో శిక్ష తప్పదని హెచ్చరించారు.

# 12 మంది ఐఏఎస్ అధికారుల బదిలీలు

- **జయేష్ రంజన్‌కు పర్యావరణ శాఖ**
- **వికాస్ రాజ్‌కు ఇంధన శాఖ బాధ్యతలు**



**హైదరాబాద్, అక్టోబర్ 28 :** తెలంగాణ రాష్ట్రంలో పరిపాలనా సౌలభ్యం, శాఖల నిర్వహణ అవసరాల దృష్ట్యా ప్రభుత్వం 12 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేసింది. పలువురు అధికారులకు అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీలు, నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు.సీనియర్ ఐఏఎస్ అధికారి జయేష్ రంజన్‌ను పర్యావరణం, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించారు. పర్యావరణ పరిరక్షణ శిక్షణ, పరిశోధన సంస్థ (ఈపీటీఆర్ఐ) డైరెక్టర్ జనరల్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. రవాణా, రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న వికాస్ రాజ్‌ను ఇంధన శాఖకు బదిలీ చేశారు. ఇంధన శాఖలో పనిచేస్తున్న నవీన్ మిట్టల్‌ను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించారు.ఏ. వాణిప్రసాద్‌కు తెలంగాణ పురావస్తుశాఖ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. శైలజా రామయ్యర్‌ను రెవెన్యూ శాఖలో దేవాదాయ విభాగం ప్రభుత్వ ముఖ్య కార్యదర్శిగా నియమించారు. కే. ఇలంబర్తిని రవాణా, రహదారులు, భవనాల శాఖ కార్యదర్శిగా నియమించి, రవాణా శాఖ కమిషనర్ బాధ్యతలు కూడా అప్పగించారు. ఆయన పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖల కార్యదర్శిగా అదనపు బాధ్యతల్లో కొనసాగుతారు.హెచ్‌ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్‌కు మెట్రోపాలిటన్ ఏరియా, పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శిగా, జీహెచ్ఎంసీ, సైబరాబాద్, మల్కాజిగిరి పురపాలక సంస్థల ప్రత్యేక అధికారిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. రాహుల్ బొజ్జాకు గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బాధ్యతలు అదనంగా ఇచ్చారు. ఆయన వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ బాధ్యతల్లోనూ కొనసాగుతారు.మహిళా, శిశు సంక్షేమం, దివ్యాంగుల సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శిగా శృతి ఓఝాను నియమించారు. ఎస్. సంగీత సత్యనారాయణను ఆ శాఖ డైరెక్టర్‌గా నియమించారు. మహమ్మద్ ముషారఫ్ అలీ ఫారూఖీని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా నియమించి, తెలంగాణ రైతు విద్యుత్తు పంపిణీ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్‌కు తెలంగాణ పునరుత్పాదక ఇంధన అభివృద్ధి సంస్థ ఉపాధ్యక్షుడు, నిర్వహణ సంచాలకుడిగా అదనపు బాధ్యతలు ఇచ్చారు. పదవీ విరమణ నేపథ్యంలో ఎం. దానకిశోర్‌ను గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా తిరిగి నియమించారు.



# నేడు ఢిల్లీకి సీఎం రేవంత్‌రెడ్డి

**- ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ప్రచార కార్యక్రమంలో పాల్గొననున్న ముఖ్యమంత్రి**

**హైదరాబాద్, అక్టోబర్ 28 :** ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి గురువారం ఢిల్లీకి బయలుదేరి వెళ్లనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిం చనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. డిసెంబర్ 7 నుంచి 9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీలో జరగనున్న ఈ సదస్సు ద్వారా తెలంగాణలో పెట్టుబడుల అవకాశాలను పారిశ్రామికవేత్తలు, అంతర్జాతీయ ప్రతినిధులకు వివరించనున్నారు.ఇదిలా ఉండగా, నవంబర్ 4న హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించనున్న సదర్ ఉత్సవానికి హాజరుకావాలని శ్రీ కృష్ణ సదర్ సమ్మేళనం ఉత్సవ కమిటీ ప్రతినిధులు సీఎం రేవంత్‌రెడ్డిని ఆహ్వానించారు. ఈ మేరకు గురువారం ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, యాదాద్రి బోర్డు సభ్యురాలు ఈశ్వరమ్మ యాదవ్, మేడ్చల్ డీసీసీ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ఉద్యోగులకు 3 శాతం డీఏ పెంపు

(మొదటి పేజీ తరువాయి)

వెల్లడించింది. **గ్రామీణాభివృద్ధికి రూ.7,395 కోట్ల పథకం** ప్రధానమంత్రి వికసిత్ గ్రామ స్వరాజ్ యోజనకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఐదేళ్లలో రూ.7,395.55 కోట్ల వ్యయంతో 202627 నుంచి 203031 వరకు ఈ పథకాన్ని అమలు చేయనున్నారు. దేశవ్యాప్తంగా 2.78 లక్షలకు పైగా గ్రామీణ స్థానిక సంస్థలకు ప్రయోజనం చేకూరనుంది.**కంటైనర్, క్రీడా వస్తువుల తయారీకి ప్రోత్సాహం** దేశీయ కంటైనర్ తయారీ పరిశ్రమను బలోపేతం చేసేందుకు రూ.10 వేల కోట్ల ప్రోత్సాహక పథకానికి ఆమోదం తెలిపారు. అలాగే క్రీడా వస్తువుల తయారీ రంగ అభివృద్ధికి రూ.1,856.67 కోట్లతో ఖేలో ఇండియా పథకాన్ని అమలు చేయనున్నారు. ఈ నిర్ణయాలతో దేశీయ తయారీ రంగం, గ్రామీణ స్థానిక సంస్థల అభివృద్ధికి ఊతం లభించనుంది.

# ఓటరు జాబితాలో పేరుంటే మళ్లీ ఫారం6 ఎందుకు?

(మొదటి పేజీ తరువాయి)

ధర్మాసనం విచారణ సందర్భంగా, చిరునామా మార్పులు, ఓటరు వివరాల సవరణలకు సాధారణంగా ఫారం8 ఉపయోగిస్తారని పేర్కొంది. పిటిషనర్ల తరపున న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదిస్తూ, ఢిల్లీలో ముసాయిదా ఓటర్ల జాబితా నుంచి సుమారు 43 లక్షల మంది పేర్లు తొలగించారని తెలిపారు. గతంలో ఓటర్లుగా నమోదైనవారిని తిరిగి చేర్చేందుకు ఫారం6 కోరడం వల్ల సమస్యలు తలెత్తుతున్నాయని అభ్యంతరం వ్యక్తం చేశారు.ఎన్యుమరేషన్ ఫారాలను గడువు ముగిసిన తర్వాత కూడా స్వీకరించే అంశాన్ని పరిశీలించాలని సుప్రీంకోర్టు సూచించింది. తుది ఓటర్ల జాబితా సిద్ధమయ్యే వరకు అర్హులైనవారు తమ వివరాలు సమర్పించేందుకు అవకాశం కల్పించాలని పేర్కొంది. ఈ ప్రక్రియపై ప్రజలకు అర్థమయ్యే భాషలో విస్తృత అవగాహన కల్పించాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

# ఏపీలో పరిషత్ ఎన్నికలు వాయిదా!

(మొదటి పేజీ తరువాయి)

అక్టోబర్ 28న జరగాల్సిన పోలింగ్‌ను నవంబర్ 1కు, అక్టోబర్ 30న నిర్వహించాల్సిన ఓట్ల లెక్కింపును నవంబర్ 3కు మార్చింది. దీంతో నవంబర్ 3న మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ ఒకే రోజు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన పోలీసు సిబ్బంది, ఇతర సిబ్బంది అందుబాటును దృష్టిలో ఉంచుకుని పరిషత్ ఎన్నికల తేదీలను సవరించినట్లు సమాచారం.**తాజా షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు** స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను కొనసాగించాలని సుప్రీంకోర్టు ఆదేశించిన నేపథ్యంలో ఎన్నికల సంఘం ఈ మార్పులు చేసింది. తాజా షెడ్యూల్ ప్రకారం నవంబర్ 5న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ నిర్వహించనున్నారు. నవంబర్ 6న అవసరమైన చోట రీపోలింగ్ చేపట్టనున్నారు. నవంబర్ 7న ఓట్ల లెక్కింపు నిర్వహించి ఫలితాలను ప్రకటించనున్నారు.ఎన్నికల తేదీల మార్పుతో అధికారులు ఏర్పాట్లను సమన్వయం చేసుకునేందుకు అవకాశం కలగనుంది. అభ్యర్థులు, రాజకీయ పార్టీలు సవరించిన షెడ్యూల్‌కు అనుగుణంగా తమ ఎన్నికల కార్యక్రమాలను రూపొందించుకోవాల్సి ఉంటుంది.

# మోడీ ఫాసిస్టు పాలనకు నూకలు చెల్లే రోజులు దగ్గర్లోనే!

(మొదటి పేజీ తరువాయి)

ప్రత్యేక రైళ్లు కేటాయించకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా ఢిల్లీకి వెళ్లి నిరసనను విజయవంతం చేస్తామని స్పష్టం చేశారు.**దక్షిణ మధ్య రైల్వే కార్యాలయం ఎదుట ధర్నా** ఢిల్లీలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమానికి వెళ్లేందుకు ప్రత్యేక రైళ్లు కేటాయించాలని కాంగ్రెస్ నేతలు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌ను కోరారు. ఇందుకు నిరాకరించడంతో బుధవారం సికింద్రాబాద్‌లోని జీఎం కార్యాలయం ఎదుట కాంగ్రెస్ నాయకులు మెరుపు ధర్నా చేపట్టారు. మహేశ్‌కుమార్ గౌడ్‌తో పాటు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఆందోళనలో పాల్గొన్నారు. అనంతరం పలువురు నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.**బస్సుల్లో ఢిల్లీకి తరలింపు** ప్రత్యేక రైళ్ల కోసం ఆరు రోజుల ముందే దరఖాస్తు చేసినప్పటికీ చివరి నిమిషంలో తిరస్కరించారని మహేశ్‌కుమార్ గౌడ్ విమర్శించారు. నిరసన కార్యక్రమానికి వెళ్లకుండా అడ్డుకునేందుకే ఇలా చేస్తున్నారని ఆరోపించారు. అయినప్పటికీ తెలంగాణ నుంచి భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు ఢిల్లీకి తరలివెళ్తారని తెలిపారు. ఇందుకోసం అవసరమైన బస్సులు, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో జరిగే నిరసనను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

# వణికిస్తున్న అర్నాబ్ తుపాను!

- **పంటలకు తీవ్ర నష్టం.. అప్రమత్తమైన అధికార యంత్రాంగం**

**హైదరాబాద్, అక్టోబర్ 28 :**అర్నాబ్ తుపాను ప్రభావంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వరి పంట నేలకొరగగా, పత్తి, మొక్కజొన్న, మిర్చి పంటలకు నష్టం వాటిల్లింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సరాసరి 10.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులతో పరిస్థితిని సమీక్షించి ప్రజల భద్రతకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విద్యాసంస్థలకు సెలవు ప్రకటించగా, ఖమ్మం జిల్లాలో పరిస్థితులను బట్టి సెలవులు ప్రకటించాలని అధికారులు ఆదేశించారు. గోదావరి పరివాహక, లోతట్టు ప్రాంతాల్లో అప్రమత్తత పెంచి సహాయక బృందాలను సిద్ధంగా ఉంచారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని, విద్యుత్ తీగలు, పాత గోడలు, పెద్ద చెట్లకు దూరంగా ఉండాలని అధికారులు సూచించారు. పంట నష్టానికి పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

# ఉద్యోగులు ఏఐపై అవగాహన పెంచుకోవాలి

**హైదరాబాద్, అక్టోబర్ 28 :**మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా ప్రభుత్వ ఉద్యోగులందరూ కృత్రిమ మేధస్సు (ఏఐ)పై అవగాహన పెంచుకోవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచించారు. ఏఐ సాధనాలను సమర్థవంతంగా వినియోగించుకొని ప్రభుత్వ పనులను వేగవంతం చేయడంతోపాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కోరారు.హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో బుధవారం ప్రణాళికా శాఖ, టీజీ మ్యాథ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఏఐ సాక్షిమ్' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉత్తర్వుల గుర్తింపు, నివేదికల తయారీ, సమాచార విశ్లేషణ, ప్రజల సమస్యల పరిష్కారం వంటి పనుల్లో కృత్రిమ మేధస్సు ఉపయోగపడుతుందని తెలిపారు. రైతుల దరఖాస్తులు త్వరగా పరిష్కారం కావడం, పింఛనుదారులకు అవసరమైన సమాచారం సులభంగా అందడం వంటి ప్రయోజనాలు ప్రజలకు కలగాలని పేర్కొన్నారు.

విద్యుత్ డిమాండ్‌ను అంచనా వేయడం, పరికరాల్లో లోపాలను ముందుగానే గుర్తించడం, అభివృద్ధి పనుల్లో జాప్యానికి కారణాలను విశ్లేషించడం వంటి అంశాల్లోనూ ఏఐని వినియోగించుకోవచ్చని చెప్పారు. అయితే ఏఐ సాధనాలను ఉపయోగించేటప్పుడు సమాచార భద్రత, కచ్చితత్వం, బాధ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. ఏఐ ద్వారా లభించిన సమాచారాన్ని అధికారికంగా వినియోగించే ముందు ధ్రువీకరించుకోవాలని సూచించారు. ప్రభుత్వ శాఖల్లో ఏఐ వినియోగానికి అనువైన పనులను గుర్తించి, తొలుత ప్రయోగాత్మకంగా అమలు చేసి ఫలితాల ఆధారంగా విస్తరించాలని భట్టి విక్రమార్క కోరారు.

# రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు చలిగల్ విద్యార్థిని రిషిక

### జగిత్యాల జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం



**చర్ల, జగిత్యాల, అక్టోబర్ 28:**జగిత్యాల రూరల్ మండలం చలిగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని రిషిక రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైంది. జగిత్యాల మినీ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరిచిన రిషిక.. జగిత్యాల జిల్లా సీనియర్ మహిళల కబడ్డీ జట్టుకు ఎంపికై తన ప్రతిభను చాటుకుంది.ఈ నెల 28వ తేదీ నుంచి సత్తుపల్లిలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి మహిళల కబడ్డీ టోర్నమెంట్‌లో రిషిక జిల్లా జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించనుందని పాఠశాల పీడీ వెంకటలక్ష్మి తెలిపారు.రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన రిషికను అభినందిస్తూ పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, చలిగల్ గ్రామ సర్పంచ్ జున్ను రాజేందర్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ నీరటి సుకన్యతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు రిషికను అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ రాణించి పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# ప్రభుత్వం వెంటనే కరువు ప్రాంతాలుగా గుర్తించాలి



**నేటి చర్చ:-** హుస్నాబాద్: సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గంలోని మూడు మండలాలు.
హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించాలి.
కేంద్రమంత్రి బండి సంజయ్, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ కృషి చేయాలి..
కవ్వ వేణుగోపాల్ రెడ్డి
భారతీయ కిసాన్ సంఘ్ హుస్నాబాద్ డివిజన్ ఇంచార్జి

సిద్దిపేట జిల్లాలోని హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ మండలాలను వెంటనే కరువు ప్రాంతాలుగా ప్రకటించాలని భారతీయ కిసాన్ సంఘ్ డివిజన్ ఇన్‌చార్జి కవ్వ వేణుగోపాల్ రెడ్డి కోరారు. ప్రస్తుతం ప్రకటించిన కరువు మండలాల జాబితాలో ఈ మూడు మండలాలకు చోటు దక్కలేదని పేర్కొన్నారు. ఈ విషయంపై కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, హుస్నాబాద్ ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవ తీసుకుని సంబంధిత అధికారులతో మాట్లాడాలని విజ్ఞప్తి చేశారు.ఈ ప్రాంతంలో సాగునీటి ప్రాజెక్టులు, కాలువలు లేకపోవడంతో రైతులు వర్షాధార వ్యవసాయంపైనే ఆధారపడుతున్నారని తెలిపారు. తక్కువ వర్షపాతం కారణంగా ఇప్పటికే బోర్లు, బావులు ఎండిపోయాయని, భూగర్భ జలాలు అడుగంటడంతో తాగునీటికి సైతం ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. రైతులు, ప్రజల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని మూడు మండలాలను కరువు ప్రాంతాలుగా గుర్తించి తగిన సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

# పకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం



**నేటి చర్చ:-** హుస్నాబాద్: ప్రకృతి వ్యవసాయంతో నేల, ఆరోగ్యం పరిరక్షణ గురించి. మండల వ్యవసాయ అధికారి వేల్పుల పూజ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అవలంబించడం ద్వారా సాగు ఖర్చులు తగ్గించుకోవడంతో పాటు నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని వ్యవసాయ శాఖ అధికారి వేల్పుల పూజ సూచించారు. బుధవారం బంజేరుపల్లి గ్రామంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. జీవామృతం, ఘన జీవామృతం, బీజామృతం, వేప ఆధారిత కషాయాల వినియోగం, పశువుల ఎరువు, పంట అవశేషాలు, పచ్చిరొట్ట ఎరువులు, అంతర పంటలు, పంట మార్పిడి వంటి పద్ధతుల ద్వారా నేలలో సేంద్రియ పదార్థాన్ని పెంచుకోవచ్చని వివరించారు. రసాయన ఎరువులు, పురుగుమందులపై ఆధారపడటాన్ని తగ్గించి స్థానికంగా లభించే సహజ వనరులను వినియోగించుకోవాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయంతో నేలలో సూక్ష్మజీవుల చైతన్యం, తేమ నిలుపుకొనే సామర్థ్యం పెరుగుతాయని తెలిపారు. రైతులు తొలుత తమ పొలాల్లో కొంత విస్తీర్ణంలో ఈ పద్ధతులను అమలు చేసి, అనుభవం ఆధారంగా విస్తరించాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి విజయ్, ఎన్ఎంఎన్ఎఫ్ ఫీల్డ్ అసిస్టెంట్ ప్రశాంత్, గ్రామ సర్పంచ్, రైతులు రిక్కుల రాజిరెడ్డి, బాణాల శంకర్‌రెడ్డి, నందరెడ్డి, ఇప్ప నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రేషన్ కార్డుదారులకు శుభవార్త




**నేటి చర్చ:- హుస్నాబాద్:** ఇక సబ్సిడీపై నిత్యావసరాలు సర్కార్ సూపర్ ప్లాన్
ఎల్‌నినో (El Nino) ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడి, బహిరంగ మార్కెట్‌లో నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్న నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం ప్రజలపై ఆర్థిక భారం తగ్గించేందుకు కీలక సన్నాహాలు చేస్తోంది.వర్షాభావం వల్ల పంటల దిగుబడి తగ్గి సరుకుల ధరలు విపరీతంగా పెరగడంతో సామాన్యుల ఇంటి బడ్జెట్ తలకిందులవుతోంది. ఈ పరిస్థితుల నుంచి పేద, మధ్యతరగతి ప్రజలను గట్టెక్కించేందుకు రేషన్ దుకాణాల ద్వారా బియ్యంతో పాటు కందిపప్పు, గోధుమ పిండి, పంచదార, పామాయిల్, చింతపండు, కారంపొడి వంటి నిత్యావసర సరుకులనుఅతి తక్కువ సబ్సిడీ ధరలకే పంపిణీ చేసేందుకు పౌరసరఫరాల శాఖ సమగ్ర కార్యాచరణ రూపొందిస్తోంది.

# చింతకుంట చెరువు పరిరక్షణకు కలెక్టర్ కార్యాచరణ


### చెరువు స్థలాన్ని కాపాడేందుకు సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలి

**చర్ల, జగిత్యాల, అక్టోబర్ 28:**జగిత్యాల మున్సిపల్ పరిధిలోని చింతకుంట చెరువు పరిరక్షణకు సమగ్ర ప్రణాళిక రూపొందించి, తక్షణమే చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు.
బుధవారం మున్సిపల్, నీటిపారుదల శాఖల అధికారులతో కలిసి చింతకుంట చెరువును క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్ చెరువు ప్రస్తుత పరిస్థితి, పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. చెరువు స్థలాన్ని కాపాడటంతో పాటు భవిష్యత్తులో ఆక్రమణలకు తావులేకుండా అవసరమైన రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.



అనంతరం నూతన కోర్టు భవనాల సముదాయానికి కేటాయించిన స్థలాన్ని, ఆర్డీవో కార్యాలయ భవన నిర్మాణానికి కేటాయించిన భూమిని పరిశీలించి సంబంధిత వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.
మున్సిపల్ పరిధిలోని వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (డబ్ల్యూటీపీ)ను సందర్శించి పనుల పురోగతిని సమీక్షించారు. ప్రజలకు తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు ప్రాధాన్యమివ్వడంతో పాటు, ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పనుల పురోగతిని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు.ఈ పర్యటనలో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్‌తో పాటు మున్సిపల్, ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# అక్కన్నపేట మండల రజక సంఘ అధ్యక్షుడిగా రఘుపతి



**నేటి చర్చ:- హుస్నాబాద్/ అక్కన్నపేట :** అక్కన్నపేట మండలం రజక సంఘం ఎన్నికలు బుధవారం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్ గణేష్, జిల్లా అధ్యక్షుడు ఐలయ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ధీటి రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అంతకపేట గ్రామానికి చెందిన జంగపల్లి రఘుపతి మండల అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా ఊళ్లెంగుల రాజు, ప్రధాన కార్యదర్శిగా తంగళ్ళపల్లి పరుశురాములు, కార్యదర్శిగా కొలిపాక అశోక్, కోశాధికారిగా వంగపల్లి రాజు, ప్రచార కార్యదర్శిగా పాండ్రాల మోహన్ బాబు, కార్యవర్గ సభ్యులుగా బందారం రమేష్, వంగపల్లి సమ్మయ్య, తంగళ్ళపల్లి రమేష్, కొలుగూరి అజయ్, కోలిపాక రమేష్, జంగపల్లి రాజశేఖర్, కొలుగూరి కుమార్, నాంపల్లి పోచయ్య, గంపల బాలయ్య, జంగపల్లి రవీందర్ పరుశురాములు ఎన్నికయ్యారు. ఎన్నికైన వారికి రాష్ట్ర, జిల్లా నాయకులు నియామక పత్రాలు అందజేసి మాట్లాడుతూ..రాష్ట్రంలో రజకులు అనేక రంగాల్లో వెనుకబడి పోతున్నారని అన్నారు. కులావృత్తి చేసుకునే రజకులపై అనేక దాడులు జరుగుతున్నాయని, ముఖ్యంగా మహిళలు ఇండ్లలో పనిచేసే సమయంలో అఘాయిత్యాలు చేస్తున్నారని ఆరోపించారు. అంతేకాకుండా బీసీ-ఏలో రజకులతో పాటు 56 కులాలు ఉన్నాయని, వీరంతా సంచార జాతులని, ఇప్పుడిప్పుడే చదువుకొని ముందుకు వస్తున్న వీరు అంబేద్కర్ అందించిన రిజర్వేషన్ అనుభవిస్తూ ఉన్నారని అన్నారు. ఇలా వెనుకబడిన జాతులు ఉన్న బీసీ-ఏలో, ఆర్థికంగా సామాజికంగా, రాజకీయంగా బలంగా ఉన్న ముదిరాజులను కలుపుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పడం దారుణమని అన్నారు. ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన పండుగ సాయన్న జయంతిలో ఈ విషయాన్ని రేవంత్ రెడ్డి ప్రస్తావించారని, వెంటనే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని హెచ్చరించారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా 36లక్షలకు పైగా బీసీ-ఏ లో కొనసాగుతున్న సంచార జాతులమంతా ఒక్కటై తిరుగుబాటు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల రజక సంఘం నాయకులు, తదితరులు, పాల్గొన్నారు.

# వికారాబాద్‌లో మెగా రక్తదాన శిబిరం.. 467 యూనిట్ల రక్తం సేకరణ

### రక్తదానం ప్రాణదానంతో సమానం -- జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రో
### రక్తదాతలను అభినందించిన అదనపు ఎస్పీ రాజేష్ మీనా

**వికారాబాద్ జిల్లా బ్యూరో :** పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ పోలీస్ ఫ్లాగ్ డే కార్యక్రమాల్లో భాగంగా వికారాబాద్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం వికారాబాద్ పట్టణంలోని కొండ బాలకృష్ణారెడ్డి ఫంక్షన్ హాల్‌లో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో మొత్తం 467 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రో కార్యక్రమంలో పాల్గొని రక్తదాన శిబిరాన్ని పరిశీలించడంతో పాటు స్వచ్ఛందంగా రక్తదానం చేసిన దాతలను అభినందించారు.

**అమరవీరుల త్యాగాలకు ఘన నివాళి**

విధి నిర్వహణలో ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణ కోసం పోరాడుతూ ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరుల సేవలను స్మరించుకోవడం, వారి ఆశయాలకు అనుగుణంగా సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం ఈ శిబిరం ప్రధాన ఉద్దేశమని పోలీస్ శాఖ తెలిపింది. అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ ఆపదలో ఉన్నవారికి ప్రాణదానం చేసే రక్తదానం వంటి సేవా కార్యక్రమాలను నిర్వహించారు.
ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రో మాట్లాడుతూ.. రక్తదానం గొప్ప మానవతా సేవ అని, ప్రమాదాలు, అత్యవసర వైద్య పరిస్థితులు, శస్త్రచికిత్సల సమయంలో రక్తం అవసరమైన వారికి సకాలంలో రక్తాన్ని అందించడం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. ఆరోగ్య పరిస్థితులు అనుకూలంగా ఉన్న ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పోలీస్ శాఖ ప్రజల భద్రతతో పాటు సామాజిక సంక్షేమం కోసం కూడా నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు.









**సందీప్ కుమార్‌కు అభినందన పత్రం**

ఈ రక్తదాన శిబిరంలో వికారాబాద్ పట్టణంలోని సందీప్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు, సుప్రసిద్ధ వ్యాపారవేత్త కోటపల్లి సందీప్ కుమార్ స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయనకు వికారాబాద్ జిల్లా అదనపు ఎస్పీ రాజేష్ మీన, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి తరఫున అభినందన పత్రాన్ని అందజేశారు. రక్తదానం చేసిన ఇతర దాతలకు కూడా ఎస్పీ, అదనపు ఎస్పీ ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు.
రక్తదాన శిబిరంలో రెడ్‌క్రాస్, తలసేమియా అండ్ సికిల్ సెల్ సొసైటీ ప్రతినిధులతో పాటు వికారాబాద్, తాండూరు ప్రభుత్వ ఆసుపత్రుల వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొని సహకరించారు. రక్తదాతలకు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం వైద్యుల పర్యవేక్షణలో రక్తాన్ని సేకరించారు. వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు, యువత, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఉత్సాహంగా పాల్గొని సామాజిక సేవలో భాగస్వాములయ్యారు.
ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రాజేష్ మీన, వికారాబాద్ డీఎస్పీ అంజయ్య, ఏఆర్ డీఎస్పీ వీరేష్, వికారాబాద్ పట్టణ ఇన్‌స్పెక్టర్ రఘు కుమార్, మొమిన్‌పేట సీఐ వెంకట్, ధారూర్ సీఐ రఘురాములు, తాండూరు ఇన్‌స్పెక్టర్ పరమేశ్వర్, కరణ్‌కోట్ సీఐ ప్రవీణ్ కుమార్, పలువురు ఎస్సైలు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల రక్షణ చట్టం రావాలి.!

### ప్రత్యేక చట్టం కొరకు ప్రభుత్వం కృషి చెయ్యాలి
### ఐఎఫ్‌డబ్ల్యూజే వ్యవస్థాపక వేడుకల్లో
### టీడబ్ల్యూజేఎఫ్ డిమాండ్
### భారీగా పాల్గొన్న జర్నలిస్టులు

**కుత్బుల్లాపూర్ :** జర్నలిస్టులపై దాడులు, హత్యలు, అక్రమ కేసులను అరికట్టి వారి రక్షణకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకురావాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు జాతీయ రిజిస్టర్ ఏర్పాటు చేయడంతోపాటు 60 ఏళ్లు దాటిన సీనియర్ పాత్రికేయులకు జాతీయ పెన్షన్ పథకం అమలు చేయాలని కోరారు.
బుధవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా టీడబ్ల్యూజేఎఫ్ కమిటీ ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సూరారంలోని బాబు జగ్జీవన్‌రామ్, అంబేద్కర్ భవన్‌లో ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఐఎఫ్‌డబ్ల్యూజే) 76వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మామిడి సోమయ్య, తన్నీరు శ్రీనివాస్ పలువురు సీనియర్ జర్నలిస్టులను సన్మానించారు. అనంతరం కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఐఎఫ్‌డబ్ల్యూజే వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 1950లో సీనియర్ జర్నలిస్టుల ఆధ్వర్యంలో ఏర్పాటైన ఐఎఫ్‌డబ్ల్యూజే దేశంలోని తొలి జర్నలిస్టు సంఘంగా గుర్తింపు పొందిందని పేర్కొన్నారు. దాని అనుబంధ సంఘమైన టీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో తెలంగాణవ్యాప్తంగా వేడుకలు జరుగుతున్నాయని తెలిపారు.




ఐఎఫ్‌డబ్ల్యూజే జాతీయ కౌన్సిల్ సభ్యుడు జగదీష్, టీడబ్ల్యూజేఎఫ్ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డమీది అశోక్ మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. దేశవ్యాప్తంగా పనిచేస్తున్న జర్నలిస్టుల వివరాలను ధ్రువీకరించి, మీడియా సంస్థల వారీగా గుర్తింపు కల్పించేందుకు జాతీయ రిజిస్టర్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సీనియర్ జర్నలిస్టులకు పెన్షన్ సదుపాయం కల్పించడంతోపాటు గతంలో అమల్లో ఉన్న జర్నలిస్టుల రైల్వే రాయితీ పాసులను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు.



జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు, పూర్తిస్థాయిలో అక్రిడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులు అందజేస్తామని ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను అమలు చేయాలని అన్నారు. సొంత ఇళ్లు లేక అనేకమంది జర్నలిస్టులు అద్దె ఇళ్లలో నివసిస్తూ జీవనం సాగిస్తున్నారని, వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వాలు చొరవ చూపాలని కోరారు.
ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ జాతీయ కౌన్సిల్ సభ్యుడు కుంచం శ్రీనివాస్, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి. రవికుమార్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నాగరాజ్ గౌడ్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా నాయకులు పి. శంకర్, కావలి మోహన్, కుత్బుల్లాపూర్ ప్రధాన కార్యదర్శి ఏ. గోవిందరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ శివకుమార్, కూకట్‌పల్లి టీడబ్ల్యూజేఎఫ్ అధ్యక్షుడు యాకన్న, కార్యదర్శి అంజి తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## పౌరులే ప్రథమం ఫలితాలే ప్రధానం



ఎన్నికైన ప్రభుత్వాలకు కేంద్రంలో, రాష్ట్రంలో సారథ్యం వహిస్తూ నరేంద్ర మోడీ ప్రజా జీవితంలో 25 ఏళ్లు పూర్తి చేసుకున్నారు. ఈ కాలంలో తొలుత గుజరాత్‌లో, ఆ తర్వాత దేశవ్యాప్తంగా మౌలిక సదుపాయాల విస్తరణకు ఆయన నాయకత్వం వహించారు. వాటి పరిమాణంతోపాటు నాణ్యత కూడా గణనీయంగా పెరిగింది. ముఖ్యమంత్రిగా మోడీ హయాంలో గుజరాత్‌లో రహదారులు, విద్యుత్తు, ఓడరేవులు, రవాణా అనుసంధాన వ్యవస్థల్లో వచ్చిన మార్పులు ఆ రాష్ట్ర అభివృద్ధి ప్రస్థానంలో కీలక భాగంగా నిలిచాయి. జాతీయ స్థాయిలో మౌలిక సదుపాయాల రంగంలో వచ్చిన మార్పులు అత్యంత గణనీయమైనవి. 2014లో దేశంలో 74 విమానాశ్రయాలు ఉండగా, ఆ సంఖ్య ఇప్పుడు 165కు పెరిగింది. వాటిలో కొన్ని ప్రపంచంలోనే అత్యుత్తమ విమానాశ్రయాల సరసన నిలుస్తున్నాయి. దర్భంగా, గయ వంటి చిన్న నగరాల నుంచి ఢిల్లీ, ముంబై, కోల్‌తతా, బెంగళూరు తదితర నగరాలకు నేడు రోజూ పలుమార్లు విమాన సర్వీసులు నడుస్తున్నాయి.నా కెరీర్ తొలినాళ్లలో నేను పనిచేసిన ప్రాంతాల్లో ఈ నగరాలు కూడా ఉన్నాయి. రైల్వే వ్యవస్థలోనూ భారీ విస్తరణ, ఆధునికీకరణ చోటుచేసుకున్నాయి. ప్రత్యేక సరుకు రవాణా కారిడార్లు, రైల్వేలైన్ల విద్యుదీకరణ నుంచి వందేభారత్ రైళ్లు అందిస్తున్న ఉన్నత స్థాయి ప్రయాణ అనుభవం, పునరాభివృద్ధి చేసిన రైల్వేస్టేషన్ల వరకు అనేక మార్పులు వచ్చాయి. జాతీయ రహదారులు గణనీయంగా విస్తరించాయి. కొత్త ఎక్స్‌ప్రెస్ వేలు, ఓడరేవులు, మెట్రో రైలు వ్యవస్థలు దేశంలో రవాణా అనుసంధాన స్వరూపాన్నే మార్చేశాయి. నేడు దేశంలోని వివిధ ప్రాంతాల్లో ప్రయాణించే భారతీయులకు, గతంలో విదేశాలకు వెళ్లినప్పుడు మాత్రమే లభించే రహదారి ప్రయాణ అనుభవం స్వదేశంలోనూ అందుబాటులోకి వచ్చింది. భారత్ లాజిస్టిక్స్ పనితీరు ర్యాంకు గణనీయంగా మెరుగుపడింది. 2014లో 54వ స్థానంలో ఉన్న భారత్ 2023 నాటికి 16 స్థానాలు ఎగబాకి 38వ స్థానానికి చేరుకుంది. అదే సమయంలో స్థూల దేశీయోత్పత్తి (జిడిపి)లో లాజిస్టిక్స్ వ్యయం 7.97 శాతానికి తగ్గింది.ఇది ఆర్థిక పోటీతత్వానికి ఊతమిచ్చింది. కంటికి కనిపించే ఈ మార్పులు సహజంగానే విస్తృత దృష్టిని ఆకర్షించాయి. అయితే, మోడీ పాలనలో వచ్చిన మరింత ప్రాథమికమైన మార్పు ఏమిటంటే, మౌలిక సదుపాయాలను ఎలా భావించాలి, ఎలా ప్రణాళికలు రూపొందించాలి, ఎలా అమలు చేయాలి అన్న విషయంలో పూర్తిగా కొత్త దృక్పథం ఏర్పడటం. నా అనుభవంలో, మౌలిక సదుపాయాల నిర్వహణలో ఎదురయ్యే సమస్యలకు చాలా అరుదుగా ఒక్క తప్పుడు నిర్ణయమే కారణమవుతుంది. విడివిడిగా చూస్తే సమంజసంగా అనిపించే అనేక నిర్ణయాలు ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేకపోవడమే అసలు సమస్య. ఫలితంగా, అన్ని భాగాల ప్రయోజనాలను కలిపినా సమగ్ర వ్యవస్థ అందించాల్సిన ప్రయోజనం అందదు. ఈ వాస్తవాన్నిమోడీ దాదాపు సహజ సిద్ధమైన అవగాహనతో గుర్తించారు. ఒక నిర్దిష్ట సదుపాయాన్ని నిర్మించే శాఖ కోణం నుంచే మౌలిక సదుపాయాలను చూడకుండా, ఆ నిర్మాణం ద్వారా సాధించాల్సిన విస్తృత ఫలితంపై ఆయన దృష్టి సారించారు.ఫలితాలకు ప్రాధాన్యమిస్తూ, పౌరులను కేంద్రంగా చేసుకునే ఈ దృక్పథం ఆయన పరిపాలనా విధానంలో ప్రధాన లక్షణంగా నిలిచింది. మోడీ విధానంలో సాంకేతిక పరిజ్ఞాన వినియోగం మరో ముఖ్యమైన అంశం. గుజరాత్‌లో బిసాగ్ (బిఐఎస్ ఎజి) సంస్థ ఉపగ్రహ అనువర్తనాలు, భౌగోళిక సమాచార వ్యవస్థలు, ప్రాదేశిక ప్రణాళికల రూపకల్పనలో సామర్థ్యాన్ని పెంపొందించింది. భౌగోళిక సమాచారంతో రాష్ట్ర భౌగోళిక స్వరూపాన్ని దృష్టిలో ఉంచుకుని అభివృద్ధిని సమగ్రంగా పరిశీలించడం సాధ్యమైంది. భూమి, రహదారులు, జలవనరులు, నివాస ప్రాంతాలు, పరిశ్రమలు, ఇతర మౌలిక సదుపాయాలకు సంబంధించిన సమాచారాన్ని ఒకచోట చేర్చడం ద్వారా అభివృద్ధిలోని వివిధ అంశాల మధ్య సంబంధాలను మరింత సమగ్రంగా అర్థం చేసుకునే అవకాశం లభించింది. ఈ నేపథ్యమే జాతీయ స్థాయిలో గతి శక్తి కార్యక్రమాన్ని ప్రారంభించడానికి మార్గం సుగమం చేసింది. గుజరాత్‌లో అప్పటికే ఉన్న విధానాన్ని యథాతథంగా దేశవ్యాప్తంగా అమలు చేయడమే పిఎం గతిశక్తి ప్రాధాన్యం కాదు.భౌగోళిక పరిస్థితులు, మౌలిక సదుపాయాలు, ఆర్థిక కార్యకలాపాలను పరస్పరం అనుసంధానమైన అంశాలుగా పరిగణించే పరిపాలనా దృక్పథాన్ని మరింత విస్తృత స్థాయిలో దేశమంతటా అమలు చేయడమే దీని ప్రత్యేకత. వివిధ కేంద్ర మంత్రిత్వ శాఖలు, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను ఒకే వేదికపైకి తీసుకొచ్చి, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు సమగ్ర ప్రణాళికలు రూపొందించడంతోపాటు సమన్వయంతో అమలు చేసేలా గతిశక్తి దోహదపడింది. తద్వారా ప్రభుత్వం మొత్తం ఒకే సమగ్ర వ్యవస్థగా పనిచేసే విధానానికి బాటలు పడ్డాయి. గతిశక్తి ప్రారంభానికి ముందు ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం ఉండేది కాదా? అనే ప్రశ్న సహజంగానే తలెత్తవచ్చు. కచ్చితంగా ఉండేది. అయితే, ప్రభుత్వాలు సంప్రదాయంగా అనుసరించిన సమన్వయ విధానానికి, గతిశక్తి వ్యవస్థాగతంగా అమలు చేయాలనుకుంటున్న విధానానికి మధ్య ప్రాథమికమైన తేడా ఉంది.గతిశక్తి, ప్రగతి కార్యక్రమాలు కలిపి మోడీ పరిపాలనా విధానంలోని ఒక ప్రత్యేక లక్షణాన్ని స్పష్టం చేస్తున్నాయి.ఒకవైపు మొత్తం వ్యవస్థను సమగ్రంగా చూడటం, మరోవైపు ఒక్కో ప్రాజెక్టు పనులను నిలిపివేయగల నిర్దిష్ట అడ్డంకులపై దృష్టి పెట్టడం ఈ విధానంలో కనిపిస్తుంది. వివిధ భాగాలు పరస్పరం ఎలా అనుసంధానమై ఉన్నాయో అర్థం చేసుకోకుండా మౌలిక సదుపాయాల ప్రణాళికలను సమర్థంగా రూపొందించలేం. అలాగే, అమలులోని ప్రతి అంశాన్ని జాగ్రత్తగా పరిష్కరించకుండా ప్రాజెక్టులను సమర్థంగా పూర్తి చేయలేం. సమగ్ర ప్రణాళికలు, నిరంతర పర్యవేక్షణ, సమస్యల పరిష్కారంపై నిలకడైన దృష్టి.. ఈ మూడింటి సమ్మేళనం వల్ల గతంలో ఎన్నడూ లేనంత విస్తృత స్థాయిలో, మరింత సమర్థంగా మౌలిక సదుపాయాల అభివృద్ధి సాధ్యమైంది. పౌరులకు ఎలాంటి అంతరాయాలు లేని సౌకర్యవంతమైన అనుభవాన్ని అందించడం, విస్తృత ఆర్థిక వ్యవస్థ ఉత్పాదకతను పెంచడం అనే లక్ష్యాలతో, మొత్తం వ్యవస్థను సమగ్రంగా పరిగణించే విధానాన్ని రాష్ట్ర పాలనలో తీసుకురావడం ఇందులోని అసలు ప్రాధాన్యం.

# జెండా ఎగరేస్తే జైలుకా?




జాతీయ జెండా ఎగరేస్తే జైలుకు పంపే దేశంలో ఇప్పుడు మనమున్నామా? ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి నిరసన తెలిపిన కాక్రోచ్ జనతా పార్టీకి చెందిన అశుతోష్ రంకా, సౌరవ్ దాస్ నిర్బంధం ఈ ప్రశ్నను మరోసారి ముందుకు తెచ్చింది. అయితే వారిని కేవలం జాతీయ జెండా ఎగురవేసినందుకే నిర్బంధించారని చెప్పడం సరైనది కాదు. అనుమతి లేని ప్రవేశం, గతంలో ఇచ్చిన శాంతిభద్రతల హామీల ఉల్లంఘన, మళ్లీ అవాంఛనీయ పరిస్థితులు ఏర్పడే అవకాశాల వంటి ఆరోపణలను అధికారులు ప్రస్తావించారు. అక్టోబర్ 14న వారిని ఐదు రోజుల నిర్బంధానికి పంపగా, అక్టోబర్ 19న మరో రెండు రోజులు పొడిగించారు. అక్టోబర్ 21న, జంతర్ మంతర్‌కు తిరిగి అధికారిక నిరసన స్థల హోదా లభించే వరకు అక్కడ నిరసనలకు పిలుపునివ్వబోమని లిఖితపూర్వక హామీ ఇచ్చిన అనంతరం విడుదల చేసినట్లు వార్తా కథనాలు పేర్కొన్నాయి. ఈ పరిణామాలను ఇద్దరు కార్యకర్తల అరెస్టు, విడుదలగా మాత్రమే చూడలేం. నిరసన హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛ, ప్రభుత్వ నియంత్రణ, జాతీయ జెండా గౌరవం మధ్య ఉన్న సంబంధాన్ని పరిశీలించాల్సిన సందర్భమిది.జంతర్ మంతర్: ప్రజల గొంతుక దశాబ్దాలుగా రైతులు, కార్మికులు, విద్యార్థులు, మహిళలు, వివిధ ప్రజా ఉద్యమాలకు జంతర్ మంతర్ వేదికగా నిలిచింది. పార్లమెంటుకు సమీపంలో ప్రజలు తమ సమస్యలను పాలకుల దృష్టికి తీసుకెళ్లే ముఖ్యమైన ప్రదేశమది. నిరసనలకు ఎలాంటి ఆంక్షలూ ఉండకూడదని చెప్పలేం. స్థానిక ప్రజల హక్కులు, శాంతిభద్రతలు, ట్రాఫిక్ వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని కొన్ని నియంత్రణలు విధించవచ్చు. కానీ నిరసనలకు సరైన, న్యాయబద్ధమైన ప్రత్యామ్నాయ స్థలాలను చూపించాలి. ఏదో తూ తూ మంత్రంగా చూపించామని చెబితే సరిపోదు. అక్కడ నిరసన తెలిపే ప్రజల గొంతు మీడియాకు, పాలకులకు చేరే అవకాశం ఉందా అన్నదే ముఖ్యం. 2018లో మజ్దూర్ కిసాన్ శక్తి సంఘటన్ కేసులో సుప్రీంకోర్టు శాంతియుత నిరసన హక్కును గుర్తిస్తూనే, ఇతరుల హక్కులు, ప్రజల శాంతిని కాపాడేందుకు తగిన నియంత్రణలు అవసరమని స్పష్టం చేసింది.జెండా ఎగరేయడం నేరమా? రాజ్యాంగంలోని 19(1)(ఎ) అధికరణం భావప్రకటనా స్వేచ్ఛను, 19(1) (బి) అధికరణం శాంతియుతంగా, నిరాయుధంగా సమావేశమయ్యే హక్కును కల్పిస్తున్నాయి. ఈ హక్కులు సహేతుకమైన రాజ్యాంగ పరిమితులకు లోబడి ఉంటాయి. 2004లో భారత ప్రభుత్వం వర్సెస్ నవీన్ జిందాల్ కేసులో సుప్రీం కోర్టు గౌరవప్రదంగా జాతీయ జెండాను ఎగురవేయడం భావప్రకటనా స్వేచ్ఛలో భాగమని గుర్తించింది. అదే సమయంలో, జాతీయ గౌరవ అవమాన నిరోధక చట్టం -1971లోని సెక్షన్ 2 జాతీయ పతాకాన్ని నిర్దిష్ట విధాలుగా అవమానించే చర్యలను శిక్షార్హంగా పరిగణిస్తుంది. అయితే ప్రభుత్వ విధానాలను విమర్శించడం, జెండాను అవమానించడం రెండూ ఒకటి కావు. అందుబాటులో ఉన్న వివరాల ప్రకారం, ఈ ఇద్దరిపై జాతీయ గౌరవ చట్టం కింద ప్రత్యేక అభియోగం నమోదైనట్లు నిర్ధారణ కాలేదు. అందువల్ల వారిని జెండా అవమానించినందుకు నిర్బంధించారని చెప్పడం తగదు.అయితే, ఈ కేసులో అధికారుల వాదనలను విస్మరించలేం. చట్టబద్ధమైన ఆదేశాలను ఉల్లంఘిస్తే చర్యలు తీసుకునే అధికారం పోలీసులకు ఉంది. కానీ తీసుకున్న చర్య అవసరమైనదా? ఐదు రోజుల నిర్బంధం తప్పనిసరైందా? తక్కువ కఠినమైన ప్రత్యామ్నాయాలు అందుబాటులో ఉన్నాయా? అనే ప్రశ్నలకు కూడా సమాధానాలు అవసరం. ఈ చర్య రాజకీయ కక్ష సాధింపేనని నిర్ధారించడానికి ఆధారాలు కావాలి. అదే సమయంలో చర్యల సముచితతను ప్రశ్నించడం ప్రజాస్వామిక హక్కు. చట్టం అందరికీ సమానంగా వర్తించాలి; రాజకీయ అభిప్రాయాల ఆధారంగా దాని అమలులో తేడాలు ఉండకూడదు.భారత స్వాతంత్ర్య పోరాటంలో త్రివర్ణ పతాకం వలస పాలనపై అసమ్మతికి, స్వయం పాలన ఆకాంక్షకు ప్రతీకగా నిలిచింది. ఆ చరిత్రను గుర్తు చేసుకోవడం అంటే నేటి పాలనను బ్రిటిష్ పాలనతో సమానంగా చూడడం కాదు. స్వతంత్ర భారతదేశంలో రాజ్యాంగం కల్పించిన హక్కుల విలువను గుర్తించడం. దేశభక్తి అంటే ప్రభుత్వ నిర్ణయాలన్నింటినీ అంగీకరించడం కాదు. దేశాన్ని ప్రేమిస్తూ ప్రభుత్వాన్ని ప్రశ్నించవచ్చు. జాతీయ జెండాను గౌరవిస్తూ పాలకుల విధానాలను విమర్శించవచ్చు. చట్టాన్ని గౌరవిస్తూనే దాని అమలులోని లోపాలను ప్రశ్నించవచ్చు. జెండా ప్రజలది. రాజ్యాంగం ప్రజలది. దేశం కూడా ప్రజలదే. నిరసనలకు చట్టబద్ధమైన పరిమితులు ఉండవచ్చు. కానీ ఆ పరిమితులు ప్రజల గొంతును మూయడానికి సాధనాలుగా మారకూడదు. జాతీయ జెండా గౌరవాన్ని కాపాడటంతోపాటు, అది ప్రతిబింబించే స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, పౌర గౌరవాన్ని పరిరక్షించడం కూడా ప్రభుత్వ బాధ్యతే. అదే త్రివర్ణ పతాకం మనకు అందించే అసలు సిసలైన సందేశం!

# లూలా విదేశాంగ విధానానికి ప్రజామోదం



లాటిన్ అమెరికాలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన బ్రెజిల్‌లో వామపక్ష నేత లూయిజ్ ఇనాసియో లూలా డ సిల్వా మరోసారి అధికారాన్ని చేజిక్కించుకున్నారు. ఆదివారం జరిగిన తుది విడత అధ్యక్ష ఎన్నికల్లో మాజీ అధ్యక్షుడు జైర్ బొల్సొనారో కుమారుడు, ట్రంప్ మద్దతుదారు ఫ్లావియో బొల్సొనారోపై విజయం సాధించారు. నాలుగోసారి అధ్యక్షుడిగా ఎన్నికైన తొలి బ్రెజిల్ నేతగా ఆయన చరిత్ర సృష్టించారు. ఈ విజయం కేవలం లూలా వ్యక్తిగత విజయంగా చూడటం సరికాదు. బొల్సొనారో కుటుంబ రాజకీయ ఆధిపత్యానికి బ్రెజిల్ ఓటర్లు వేసిన అడ్డుకట్టగా దీన్ని చూడాలి. పెరుగుతున్న జీవన వ్యయం, నేరాలు వంటి అంశాలు లూలాకు ఇబ్బంది కలిగించినప్పటికీ.. ప్రజాస్వామ్య పరిరక్షణ, సంక్షేమ పథకాలు, పేదల ప్రయోజనాలు, సామాజిక న్యాయం వంటి అంశాలతో ఆయన ఓటర్లను తనవైపు తిప్పుకున్నారు. ముఖ్యంగా ఈశాన్య బ్రెజిల్‌లో లూలాకు బలమైన మద్దతు లభించింది. లూలా రాజకీయ ప్రస్థానం సాధారణమైనది కాదు. కార్మికుడిగా, యూనియన్ నాయకుడిగా ఎదిగి రాజకీయాల్లోకి వచ్చిన ఆయన 2003- 2010 మధ్య రెండుసార్లు అధ్యక్షుడిగా పనిచేశారు.ఆ కాలంలో వస్తు ఎగుమతులపై వచ్చిన ఆదాయాన్ని సంక్షేమ కార్యక్రమాలకు మళ్లించి కోట్లాది మందిని పేదరికం నుంచి బయటకు తీసుకురావడంలో కీలక పాత్ర పోషించారు. అవినీతి కేసులో జైలుకు వెళ్లడం, ఆ తర్వాత ఆ కేసులకు సంబంధించి శిక్షలు రద్దు కావడం, 2022లో బొల్సొనారోను ఓడించి తిరిగి అధికారంలోకి రావడం ఆయన రాజకీయ జీవితంలో చెప్పుకోదగిన మలుపులు. ఇప్పుడు నాలుగోసారి ప్రజలు ఆయనకే పట్టం కట్టడం బ్రెజిల్ రాజకీయాల్లో ఆయనకు ఉన్న ప్రత్యేక స్థానాన్ని తెలియజేస్తోంది. అయితే లూలా ముందున్న అతిపెద్ద సవాళ్లలో అమెరికాతో సంబంధాలు ఒకటి. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధానాలతో బ్రెజిల్ -అమెరికా సంబంధాలు ఇటీవలి కాలంలో తీవ్ర ఒత్తిడికి గురయ్యాయి. బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు జైర్ బొల్సొనారోపై తీసుకున్న న్యాయపరమైన చర్యలను అమెరికా ప్రభుత్వం ప్రశ్నించడం, బ్రెజిల్ ఉత్పత్తులపై భారీ సుంకాలు విధించడం, బ్రెజిల్ అంతర్గత వ్యవహారాల్లో అమెరికా జోక్యానికి ప్రయత్నిస్తోందన్న భావన లూలా ప్రభుత్వంలో బలపడటం ఉద్రిక్తతలకు కారణమయ్యాయి. అమెరికా విధించిన సుంకాలను లూలా అన్యాయమైనవిగా అభివర్ణించినప్పటికీ, ప్రతీకార చర్యల కంటే చర్చల ద్వారానే సమస్య పరిష్కరించుకోవాలని ఆయన ఇప్పటివరకు ప్రయత్నించారు. అమెరికా విషయంలో లూలా వైఖరి ఘర్షణను కోరుకునేదిగా కాకుండా బ్రెజిల్ సార్వభౌమత్వాన్ని కాపాడుకుంటూనే వ్యూహాత్మక స్వాతంత్ర్యాన్ని కొనసాగించాలన్నదిగా కనిపిస్తోంది. చైనా బ్రెజిల్‌కు అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా ఉండటం, అమెరికా కూడా కీలక భాగస్వామి కావడంతో ఏ ఒక్క శిబిరంలోనూ పూర్తిగా చేరకుండా బహుళ ధ్రువ ప్రపంచాన్ని ప్రోత్సహించడం లూలా విదేశాంగ విధానంలో ముఖ్యాంశం.బ్రిక్స్, గ్లోబల్ సౌత్ వేదికలను బలోపేతం చేయాలన్న ఆయన ప్రయత్నం కూడా ఇందులో భాగమే. లూలా గెలుపుతో బ్రెజిల్‌తో భారత్ బంధం మరింత బలోపేతమవుతుందని చెప్పవచ్చు. భారత్ బ్రెజిల్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం 2006లోనే ప్రారంభమైంది. బ్రిక్స్, ఐబిఎస్ఎ, జీ-20, ప్రపంచ వాణిజ్య సంస్థ తదితర వేదికలపై ఇరు దేశాలూ కలిసి పనిచేస్తున్నాయి. 2025లో ప్రధాని మోడీ బ్రెజిల్‌లో పర్యటించగా, 2026 ఫిబ్రవరిలో లూలా భారత్‌లో పర్యటించడం ద్వైపాక్షిక సంబంధాలకు లభిస్తున్న ప్రాధాన్యాన్ని వెల్లడిస్తోంది. ఈ సందర్భంగా కీలక ఖనిజాలు, డిజిటల్ భాగస్వామ్యం, ఔషధాలు, వ్యవసాయం, ఇంధనం, ఎంఎస్ఎంఇలు తదితర రంగాల్లో ఒప్పందాలు కుదిరాయి. ఇరుదేశాల వాణిజ్యం కూడా వేగంగా పెరుగుతోంది. 2025లో భారత్ -బ్రెజిల్ ద్వైపాక్షిక వాణిజ్యం 15.21 బిలియన్ డాలర్లకు చేరింది.2030 నాటికి 30 బిలియన్ డాలర్లకు తీసుకెళ్లాలన్న లక్ష్యాన్ని ఇరుదేశాలు నిర్దేశించుకున్నా యి. లూలా నాలుగోసారి గెలిచినంతమాత్రాన దేశంలో రాజకీయంగా ఆయనకు ఎదురులేదని అనుకోవడం పొరబాటే. ఎన్నికల విజయాన్ని సుస్థిర పాలనగా మార్చడం ఆయనకు పెద్ద పరీక్ష. అమెరికాతో సంబంధాలను తెంచుకోకుండా, బ్రెజిల్ ప్రయోజనాలను కాపాడటం, చైనా, భారత్ సహా గ్లోబల్ సౌత్‌తో బంధాలను బలోపేతం చేయడం, అదే సమయంలో దేశ ఆర్థిక వ్యవస్థ, ఉపాధి, ద్రవ్యోల్బణం, నేరాల సమస్యలను పరిష్కరించడం ఆయన ముందున్న ప్రధాన కర్తవ్యాలు. ఎన్నికల్లో గెలుపు ఆయనకు కేవలం మరో పదవీకాలం కాదు.. బ్రెజిల్ స్వతంత్ర విదేశాంగ విధానాన్ని, ప్రజాస్వామ్య సంస్థలను, సామాజిక న్యాయాన్ని కాపాడే బాధ్యతను మరోసారి అప్పగిస్తూ ప్రజలు ఇచ్చిన తీర్పు. ఆ తీర్పును ఎంత సమర్థంగా అమలు చేస్తారన్నదే లూలా విజయానికి అసలు సిసలైన కొలమానం.

# సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ కేంద్రంగానే పనిచేస్తోంది- కొలీజియం ప్రక్రియలో పారదర్శకత అవసరం



**న్యూ ఢిల్లీ**: సుప్రీం కోర్టు కూడా ప్రస్తుతం చీఫ్ జస్టిస్ కేంద్రీకృతంగానే మారిందని సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఏఎస్ ఓకా కీలక వ్యాఖ్యలు చేశారు. సుప్రీం కోర్టులో కేసుల కేటాయింపు, న్యాయమూర్తుల నియామకాలకు సంబంధించి కొలీజియం ప్రక్రియలో మరింత పారదర్శకత అవసరం అని ఆయన అభిప్రాయపడ్డారు. కేసుల కేటాయింపులో వ్యక్తిగత జోక్యానికి అవకాశం లేకుండా అంటే మానవ ప్రమేయం లేకుండా సరైన రోస్టర్ విధానాన్ని అమలు చేయాలని సూచించారు. ఈ కేసుల లిస్టింగ్ ప్రక్రియ పూర్తిగా కంప్యూటరైజ్డ్ లేదా ఆటోమేటిక్‌గా మారాలని అభిప్రాయపడ్డారు. ఇంకా న్యాయవ్యవస్థ స్వతంత్రతకు భంగం కలగకుండా అన్ని స్థాయిల్లోనూ జవాబుదారీతనాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కిచెప్పారు. క్యాంపెయిన్ ఫర్ జ్యుడీషియల్ అకౌంటబులిటీ అండ్ రిఫార్మ్స్ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 'సుప్రీం కోర్టు, హైకోర్టుల న్యాయమూర్తుల జవాబుదారీతనం' అనే థీమ్‌తో జరిగిన సమావేశంలో న్యాయవ్యవస్థలో సంస్కరణల అవసరాన్ని వివరించారు.ఈ సందర్భంగా కొలీజియం వ్యవస్థ, దాని పనితీరు, పారదర్శకతపై జస్టిస్ ఓకా కీలక వ్యాఖ్యలు చేశారు. న్యాయమూర్తుల నియామకాలకు సంబంధించి ప్రస్తుతం అమల్లో ఉన్న కొలీజియం వ్యవస్థను తాను గట్టిగా నమ్ముతానని చెప్పుకొచ్చారు. ఇక్కడ మరింత మెరుగైన ప్రత్యామ్నాయ వ్యవస్థ వచ్చే వరకు దీనిని మార్చకూడదని అభిప్రాయపడ్డారు. కొలీజియం అమలులో కొన్ని తప్పులు జరిగి ఉండొచ్చు కానీ అంతమాత్రాన ఆ మొత్తం వ్యవస్థే చెడ్డదని చెప్పలేమని, తప్పుగా చూడకూడదని అన్నారు. అయితే కొలీజియం తీసుకున్న నిర్ణయాలు, తీర్మానాలను సుప్రీం కోర్టు వెబ్‌సైట్‌లో ప్రచురించడం మాత్రమే పారదర్శకతకు సరిపోదని జస్టిస్ ఓకా స్పష్టం చేశారు. అసలు నిర్ణయాలు ఎలా తీసుకుంటున్నారు? ఏ విధానాన్ని అనుసరిస్తున్నారు? అనే అంశాల్లోనూ పారదర్శకత ఉండాలని స్పష్టం చేశారు. ఇక్కడ కొలీజియం సిఫార్సులు ప్రభుత్వ స్థాయిలో నెలల తరబడి పెండింగ్‌లో ఉండటాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. న్యాయమూర్తుల నియామక ప్రక్రియలో ప్రభుత్వం తన బాధ్యతను మరింత జవాబుదారీతనంతో నిర్వర్తించాలని సూచించారు.ప్రస్తుతం హైకోర్టుల్లో అనుసరిస్తున్న విధానానికి తగ్గట్లుగానే సుప్రీం కోర్టులో కూడా కేసుల కేటాయింపు కోసం సరైన రోస్టర్ సిస్టమ్ ఉండాలని జస్టిస్ ఓకా అన్నారు. దీని ద్వారా భారత ప్రధాన న్యాయమూర్తి సహా మరెవరైనా వ్యక్తిగతంగా జోక్యం చేసుకునే అవకాశం ఉండదని పేర్కొన్నారు. ప్రస్తుత విధానంలో ఒకే తరహా కేసులను వేర్వేరు ధర్మాసనాలకు కేటాయించే పరిస్థితి ఉందని, దీని వల్ల తమ కేసును ఏ ధర్మాసనం విచారిస్తుందో కక్షిదారులు (లిటిగెంట్స్- కోర్టులో కేసు వేసిన వ్యక్తి, కేసును ఎదుర్కొంటున్న వ్యక్తి) స్పష్టంగా తెలుసుకోలేకపోతున్నారని వివరించారు.కొత్తగా దాఖలయ్యే కేసులకు విచారణ తేదీలను ఆటోమేటిక్‌గా కేటాయించే విధానం తీసుకురావాలని కూడా జస్టిస్ ఓకా సూచించారు. అప్పుడు కేసుల లిస్టింగ్ ప్రక్రియలో ఏకపక్ష నిర్ణయాలకు అవకాశం తగ్గుతుందని, విచారణ తేదీల కోసం లిటిగెంట్స్ పదే పదే కోర్టులను ఆశ్రయించాల్సిన అవసరం కూడా ఉండదని చెప్పుకొచ్చారు. కొవిడ్ మహమ్మారి సమయంలో ఇలాంటి విధానం కర్ణాటక హైకోర్టులో విజయవంతంగా అమలైందని జస్టిస్ ఏఎస్ ఓకా గుర్తుచేశారు. ఇదే కార్యక్రమంలో పాల్గొన్న సీనియర్ న్యాయవాది, రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్ కూడా భారతీయ న్యాయవ్యవస్థపై కీలక వ్యాఖ్యలు చేశారు. న్యాయవ్యవస్థపై ప్రజల్లో నమ్మకం సన్నగిల్లుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రాజకీయంగా అత్యంత సున్నితమైన కేసుల్ని ఏ న్యాయమూర్తికి కేటాయించాలనే అంశాలతో పాటు ఇతర పరిపాలనాపరమైన నిర్ణయాల్లో పారదర్శకత, జవాబుదారీతనం లోపిస్తున్నాయని అన్నారు. పరిపాలనా కపిల్ సిబల్ సూచించారు. న్యాయవ్యవస్థ స్వతంత్రతను కాపాడటానికి కొలీజియం వ్యవస్థను తీసుకొచ్చినా, దాంట్లోనూ తీవ్రమైన లోపాలు ఉన్నాయని ఆయన అభిప్రాయపడ్డారు.

# జోకేసిన హర్ష్ గుజ్రాల్.. నవ్వుకున్న సీఎం యోగి ఆదిత్యనాథ్



**లక్నో:** కమేడియన్ హర్ష్ గుజ్రాల్ జోకులతో అందర్నీ నవ్విస్తుంటాడు. అయితే ఇటీవల అతను వేసిన పంచ్‌కు యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ కూడా తెగ నవ్వేశారు. సీఎం యోగి చేతుల మీదుగా యూత్ ఐకాన్ ఆఫ్ ఉత్తరప్రదేశ్ అవార్డును ఇటీవల హర్ష్ గుజ్రాల్ అందుకున్నారు. ఆ అవార్డు ఫంక్షన్‌లో గుజ్రాల్ ఓ జోకు వినిపించారు. షో చేసేందుకు గతంలో ఎక్కడకు వెళ్లినా యూపీ క్రైం గురించి మాట్లాడేవారన్నారు. లక్నోలో అరటిపండ్లు అమ్మే వ్యక్తితో మాట్లాడిన అంశం గురించి హర్ష్ గుజ్రాల్ తెలిపాడు. రాష్ట్రంలో నేరాలు ఎలా ఉన్నాయని అంటూ ఆ అరటిపండ్ల వ్యక్తిగా అడిగానని, అవును తగ్గినట్లు ఆ వ్యక్తి చెప్పినట్లు గుజ్రాల్ తెలిపాడు. గతంలో తాను నేరాలు చేసేవాడినని, ఇప్పుడు అరటిపండ్లు అమ్ముకుంటున్నట్లు చిరువ్యాపారి చెప్పినట్లు గుజ్రాల్ జోకేశాడు. ఆ జోకుతో ఆహ్వానితులతో పాటు అవార్డును అందజేసిన సీఎం యోగి కూడా మనసారా నవ్వుకున్నారు.

# సీఆర్పీఎఫ్‌ను కొట్టిన మహిళా యూట్యూబర్.. కేసు నమోదు చేసిన పోలీసులు



**న్యూఢిల్లీ:** కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ఢిల్లీలో లెజ్రో దో తిరంగా నిరసన ప్రదర్శన జరిగిన విషయం తెలిసిందే. పాలికా బజార్ వద్ద జరిగిన నిరసనలో ఓ మహిళా యూట్యూబర్.. పారామిలిటరీ సైనికుడిపై చేయి చేసుకున్నారు. సెంట్రల్ ఢిల్లీలోని రాజీవ్ చౌక్ మెట్రో స్టేషన్ వద్ద ఉన్న గేట్ నెంబర్ 6 దగ్గర ఈ ఘటన జరిగింది. సీఆర్పీఎఫ్ జవానును, అక్కడ ఉన్న గుంపు మధ్య వాగ్వాదం జరిగింది. ఆ సమయంలో ఓ మహిళ జవాన్ చెంపపై కొట్టింది. నిరసన పేరుతో పోలీసులు, పారామిలిటరీ దళాలపై దాడి జరిగినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఓ సీఆర్పీఎఫ్ జవాన్‌ను కొట్టిన ఘటనకు చెందిన వీడియోను ఢిల్లీ పోలీసులు రిలీజ్ చేశారు. దాడిలో పాల్గొన్న నిరసనకారులు, యూట్యూబర్లను గుర్తిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు చెప్పారు.

# భారతీయ వ్యాపార సంస్థలు మోదీ షా ఆటవస్తువులు కావు టాటా వివాదంపై రాహుల్ గాంధీ




**న్యూ ఢిల్లీ**: టాటా సన్స్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా ఎన్. చంద్ర శేఖరన్ పునర్నియామకం నేపథ్యంలో చెలరేగిన వివాదంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించారు. కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థా యిలో విరుచుకుపడ్డారు. భారతీయ వ్యాపార రంగాన్ని ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా తమ ఆటవస్తువులా చూస్తున్నారని ఆరోపించారు. దేశంలోని ప్రముఖ వ్యాపారవేత్తలు ఈ విమాట్లాడటానికి భయపడుతున్నారని 'ఎక్స్' వేదికగా తెలిపారు."టాటా సంస్థను నేరపూరితంగా నాశనం చేస్తున్నారు. అయినా ఒక్క వ్యాపారవేత్త కూడా దీనిపై మాట్లాడడానికి సాహసించడం లేదు. మీరు ఇంకెంత కాలం మౌనంగా ఉంటారు? వాళ్లు మిమ్మల్ని పూర్తిగా లొంగదీసుకునేంత వరకా? భారతీయ వ్యాపార రంగం మోదీ, షాల ఆటవస్తువు కాదు. మీకు ధైర్యం లేదు, కానీ మాకు ఉంది. ఈ అన్యాయాలకు వ్యతిరేకంగా మేము కచ్చితంగా న్యాయం జరిగేలా చూస్తాం." అని రాహుల్ గాంధీ పోస్ట్ చేశారు.టాటా సన్స్ బోర్డు సమావేశంలో చంద్రశేఖరన్ పునర్నియామకాన్ని ఆమోదించిన విధానంలో నిబంధనల ఉల్లంఘన జరిగిందని టాటా ట్రస్ట్ చైర్మన్ నోయల్ టాటా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఈ వివాదం చెలరేగింది. అజెండాలో స్పష్టంగా పేర్కొనకుండానే సెప్టెంబర్ 17న జరిగిన బోర్డు సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారని విమర్శించారు. అనేక సార్లు కోరినా సమావేశానికి సంబంధించిన ఆడియో, వీడియో రికార్డింగ్‌లను కూడా తనకు అందించడం లేదని నోయల్ టాటా ఆరోపించారు. టాటా సన్స్ కంపెనీ సెక్రటరీ, గ్రూప్ కార్పొరేట్ సెక్రటరీ అయిన సుప్రకాష్ ముఖోపాధ్యాయకు అక్టోబర్ 26న రాసిన లేఖలో నోయెల్ టాటా ఈ మేరకు పేర్కొన్నారు. ఈ నియామక తీర్మానం చట్టబద్ధం కాదని ఆయన స్పష్టం చేశారు. ఈ పునర్?నియామకం టాటా సన్స్ ఆర్టికల్స్ ఆఫ్ అసోసియేషన్‌లోని సంబంధిత నిబంధనలకు అనుగుణంగా లేదని ఆయన వాదించారు. నోయెల్ ప్రకారం టాటా విషయంలో ఆర్టికల్ 118 కింద ఎటువంటి ఎంపిక కమిటీని ఏర్పాటు చేయలేదు, అలాంటి కమిటీ నుంచి వచ్చిన సిఫార్సును కూడా బోర్డు ముందు ఉంచలేదు. ఆర్టికల్ 118, 121 ప్రకారం అవసరమైన విధంగా ఆర్టికల్ 104బి కింద నియమించిన డైరెక్టర్ల అనుకూల ఓటును పొందలేదని అన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లేఖ, సంబంధిత కేవియట్ దరఖాస్తులపై చర్చలను చేర్చడానికి అజెండాను తదనంతరం సవరించినప్పటికీ, అది చంద్రశేఖరన్ పునర్ నియామకాన్ని స్పష్టంగా ప్రస్తావించలేదన్నారు. కెవియట్ పిటిషన్ దాఖలు చేశారు.టాటా ట్రస్ట్‌కు నోయెల్ టాటా చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. టాటా గ్రూప్ హోల్డింగ్ కంపెనీ అయిన టాటా సన్స్‌లో ఈ ట్రస్ట్‌కు 66 శాతం వాటా ఉంది. టాటా ట్రస్ట్ ఆధ్వర్యంలో 15 దాతృత్వ సంస్థలు ఉండగా, అందులో సర్ దొరాబ్జీ టాటా ట్రస్ట్, సర్ రతన్ టాటా ట్రస్ట్ కీలకమైనవి. టాటా సన్స్‌లో ఆ రెండింటి వాటానే 51.54 శాతంగా ఉంది. అందుకే ఈ ట్రస్ట్‌ల ట్రస్టీల అభిప్రాయాలు టాటా సన్స్ పాలనా విధానాలపై ప్రభావం చూపుతుంటాయి.

# ఢిల్లీలో బీజేపీ భారీ పాదయాత్ర.. విపక్షాలకు కౌంటర్ వ్యూహం



**ఢిల్లీ :**ఢిల్లీలో 'ప్రజాస్వామ్య పరిరక్షణ' పేరుతో బీజేపీ పాదయాత్ర అధ్యక్షుడు నితిన్ నబిన్ నేతృత్వంలో దేశవ్యాప్త నిరసనలు ఓటర్ల జాబితా సవరణపై రాజుకున్న రాజకీయ వివాదం నవంబర్ 1న 'ఓటు బచావో' పేరుతో ఇండియా కూటమి భారీ ర్యాలీ విపక్షాలకు కౌంటర్‌గా నెల రోజుల ప్రచారానికి బీజేపీ ప్రణాళిక భారతీయ జనతా పార్టీ (బీజేపీ) జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ నేతృత్వంలో బుధవారం ఢిల్లీలో భారీ పాదయాత్ర జరగనుంది. 'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి, అరాచకాన్ని అంతం చేయండి' అనే నినాదంతో చాందినీ చౌక్ వేదికగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.ఈ పాదయాత్రలో ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు హర్ష్ మల్హోత్రా, ఎంపీలు మరియు ఇతర సీనియర్ నాయకులు పాల్గొంటారని పార్టీ 'ఎక్స్' వేదికగా ప్రకటించింది. ఈ ప్రచారంలో భాగంగా దేశవ్యాప్తంగా పలు నగరాల్లో కూడా పాదయాత్రలు కొనసాగుతున్నాయి. కేంద్ర హోంమంత్రి అమిత్ షా తో పాటుభాగంగా దేశవ్యాప్తంగా పలు నగరాల్లో కూడా బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు తమ ప్రాంతాల్లో జరిగే కార్యక్రమాల్లో పాలుపంచుకోనున్నారు.ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియపై రాజకీయ ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ ప్రచారం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ ప్రక్రియలో అవకతవకలు జరిగాయని, భారత ఎన్నికల సంఘం తీరును ప్రతిపక్షాలు తప్పుబడుతున్నాయి. కాగా, గాంధీ కుటుంబం కేవలం సొంత ప్రయోజనాల చుకుంది. ఈ ప్రక్రియలో అవకత వకలు జరిగాయని, భారత ఎన్నికల సంఘం తీరును ప్రతిపక్షాలు తప్పుబ డుతున్నాయి. కాగా, గాంధీ కుటుంబం కేవలం సొంత ప్రయోజనాల కోసమే పనిచేస్తోందని, కాంగ్రెస్ పార్టీ తీవ్ర నిరాశానిస్పృహల్లో ఉందని నితిన్ నబిన్ గతంలో పనాజీలో విమర్శించారు.మరోవైపు, ప్రతిపక్షాల 'ఇండియా' కూటమి నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో 'ఓటు బచావో, దేశ్ బచావో' పేరుతో భారీ ర్యాలీకి పిలుపునిచ్చింది. ఓటర్ల జాబితా సవరణలో అక్రమాలు జరుగుతున్నాయని, 'ఓటు చోరీ'కి బాధ్యత వహిస్తూ ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. దీనికి ప్రతిగా, బీజేపీ నవంబర్ 1 నుంచి నెల రోజుల పాటు దేశవ్యాప్త కౌంటర్ క్యాంపెయిన్‌కు సమాయత్తమవుతోంది.

# మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభకు హర్దీప్ సింగ్ పురి



**న్యూఢిల్లీ:** కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పురిని మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభ ఎన్నికల్లో అభ్యర్థిగా బీజేపీ నామినేట్ చేసింది. బీజేపీ నేత ఎల్ మురుగన్.. అక్టోబర్‌లో సీటు ఖాళీ చేయడంతో హర్దీప్ పురిని పోటీలోకి దించుతున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ క్యాబినెట్‌లో హర్దీప్ పురి సభ్యుడిగా ఉన్నారు. పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వశాఖ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఎల్ మురుగన్ రాజ్యసభకు రాజీనామా చేశారు. దీంతో కేబినెట్‌లో మార్పులు జరిగే అవకాశాలు ఉన్నట్లు ఊహాగానాలు వినిపించాయి.

# వారణాసి ఎమ్మెల్సీ సీటు సమాజ్‌వాదీ పార్టీ వశం



**లక్నో:** ఉత్తరప్రదేశ్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ నాలుగు సీట్లను గెలుచుకున్నది. మీరట్, బరేలీ-మొరాదాబాద్ టీచర్ సీట్లతో పాటు లక్నో టీచర్ సీటును సొంతం చేసుకున్నది. అయితే సమాజ్‌వాదీ పార్టీ.. వారణాసి, ఆగ్రా టీచర్ నియోజకవర్గాల్లో విజయం సాధించింది. మీరట్-సహరాన్‌పూర్ గ్రాడ్యుయేట్స్ నియోజకవర్గంలో బీజేపీ సిట్టింగ్ ఎమ్మెల్సీ దినేశ్ గోయల్ మరోసారి తన సీటును నిలబెట్టుకున్నారు. ఎస్పీ అభ్యర్థి ప్రమోద్ సింగ్ భాటియాపై 12,855 ఓట్ల తేడాతో నెగ్గాడు. మీరట్ టీచర్స్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి శ్రీచంద్ శర్మ గెలిచారు. అక్కడ ఎస్పీ అభ్యర్థి నితిన్ తోమర్‌పై 13,241 ఓట్ల తేడాతో గెలిచారు.బరేలీ-మొరాదాబాద్ టీచర్స్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి హరి సింగ్ ధిల్లాన్ విజయం సాధించారు. లక్నో టీచర్స్ సీటులో బీజేపీ ఎమ్మెల్సీ ఉమేశ్ ద్వివేదీ గెలిచారు. కీలకమైన వారణాసి టీచర్స్ నియోజకవర్గంలో సమాజ్‌వాదీ పార్టీ సిట్టింగ్ ఎమ్మెల్సీ లాల్ బిహారీ యాదవ్ తన స్థానాన్ని నిలుపుకున్నారు. బీజేపీ అభ్యర్థి ప్రమోద్ మిశ్రాపై 4900 ఓట్ల తేడాతో గెలిచారు. ఆగ్రా టీచర్స్ నియోజకవర్గం నుంచి ఎస్పీ అభ్యర్థి ఆకాశ్ అగర్వాల్ విజేతగా నిలిచారు. బీజేపీ అభ్యర్థి హరి కిషోర్ తివారీని ఓడించారు. అక్టోబర్ 23న ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగాయి.

# మెర్సిడీజ్ హిట్ అండ్ రన్ కేసు.. కొచ్చి పోలీసు కమీషనర్ బదిలీ



**కొచ్చి:** కేరళలోని కొచ్చి సిటీ పోలీసు కమీషనర్ కాళిరాజ్ మహేశ్ కుమార్‌ను బదిలీ చేశారు. మరో నలుగురు పోలీసుల్ని సస్పెండ్ చేశారు. చారనల్లూరులో జరిగిన మెర్సిడీజ్ కారు ప్రమాదం(వీవతీఎవఎవం ప్లట్ఖ-ఘఅఎ-తీబఅ)లో దర్యాప్తు లోపాలు ఉన్నట్లు గుర్తించారు. దీంతో కేరళ సర్కారు కొచ్చి సిటీ కమీషనర్‌ను బదిలీ చేసింది. జిల్లా అదనపు జడ్జీకి చెందిన 17 ఏళ్ల కుమారుడు మెర్సిడీజ్ కారును డ్రైవ్ చేస్తూ 55 ఏళ్ల స్కూటర్ రైడర్‌ను ఢీకొట్టాడు.ఆ ప్రమాదంలో రైడర్ మృతిచెందాడు. అయితే ఈ కేసు విచారణలో కొచ్చి పోలీసు కమీషనర్ నిర్లక్ష్యం వహించినట్లు ప్రభుత్వం పేర్కొన్నది. మహేశ్ కుమార్ స్థానంలో ఆర్ నిషాంతిని నియమించారు. దక్షిణ ప్రాంత ఐజీగా పీ ప్రకాశ్‌ను నియమించారు. రాష్ట్ర హోంశాఖ ఈ ఆదేశాలు జారీ చేసింది.వీధి వ్యాపారం చేస్తున్న జయబాలకృష్ణన్ రాత్రి 2.20 నిమిషాలకు బైక్‌పై ఇంటికి వెళ్తున్న సమయంలో వెనుక నుంచి వచ్చిన మెర్సిడీజ్ ఢీకొట్టింది. తొలుత నిర్లక్ష్యం కేసు బుక్ చేశారు. ఆ తర్వాత ఓవర్‌స్పీడింగ్ కేసు పెట్టారు. మెర్సిడీజ్ కారు రిజిస్ట్రేషన్ టీనేజర్ తండ్రి పేరుమీద ఉన్నది. టీనేజర్‌ను జువెనైల్ జస్టిస్ బోర్డు ముందు ప్రజెంట్ చేయగా, అతడికి బెయిల్ మంజూరీ చేశారు. ఆ బెయిల్‌ను రద్దు చేయాలని పోలీసులు కోర్టును ఆశ్రయించారు. ప్రాథమిక రిపోర్టు ప్రకారం టీనేజర్ మద్యం మత్తులో లేరని రాశారు. అతని రక్త నమోనాలను సేకరించారు. డీజీపిని హోంమినిస్టర్ మందలించడంతో.. క్రైం బ్రాంచ్ ఆధారాలను సేకరించింది.

## ప్రతి ఒక్కరూ రైతులకు అండగా నిలవాలి



**అమరావతి, అక్టోబర్ 28:**
ఆర్నబ్ తుఫాన్ నేపథ్యంలో పంటల సంరక్షణపై వ్యవసాయ, ఉద్యానవన శాఖ ఉన్నతాధికారులతో మంత్రి అచ్చెన్నాయుడు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. తుఫాన్ ప్రభావంతో పంటలకు నష్టం వాటిల్లకుండా యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గ్రామస్థాయి వ్యవసాయ సహాయకుడి నుంచి ఉన్నతాధికారుల వరకు ప్రతి ఒక్కరూ రైతులకు అండగా నిలవాలన్నారు. కోతకు సిద్ధంగా ఉన్న పంటలు, కోసిన ధాన్యం, నిల్వలు దెబ్బతినకుండా రైతులను అప్రమత్తం చేయాలని తెలిపారు. వాతావరణం అనుకూలించిన వెంటనే అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతుల సమస్యలను తెలుసుకోవాలని మంత్రి ఆదేశించారు.
నీటమునిగిన పంటలను కాపాడేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని.. పొలాల్లో నిలిచిన నీటిని తొలగించాలని మంత్రి తెలిపారు. తుఫాన్ అనంతరం పంటల పునరుద్ధరణకు అవసరమైన సాంకేతిక సహాయాన్ని రైతులకు అందించాలన్నారు. గ్రామాలవారీగా, పంటలవారీగా, రైతులవారీగా నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదికలు సమర్పించాలని వెల్లడించారు. . క్షేత్రస్థాయిలో నిర్లక్ష్యానికి తావులేకుండా సమన్వయంతో పనిచేయాలని మంత్రి అచ్చెన్నాయుడు సూచించారు.

# నామినేషన్ల గడువు పొడిగింపునకు సుప్రీంకోర్టు విముఖత



**అమరావతి :**స్థానిక ఎన్నికలను వాయిదా వేయించాలన్న వైఎస్సార్సీపీ ఉచ్చులో పడబోమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. కొన్ని రాష్ట్రాల్లోని రాజకీయాలను కోర్టులకు దూరంగా ఉంచడం మంచి దని విచారణ సందర్భంగా వైఎస్సార్సీపీ న్యాయ వాదిని ఉద్దేశించి సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యానించారు. స్థానిక సంస్థల ఎన్నికలపై వైఎస్సార్సీపీ వేసిన పిటిషన్‌పై విచారించిన ధర్మాసనం మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల గడువు పొడిగింపునకు విముఖత చూపించింది. ఎన్నికల నిర్వహణపై నిజనిర్ధారణ కమిషన్ వేయడానికీ నిరాకరించింది. నామినేషన్లపై వివాదం ఉంటే ఎన్నికల పిటిషన్లు దాఖలు చేసుకోవచ్చని వైఎస్సార్సీపీకి సూచించింది. మున్సిపల్ ఎన్నికల నామినేషన్ గడువును పొడిగించాలని కోరుతూ వైఎస్సార్సీపీ సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్‌పై ధర్మాసనం ఈ నెల 21న తొలిసారి విచారించింది. శాంతిభద్రతల కారణంగా నామినేషన్లు దాఖలు చేయలేకపోయామని అభ్యర్థులెవరైనా రాష్ట్ర ఎన్నికల సంఘానికి సాక్ష్యాధారాలతో ఫిర్యాదులు చేసి ఉంటే వాటిని పరిశీలించి ఆ ప్రాంతాల్లో మాత్రం నామినేషన్ల గడువు పెంచే విషయంపై నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. ఆ మేర కు రాష్ట్ర ఎన్నికల సంఘం ఈ నెల 18తో ముగి సిన నామినేషన్ల గడువును కొన్ని ప్రాంతాల్లో 23, 24 తేదీల వరకు పొడిగించి 25న తుది జాబితా ప్రకటించింది. ఏకగ్రీవంగా ఎన్నికైన వారి పేర్లనూ వెల్లడించి విజేతలకు డిక్లరేషన్లు అందించింది.ఏకగ్రీవాలపై అభ్యంతరం: మంగళవారం మరోసారి ఈ పిటిషన్‌పై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్య బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. విచారణలో వైఎస్సార్సీపీ తరపున హాజరైన సీనియర్ న్యాయవాది ఏకగ్రీవాలపై అభ్యంతరం వ్యక్తం చేశారు. క్రితంసారి విచారణ జరిగినప్పుడు 28 పట్టణ స్థానిక సంస్థల్లోని 800 వార్డుల్లో తమ పార్టీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయలేకపోయారని పేర్కొ న్నారు. కోర్టు ఆదేశాల తర్వాత ఎన్నికల సంఘం 3 పట్టణ స్థానిక సంస్థల్లోని 372 వార్డుల్లో మాత్రమే నామినేషన్ల దాఖలుకు అవకాశం కల్పించిందన్నారు. తమ పార్టీకి చెందిన 72 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగలిగారని పేర్కొన్నారు.ఇంకా నామినేషన్లు వేయని 53శాతం నియోజకవ ఓర్గాల్లో అధికార కూటమి అభ్యర్థులను ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారని పేర్కొన్నారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పందిస్తూ 'ఇలాంటి గాలివాటు ప్రకటనల వల్ల ప్రయోజనం ఉండదు. ఏ అభ్యర్థి నామినేషన్ వేయడానికి వెళ్తే ఎక్కడ అడ్డుకున్నారో స్పష్టంగా చెప్పండి. సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం నామినేషన్లు గడువు పొడిగించిన తర్వాత మీ అభ్యర్థులు నామినేషన్లు వేశారు. వారికి ఆల్ ద బెస్ట్? చెబుతున్నాం. వెళ్లి పోటీచేయండి. మీరు చెబుతున్న 500 మంది అభ్యర్థులు ఎక్కడా లేరు. లేని వారి కోసం ఎన్నికలను ఆపలేం' అని తేల్చిచెప్పారు. అడ్డుకున్న అభ్యర్థుల జాబితా తమ వద్ద ఉందని వైఎస్సార్సీపీ న్యాయవాది మణిందర్‌సింగ్ పేర్కొనగా అలాగైతే దానిపై హైకోర్టును ఆశ్రయించండి అని సీజేఐ సూచించారు. అన్నిచోట్లా సీసీ కెమెరాలు: జస్టిస్ జోయ్‌మల్య బాగ్చి స్పందిస్తూ నామినేషన్ వేయడానికి వెళ్తే అడ్డుకున్నట్లు అభ్యర్థుల వద్ద ఆధారాలు ఉంటే వారు వెళ్లి ఎన్నికల పిటిషన్ దాఖలు చేసుకోవచ్చని స్పష్టం చేశారు. వైఎస్సార్సీపీ తరపున మరో సీనియర్ న్యాయవాది నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ అన్ని స్థానిక సంస్థల ఎన్నికల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా చూడాలని కోరగా జస్టిస్ బాగ్చి విభేదించారు. రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా స్పందిస్తూ ధర్మాసనం గత ఉత్తర్వుల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం అన్నిచోట్లా సీసీ కెమెరాలు, భద్రతా ఏర్పాట్లు చేసిందన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటు విషయంలో తాము గతంలో ఇచ్చిన ఉత్తర్వులను అన్ని ఎన్నికలకూ పర్తింపజేస్తామని, అలాగే వాటి రికార్డులను దాచిపెట్టాలని సీజేఐ సూచించారు.

# ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు: చంద్రబాబుపై జగన్ ఫైర్



**అమరావతి, :**ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని వైసీపీ అధినేత జగన్ ఆరోపించారు. రాష్ట్రంలో రావణ కాసుర పాలన నడుస్తోందని ఆయన మండి పడ్డారు. నామినేషన్ కేంద్రాల వద్ద వైసీపీ అభ్యర్థులపై దాడులు చేసి, వారి నామినేషన్ పత్రాలను చించివేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పార్టీ నేతలను పోలీసులు గృహ నిర్బంధం చేయడం, పోలీస్ స్టేషన్లకు పిలిపిం చడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఈ అక్రమాలపై తాము ఆధారాలు సేకరించి రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ), గవర్నర్‌తో పాటు సుప్రీంకోర్టును కూడా ఆశ్రయించామని తెలిపారు.తమ పిటిషన్‌పై స్పందించిన సుప్రీం కోర్టు, అభ్యర్థుల తుది జాబితా ప్రకటనను అక్టోబర్ 25 వరకు వాయిదా వేయాలని, నామినేషన్ల దాఖలుకు స్వేచ్ఛ కల్పించాలని, అభ్యర్థులకు రక్షణ, సీసీటీవీ రికార్డింగ్ ఏర్పాటు చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని జగన్ గుర్తుచేశారు. అయినప్పటికీ ప్రభుత్వ యంత్రాంగం వైఖరిలో ఎలాంటి మార్పు రాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని 19 మున్సిపాలిటీలలో తమ అభ్య ర్థులు నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారని, కానీ ఎస్ఈసీ కేవలం పరిమిత సంఖ్యలో కొన్ని చోట్ల మాత్రమే రీ-నామినేషన్లకు అవకాశం ఇచ్చిందని జగన్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏకపక్ష విజయాల కోసం చంద్రబాబు నిబంధనలు మార్చుతున్నారని, ఇది మహాభారతంలోని మాయాజూదాన్ని తలపిస్తోందని ఆయన విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో నామినేషన్లు, ఏకగ్రీవాలపై వైసీపీ నేతల ఫేక్ ప్రచారాలు బయటపడుతున్నాయి. ఈ ఎన్నికల్లో హోరాహోరీగా నామినేషన్లు దాఖలవుతున్నాయని అసత్యపు ప్రచారాలకు ఫ్యాన్ పార్టీ కేడర్ దిగుతున్నారు. తెలుగుదేశం పార్టీ కంటే ఎక్కువ నామినేషన్లు దాఖలు చేసినట్లు వైసీపీ నేతలు ప్రచారం చేసుకుంటున్నారు. 28 జిల్లాల్లో 9829 ఎంపీటీసీలకు గానూ మొత్తం 32,095 నామినేషన్లు దాఖలైనట్లు వైసీపీ నేతలు ఫేక్ ప్రచారాలు చేస్తున్నారు. మొత్తం 15,017 నామినేషన్లను టీడీపీ అభ్యర్థులు దాఖలు వేశారు. ఇప్పటికీ 12,419 నామినేషన్లను వైసీపీ అభ్యర్థులు దాఖలు చేశారు. జనసేన పార్టీ తరపున 2073 మంది నామినేషన్లను దాఖలు చేశారు. బీజేపీ నుంచి 562 నామినేషన్లు దాఖలయ్యాయి. 28 జిల్లాల్లో 659 జెడ్పీటీసీ స్థానాలకు గానూ మొత్తం 2805 నామినేషన్లు దాఖలు అయ్యాయి.వైసీపీ నుంచి 1092 మంది నామినేషన్లు వేశారు. తెలుగుదేశం పార్టీ తరపున 1055 నామినేషన్లు దాఖలయ్యాయి. జనసేన పార్టీ నుంచి 178, బీజేపీ తరపున 111 నామినేషన్లు దాఖలయ్యాయి. 2020లో జరిగిన పట్టణ, గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల్లో భారీగా ఏకగ్రీవలైన విషయం తెలిసిందే. నాడు జరిగిన పట్టణ స్థానిక సంస్థల్లో 20.72 శాతం ఏకగ్రీవాలను వైసీపీ చేసుకుంది. జగన్ మోహన్ రెడ్డి పాలనలో జరిగిన గ్రామీణ స్థానిక సంస్థల్లో 24 శాతం మేర ఎంపీటీసీ స్థానాలు, 19 శాతం మేర జెడ్పీటీసీ స్థానాలను ఏకగ్రీవంగా బలవంతంగా చేజిక్కించుకున్నారు. వైసీపీ నేతల విధ్వంసాలు, దాడులతో గొడవలను సృష్టించి ఏకగ్రీవం చేసుకుని విజయం సాధించామని నాడు జగన్ అండ్ కో ప్రకటించిన విషయం తెలిసిందే.

## ఆర్నబ్ తుఫాన్.. మునిసిపల్ కమిషనర్లకు మంత్రి నారాయణ ఆదేశాలివే



**అమరావతి, అక్టోబర్ 28:**
ఆర్నబ్ తుఫాన్ ప్రభావం ఉన్న ప్రాంతాల మునిసిపల్ కమిషనర్లతో మంత్రి నారాయణ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. తుఫాన్ ప్రభావంతో పట్టణాల్లో జన జీవనానికి ఇబ్బంది లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోడ్లపై చెట్లు కూలిన చోట వెంటనే తొలగించేలా తగిన యంత్రాలతో సిబ్బంది అలెర్ట్‌గా ఉండాలన్నారు. ఈదురు గాలులతో ప్రమాదకర హోర్డింగ్‌ల వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రోడ్లపై, డ్రెయిన్‌లలో నీరు నిలువకుండా ఇంజినీరింగ్ సిబ్బంది తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. వర్షం కారణంగా పారిశుద్ధ్య సమస్యలు, నీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు మంత్రి నారాయణ ఆదేశాలు జారీ చేశారు.ఆర్నబ్ తుఫాన్ బీభత్సంపై మంత్రి అనగాని సత్యప్రసాద్ సమీక్ష నిర్వహించారు.

## తుఫాన్‌పై వెనిగండ్ల రాము సమీక్ష.. స్వయంగా కారు నడుపుతూ గుడివాడలో పర్యటన



**కృష్ణా జిల్లా, అక్టోబర్ 28:** తుఫాన్ నేపథ్యంలో గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అప్రమత్తమయ్యారు. తుఫాన్ పరిస్థితిపై కూటమి నాయకత్వంతో గ్రూప్ కాల్ ద్వారా సమీక్ష నిర్వహించారు. అనంతరం స్వయంగా కారు డ్రైవ్ చేసుకుం టూ పట్టణంలో ఎమ్మెల్యే పర్యటించారు. ఏలూరు రోడ్, బస్టాండ్, మార్కెట్ సెంటర్, జైన్ స్ట్రీట్, ఆఫీస్ రోడ్, కొత్తపేటలో పర్యటించి పరిస్థితులను పరిశీలించారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితులను తెలుసుకునేందుకు క్షేత్రస్థాయిలో పర్యటించారు. రోడ్లపై కూలిన చెట్ల తొలగింపు పనులను పరిశీలించారు. పట్టణంలో 80 శాతం చెట్ల తొలగింపు పూర్తి అయ్యింది. దీంతో మున్సిపల్ యంత్రాంగం పనితీరును ఎమ్మెల్యే అభినందించారు.అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని.. బైక్‌లపై తిరగవద్దని ప్రజలకు ఎమ్మెల్యే సూచించారు. సాయంత్రం వరకు ఇదే పరిస్థితి ఉంటుందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము హెచ్చరించారు.

# తీరం దాటిన 'అర్నబ్' తుపాను – కొనసాగనున్న వర్షాలు



**అమరావతి :**అర్నబ్ తుపాను తీరం దాటింది. యానాంకు నైరుతి దిశలో నరసాపురానికి దగ్గరగా తీరం దాటినట్లు వాతావరణశాఖ వెల్లడించింది. ఇప్పుడు క్రమంగా బలహీనపడుతున్నట్లు అధికారులు తెలిపారు. తుపాను తీరం దాటిన క్రమంలో ఉభయ గోదావరి జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నయి. మధ్యాహ్నం వరకు వర్షాలు కొనసాగనున్నాయని వాతావరణ అధికారులు తెలిపారు. తీరం వెంబడి బలమైన ఈదురుగాలులు, వర్షాలు కొనసాగుతున్నాయి. కూడా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. తీవ్ర తుపాను దృష్ట్యా ఇవాళ భారీ, అతి భారీ, అత్యంత భారీ వర్షాలు కురస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. విశాఖ, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాలకు రెడ్ అలెర్ట్ జారీ చేసింది. కృష్ణా, ఎన్టీఆర్, బాపట్ల జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, గుంటూరు, పల్నాడు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. ఇవాళ అల్లూరి, అనకాపల్లి, విశాఖ, శ్రీకాకుళం, కోనసీమ, కృష్ణా, తూర్పుగోదావరి జిల్లాలకు ఫ్లాష్ ఫ్లడ్స్ వచ్చే అవకాశం ఉందని హెచ్చరించింది.అర్నబ్ తుపాను ప్రభావంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం వర్షం దంచి కొట్టింది. గోదావరి జిల్లాలు భారీ వర్షాలకు చిగురుటాకులా వణికాయి. భారీ ఈదురుగాలుల ధాటికి పలు చోట్లు చెట్లు, విద్యుత్ స్తంభాలు నెలకొరిగాయి. ఇళ్లలోకి నీరు చేరి జనం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కాకినాడలోని జగన్నాథపురం, గోలీలపేట, ఇందిరా నగర్, ముత్తా నగర్ ప్రాంతాలు నీట మునిగాయి. చాలా ఇళ్లలోకి నీరు చేరింది. దీంతో స్థానికులు ఇళ్లకు తాళాలు వేసి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లారు. జగన్నాథపురం రాజీవ్ గృహకల్ప ఆపార్ట్‌మెంట్ గ్రౌండ్ ఫ్లోర్ నీట మునిగింది. దీంతో నివాసితులు రెండో అంతస్తులోకి వెళ్లారు. సముద్రం శాంతించాలని కోరుతూ స్థానికులు గ్రామ దేవత మహాలక్ష్మీ అమ్మవారికి పూజలు చేశారు. ఈదురుగాలుల ధాటికి కోనసీమ జిల్లా అయినవిల్లి మండలంలో చింతనలంకలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలోని ధ్వజస్తంభం నేలకొరిగింది. పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం, పాలకొల్లు, అచంట నియోజకవర్గాల్లో భారీ ఈదురుగాలులు వీస్తున్నాయి. పలుచోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది

# ఏపీలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు వాయిదా.. కొత్త తేదీలు ఇవే!




**అమరావతి :**ఆంధ్రప్రదేశ్‌లో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల షెడ్యూల్ సవరణ పోలింగ్, ఓట్ల లెక్కింపు తేదీలలో మార్పులు నవంబర్ 3కి బదులుగా 5వ తేదీన పోలింగ్ నవంబర్ 5కి బదులుగా 7వ తేదీన ఓట్ల లెక్కింపు ఆంధ్రప్రదేశ్‌లో జరగాల్సిన జిల్లా పరిషత్, మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ (జెడ్పీటీసీ, ఎంపీటీసీ) ఎన్నికలు వాయిదా పడ్డాయి. గతంలో ప్రకటించిన షెడ్యూల్‌లో రాష్ట్ర ఎన్నికల సంఘం మార్పులు చేసింది. పోలింగ్‌తో పాటు ఓట్ల లెక్కింపు తేదీలను కూడా రెండు రోజుల పాటు వెనక్కి జరిపింది. వివరాల్లోకి వెళితే, గతంలో ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం నవంబర్ 3వ తేదీన జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ జరగాల్సి ఉంది. అయితే, తాజా నిర్ణయంతో పోలింగ్ తేదీని నవంబర్ 5వ తేదీకి మార్చారు. అదేవిధంగా, నవంబర్ 5న చేపట్టాల్సిన ఓట్ల లెక్కింపు ప్రక్రియను నవంబర్ 7వ తేదీన నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు.ఈ మార్పులకు గల కారణాలను అధికారులు స్పష్టంగా వెల్లడించనప్పటికీ, పరిపాలనా సౌలభ్యం కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. మొత్తం మీద, ముందుగా ప్రకటించిన తేదీలతో పోలిస్తే పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలు రెండూ రెండు రోజుల ఆలస్యంగా జరగనున్నాయి. ఈ మార్పులను అభ్యర్థులు, అధికారులు, ప్రజలు గమనించాలని ఎన్నికల సంఘం సూచించింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల ఏర్పాట్లను కొత్త తేదీలకు అనుగుణంగా అధికారులు సవరించుకుంటున్నారు.

## ముగ్గురు ఐపీఎస్‌లను తొలగించండి.. రాష్ట్రపతికి వైసీపీ ఎంపీ గురుమూర్తి లేఖ



**అమరావతి :**
ఆంధ్రప్రదేశ్‌లో ముగ్గురు సీనియర్ ఐపీఎస్ అధికారులను ఎన్నికల విధుల నుంచి తక్షణమే తొలగించాలని కోరుతూ వైసీపీ ఎంపీ గురుమూర్తి రాష్ట్రపతి, భారత ప్రధాన న్యాయమూర్తి, రాష్ట్ర గవర్నర్, రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధాన అధికారి సహా పలువురు ఉన్నతాధికారులకు లేఖ రాశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈ అధికారులు పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని ఆయన తన లేఖలో తీవ్ర ఆరోపణలు చేశారు.డీఐజీ కోయ ప్రవీణ్, అన్నమయ్య ఎస్పీ ధీరజ్ కనుబిల్లి, కడప ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్‌లను ఎన్నికల విధుల నుంచి తప్పించాలని ఎంపీ గురుమూర్తి డిమాండ్ చేశారు. 2019 ఎన్నికల సమయంలోనూ డీఐజీ కోయ ప్రవీణ్‌పై పక్షపాత ఆరోపణలు రావడంతో ఎన్నికల సంఘం ఆయన్ను విధుల నుంచి తొలగించిందని, అలాంటి అధికారిని మళ్లీ నియమించడం నిబంధనలకు విరుద్ధమని గుర్తుచేశారు. స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో పుంగనూరు, పులివెందుల, కమలాపురం, బద్వేల్ వంటి ప్రాంతాల్లో వైసీపీ అభ్యర్థులపై దాడులు జరిగాయని, వారిని అడ్డుకున్నారని గురుమూర్తి ఆరోపించారు. ముఖ్యంగా పుంగనూరులో తమ పార్టీ ఒక్క నామినేషన్ కూడా దాఖలు చేయలేకపోయిందని పేర్కొన్నారు. పోలీసుల పక్షపాత వైఖరి, పర్యవేక్షణ లోపాలపై స్వతంత్ర విచారణ జరిపించాలని, అభ్యర్థులకు పూర్తిస్థాయిలో రక్షణ కల్పించాలని ఆయన తన లేఖలో కోరారు.

# ఎండలు మండుతున్నాయి - ఆర్టీసీ ఏసీ సర్వీసులు పెంచాలని ప్రయాణికుల డిమాండ్

**హైదరాబాద్:**ఎల్?నినో ప్రభావంతో కరవు, ఎండల తీవ్రత పెరుగుతుండటంతో వ్యవసాయ రంగంతో పాటు ఆర్టీసీ బస్సులపై ప్రభావం చూపుతోంది. ప్రతి ఏటా ఈ సమయానికి చలిగాలులు మొదలవ్వాలి. కానీ ఎండల తీవ్రతతో ప్రజలు ఎక్కువ ఇబ్బందులు పడుతున్నారు. మరి ముఖ్యంగా ఐటీ ఉద్యోగులతో పాటు, సాధారణ ప్రయాణికులు సైతం ఏసీ బస్సుల వైపు మొగ్గు చూపుతున్నారు. ప్రస్తుతం హైదరాబాద్?లో 90కి పైగా ఏసీ బస్సులు (పుష్పక్ బస్సులతో కలిపి) నడుపుతుండగా మరిన్ని సర్వీసులు నడపాలంటూ ప్రయాణికులు కోరుతున్నారు.పెరుగుతున్న ఉష్ణోగ్రతఅక్టోబరు నుంచి వచ్చే సంవత్సరం ఫిబ్రవరి వరకు ఎల్నినో ప్రభావం ఎక్కువగా ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2-3 డిగ్రీలు ఎక్కువగానే నమోదవుతున్నాయి. ఆర్టీసీ గతంలో ప్రవేశపెట్టిన 30 శాతం టికెట్ ధరలు తగ్గింపుతో ఆక్సుపెన్సీ 60 శాతం నుంచి 85 శాతానికి పెరిగింది. ఏసీ బస్సుల్లో ఈ పథకం వర్తింపజేస్తే ఎక్కువ మందిని ఆకర్షించే వీలుంటుంది.రద్దీకి సరిపోని ఆర్టీసీ బస్సులుగచ్చిబౌలి, హైటెక్? సిటీ, మాదాపూర్ వైపు ప్రయాణించే టెక్కీలు ట్రాఫిక్ ఇబ్బందులు, ఉక్కపోత నుంచి తప్పించుకోవడానికి ఎలక్ట్రిక్ ఆధారిత ఈ-మెట్రో ఏసీ బస్సులనే మొదటి ప్రాధాన్యంగా ఎంచుకుంటున్నారు.



ప్రస్తుతం నగరంలో 90కిపైగా ఎలక్ట్రిక్ ఏసీ బస్సులు ఎయిర్‌పోర్టు లైనర్లతో కలిపి, 275కి పైగా మెట్రో డీలక్స్ బస్సులు నిత్యం 1000కి పైగా ట్రిప్పులు నడుపుతున్నా రద్దీకి అవి సరిపోవడం లేదు.ఏసీ బస్సులు సంఖ్య పెంచాలని డిమాండ్ప్రస్తుతం కోఠి, సికింద్రాబాద్, దిల్‌సుఖ్‌నగర్ శివార్ల నుంచి ఐటీ కారిడార్?కు కనెక్ట్? అయ్యే రూట్లలో ఏసీ బస్సుల కోసం ప్రయాణికులు గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. కార్యాలయాలు, విద్యాసంస్థల సమయాల్లో బస్సులు కిక్కిరిసిపోతున్నాయి. ఈ క్రమంలో శివారు ప్రాంతాల నుంచి ఐటీ జోన్లకు నేరుగా ఒకే బస్సు ఉండేలా సర్వీసులను పెంచాలని ప్రయాణికులు కోరుతున్నారు. రాత్రి వేళల్లో కూడా ఏసీ బస్సుల సంఖ్యను పెంచాలని ఐటీ ఉద్యోగులు చెబుతున్నారుట్యాంకర్లు నిండిన తర్వాత అదనంగా మిగిలే నీరు వృథా కాకుండా, దాన్ని తిరిగి సమీపంలోని చెరువుకు మళ్లించేలా ప్రణాళిక సిద్ధం చేయాలని చెప్పారు.ఈ గ్రీన్ వాటర్ అనేది తాగునీటికి ప్రత్యామ్నాయం కాదని, కేవలం తాగడానికి అవసరం లేని పనులకు మాత్రమే వినియోగించాలని జలమండలి అధికారులు స్పష్టం చేస్తున్నారు. నిర్మాణ రంగం, పరిశ్రమలు, రోడ్లపై దుమ్ము నియంత్రణ, పార్కులు, హరితహారం మొక్కల సంరక్షణ వంటి పనులకు ఈ నీటిని ఉపయోగించేలా ప్రజలను, సంస్థలను ప్రోత్సహించనున్నారు.

## తెలంగాణలో భారీగా ఐపఎస్‌ల బదిలీలు.. కీలక శాఖలకు కొత్త అధికారులు




**హైదరాబాద్, అక్టోబర్ 28:** తెలంగాణ ప్రభుత్వం పాలనా యంత్రాంగంలో కీలక మార్పులు చేపట్టింది. పలువురు సీనియర్ ఐఏఎస్ అధికారులకు కొత్త బాధ్యతలు అప్పగిస్తూ బదిలీలు, పోస్టింగులకు సంబంధించిన ఉత్తర్వులు జారీ చేసింది. జయేష్ రంజన్‌కు పర్యావరణం, అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించగా.. వికాస్ రాజ్‌కు ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పోస్టింగ్ ఇచ్చింది. నవీన్ మిట్టల్‌కు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖల బాధ్యతలు అప్పగించింది. శైలజా రామయ్యర్‌కు రెవెన్యూ (ఎండోమెంట్స్) శాఖ, ఏ.వాణి ప్రసాద్‌కు క్రీడలు, హెరిటేజ్ తెలంగాణ బాధ్యతలు కేటాయించింది. రాహుల్ బొజ్జాకు గిరిజన సంక్షేమ శాఖ అదనపు బాధ్యతలు అప్పగించగా, కె. ఇలంబర్తిను రవాణా శాఖ కార్యదర్శిగా నియమించింది.ఇతర మార్పుల్లో భాగంగా సర్ఫరాజ్ అహ్మద్‌కు జీహెచ్ఎంసీతో పాటు సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్ల అదనపు బాధ్యతలు అప్పగించారు. శృతి ఓజాకు మహిళా, శిశు సంక్షేమం, దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమ శాఖల బాధ్యతలు కేటాయించారు. ముషర్రఫ్ అలీ ఫారూఖీకి ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ బాధ్యతలు అప్పగించగా, డాక్టర్ సంగీత సత్యనారాయణను మహిళా, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా నియమించారు. జితేష్ వి. పాటిల్‌కు టీజీఎస్పీడీసీఎల్, టీజీఆర్ఈడీసీఓ బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు పేరుతో ఉత్తర్వులు విడుదలయ్యాయి.

## హైదరాబాద్‌లో దుర్గామాత ఊరేగింపుపై కోడిగుడ్ల దాడి.. కేసు నమోదు



**హైదరాబాద్, అక్టోబర్ 28:** మాదన్నపేటలో దుర్గామాత ఊరేగింపుపై కోడిగుడ్లతో దాడి చేసిన ఘటనకు సంబంధించి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 25న దుర్గామాత ఊరేగింపు జరుగుతున్న సమయంలో ఓ ఇంటి నుంచి కోడిగుడ్లు పడినట్లు అశ్విన్ కుమార్ పోలీసులకు ఫిర్యా దు చేశారు. హౌస్ నంబర్ 17-2-714/13 నుంచి కోడిగుడ్లు పడినట్లు ఆయన తన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో మదన్నపేట పోలీసులు 196(2), 299 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనకు సంబంధించి నలుగురు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.మరోవైపు.. మదన్నపేట పోలీస్ స్టేషన్‌లో యాకుత్‌పుర ఎమ్మెల్యే హంగామా చేసినట్లు ఆరోపణలు వ్యక్తమయ్యాయి. విచారణ నిమిత్తం పోలీసులు తీసుకొచ్చిన నలుగురు అనుమానితులను ఎమ్మెల్యే బలవంతంగా వెంట తీసుకెళ్లినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పోలీసుల దర్యాప్తునకు ఆటంకం కలిగించడంపై హిందూ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. కేసు విచారణలో ఉన్న అనుమానితులను ఎమ్మెల్యే ఎలా తీసుకెళ్తారని ప్రశ్నిం చాయి. ఈ పరిణామాలతో కేసు దర్యాప్తు ఏ మలుపు తిరుగుతుందనే అంశంపై చర్చ జరుగు తోంది. అయితే.. ఈ ఆరోపణలకు సంబంధించి పోలీసుల అధికారిక స్పందన తెలియాల్సి ఉంది.

# రాష్ట్రంలో ఎమర్జెన్సీ పాలన నడుస్తోంది : కాంగ్రెస్ సర్కార్‌పై హరీశ్ రావు ధ్వజం

**హైదరాబాద్ :** మూసీ ప్రాజెక్టుపై ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లకుండా బీఆర్ఎస్ నేతలను దిగ్బంధించారన్న హరీశ్ కరవుతో అల్లాడుతున్న రైతులను ఆదుకోవడం చేతకాని ప్రభుత్వమని విమర్శప్రతిపక్షాల గొంతును ఎంతకాలం అణచివేస్తా రని ప్రశ్న మూసీ నది ప్రాజెక్టుపై ప్రజాభిప్రాయ సేకరణకు హాజరుకాకుండా బీఆర్ఎస్ నేతలను గృహనిర్బంధం చేశారని ఆ పార్టీ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు మండి పడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎమర్జె న్సీ తరహా పాలన సాగిస్తూ, ప్రతిపక్షాల గొంతు నొక్కుతోందని ఆయన తీవ్రస్థాయిలో విమర్శిం చారు. హైదరా బాద్‌లోని వాలంతరిలో మూసీ ప్రాజెక్టుపై ప్రజాభిప్రాయ సేకరణ జరగాల్సి ఉంది. ఈ కార్యక్రమానికి హాజరుకావడానికి సిద్ధమైన మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఆమె కుమారుడు కార్తీక్ రెడ్డిలను పోలీసులు శ్రీనగర్ కాలనీలోని వారి నివాసంలో గృహ నిర్బంధం



చేశారు. తెల్లవారుజాము నుంచే వారి ఇంటి వద్ద భారీగా పోలీసులు మోహరించి, బయటకు రాకుండా అడ్డుకున్నారు.ఈ ఘటనపై హరీశ్ రావు ఎక్స్ వేదికగా స్పందించారు. "కరవుతో రైతులు అల్లాడుతుంటే ఆదుకోవడం చేతకాని ప్రభుత్వం, రూ. 1.50 లక్షల కోట్లతో మూసీ ప్రక్షాళన పేరుతో కమిషన్ల కోసం ప్రాజెక్టులు చేపడుతోంది" అని ఆరోపించారు. పోలీసులను అడ్డం పెట్టుకుని ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటూ, ప్రతిపక్షాల గొంతును ఎంతకాలం అణచివేస్తారని ప్రశ్నించారు. మూసీ ప్రక్షాళన ముసుగులో జరుగుతున్న దోపిడీ యత్నాలను తెలంగాణ సమాజం తిప్పికొడుతుందని, కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెబుతుందని హెచ్చరించారు.బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి కూడా అరెస్టులను ఖండించారు. ఇది అప్రజాస్వామిక చర్య అని, మూసీ పరీవాహక ప్రాంత ప్రజలకు అండగా నిలుస్తున్నందుకే తమను అక్రమంగా నిర్బంధించారని ఆరోపించారు. గృహనిర్బంధంలో ఉన్న బీఆర్ఎస్ నేతలను తక్షణమే విడుదల చేయాలని పార్టీ తరఫున డిమాండ్ చేశారు.

# మేడి అఖిల్ హత్య కేసులో నలుగురు నిందితుల అరెస్ట్

**లక్ష్మీదేవిపల్లి, అక్టోబర్ 28 :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎదురుగడ్డ గ్రామానికి చెందిన మేడి అఖిల్ హత్య కేసులో పరారీలో ఉన్న నలుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ఆదేశాల మేరకు టెక్నికల్ టీమ్ సహకారంతో సాంకేతిక ఆధారాలను విశ్లేషించి కేసును ఛేదించినట్లు కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ వెల్లడిం చారు. నమ్మదగిన సమాచారం మేరకు లక్ష్మీదేవి పల్లి ఎస్ఐ అఖిల తన సిబ్బందితో కలిసి కొత్త గూడెం బస్‌స్టాండ్ సమీపంలో నిందితులు దం త్యాల గణేష్ అలియాస్ గని, సిరిపురం సాత్విక్ అలియాస్ చిన్ను, ముద్దంగుల వెంకటేష్ అలియాస్ చిన్ని, తరాల ప్రదీప్‌ను అదుపులోకి తీసుకున్నారు.విచారణలో వెల్లడైన వివరాల ప్రకారం.. గతంలో జరిగిన గొడవలు, వ్యక్తిగత కక్షల నేపథ్యంలో ప్రధాన నిందితులుగా పేర్కొన్న గణేష్, సాత్విక్‌లు అఖిల్‌పై పగ పెంచుకుని హత్యకు పథకం రచించారు. ఇందులో భాగంగా మద్యం తాగిస్తామని నమ్మించి అఖిల్‌ను ఎదురుగడ్డ గ్రామంలోని రేకుల షెడ్డు సమీపంలోని ఖాళీ ప్రదేశానికి




తీసుకెళ్లారు. 19.10.2026 తెల్లవారుజామున సుమారు 3 గంటల సమయంలో గణేష్ కత్తితో అఖిల్ మెడపై పలుమార్లు పొడిచి, సిమెంట్ ఇటుకతో ముఖంపై దాడి చేయగా, సాత్విక్ కూడా సిమెంట్ ఇటుకతో దాడి చేసినట్లు విచారణలో వెల్లడైంది. ఈ దాడిలో అఖిల్ మృతి చెందాడు. ఈ హత్యకు సంబంధించి మిగిలిన నిందితులు సైతం ముందస్తు పథకంలో భాగంగా సహకరించినట్లు, మద్యం కొనుగోలు తదితర అవసరాల కోసం ఫోన్‌పే ద్వారా నగదు లావాదేవీలు జరిగినట్లు విచారణలో గుర్తించారు. నిందితుల వద్ద నుండి మూడు సెల్‌ఫోన్లు, ఫోన్ పే లావాదేవీలకు సంబంధించిన స్క్రీన్‌షాట్‌లను పోలీసులు రికవరీ చేశారు. హత్యకు ఉపయోగించిన కత్తి, రక్తపు మరకలు ఉన్న దుస్తులను స్వాధీనం చేసుకున్నారు.ఈ సందర్భంగా డీఎస్పీ ఆదినారాయణ మాట్లాడుతూ.. వ్యక్తిగత కక్షలు, పాత గొడవల కారణంగా హింసాత్మక చర్యలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. చిన్నచిన్న వివాదాలను పెద్దవిగా చేసుకొని నేరాలకు పాల్పడవద్దని, సమస్యలు తలెత్తినప్పుడు చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకుండా పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. నేరాలకు పాల్పడిన వారు ఎంతకాలం పరారీలో ఉన్నా సాంకేతిక ఆధారాలు, పోలీసుల దర్యాప్తు ద్వారా గుర్తించి చట్టం ముందు నిలబెడతామని స్పష్టం చేశారు.ఈ కేసులో నిందితుల పాత్ర, ఆర్థిక లావాదేవీలు, ఇతరుల ప్రమేయం తదితర అంశాలపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. నిందితులపై చట్ట ప్రకారం తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ కేసును ఛేదించడంలో టెక్నికల్ టీమ్ సహ కారం కీలకంగా నిలిచిందని డీఎస్పీ పేర్కొ న్నారు. ఈ కార్యక్రమంలో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ అఖిల, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## లంచం తీసుకుంటూ ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా చిక్కిన బంజారాహిల్స్ ఎస్ఐ




**హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలోని బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఓ సబ్-ఇన్‌స్పెక్టర్ లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికా రులకు రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయా డు. ఓ కేసులో సహాయం చేసేందుకు ఫిర్యాదుదారుడి నుంచి రూ.10 లక్షలు డిమాండ్ చేసినట్లు ఆయనపై ఆరోప ణలు ఉన్నాయి.వివరాల్లోకి వెళితే.. బం జారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేస్తున్న విజయ్, ఓ ఫిర్యాదుదారుడి నుంచి రూ.10 లక్షలు లంచం డిమాండ్ చేశాడు. దీనిపై బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. ముందుగా వేసుకున్న పథకం ప్రకారం, బుధవారం ఫిర్యాదుదారుడి నుంచి రూ.లక్ష లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు ఎస్ఐ విజయ్‌ను పట్టుకున్నారు.పోలీస్ స్టేషన్‌లోనే ఈ ఘటన జరగడంతో కలకలం రేగింది. ఏసీబీ అధికారులు వెంటనే ఎస్ఐ విజయ్‌ను అదుపులోకి తీసుకుని విచారణ నిమిత్తం తమ కార్యాలయానికి తరలించారు. ఈ కేసుకు సంబంధించి పూర్తి వివరాలు విచారణ అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది.

## ఈ నెలాఖరున దాన కిశోర్ పదవీ విరమణ.. గవర్నర్ స్పెషల్ సీఎస్‌గా పునర్నియామకం



**హైదరాబాద్:**తెలంగాణ ప్రభుత్వంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. సీనియర్ ఐఏఎస్ అధికారి దాన కిశోర్‌ను గవర్నర్‌కు ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా రాష్ట్ర ప్రభుత్వం పునర్నియమించింది. పదవీ విరమణ తర్వాత కూడా ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. ఈ మేరకు రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ) ఈరోజు ఉత్తర్వులు జారీ చేసింది.1996 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన దాన కిశోర్ ఈ నెల 31న పదవీ విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో, ఆయన సేవలను పదవీ విరమణ అనంతరం కూడా వినియోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశాల మేరకు జీఏడీ జీఓ ఆర్టీ నంబర్ 1554ను విడుదల చేసింది.ప్రస్తుతం గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న దాన కిశోర్‌ను అదే పదవిలో పునర్నియమిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆయన నియామకానికి సంబంధించిన నిబంధనలు, షరతులను ప్రత్యేకంగా జారీ చేయనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది.

# అర్నబ్ తుపాను ఎఫెక్ట్: తెలంగాణకు భారీ వర్ష సూచన.. రైళ్లు, విమానాల రద్దు

**హైదరాబాద్:**అర్నబ్ తుపాను ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు తెలంగాణలోని 9 జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ శంషాబాద్ నుంచి పలు విమాన సర్వీసులు రద్దు దక్షిణ మధ్య రైల్వే 11 రైళ్లను రద్దు చేస్తున్నట్లు ప్రకటన ప్రయాణికులు రైళ్ల సమాచారం తెలుసుకోవాలని అధికారుల సూచన అర్నబ్ తుపాను ప్రభావంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో జనజీవనంపై ప్రభావం పడుతోంది. తెలంగాణలో బుధవారం భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. రాష్ట్రంలోని జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, వరంగల్, మహబూబాబాద్, హనుమకొండ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. మిగిలిన జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.తుపాను కారణంగా రవాణా వ్యవస్థకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సోమవారం శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి విజయవాడ, విశాఖపట్నం వెళ్లాల్సిన పలు విమాన సర్వీసులు రద్దయ్యాయి. తుపాను పరిస్థితుల కారణంగానే విమానాలను రద్దు చేసినట్లు జీఎంఆర్



వర్గాలు ప్రకటించాయి. ఈ పరిస్థితి మరో రెండు రోజుల పాటు కొనసాగవచ్చని విమానాశ్రయ అధికారులు అంచనా వేస్తున్నారు.మరోవైపు, దక్షిణ మధ్య రైల్వే కూడా అప్రమత్తమైంది. కోస్తాంధ్ర, తూర్పు తెలంగాణలో భారీ వర్షాల నేపథ్యంలో రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ, ఇతర ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహి ంచారు. ముందుజాగ్రత్త చర్యగా 11 రైళ్లను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. రద్దయిన రైళ్లలో ఫలక్‌నుమా, గోదావరి, విశాఖ, గౌతమి, కోకనాడ, నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్‌లు ఉన్నాయి. ప్రయాణికులు తమ ప్రయాణానికి ముందు రైళ్ల ప్రస్తుత స్థితిని ఐఆర్‌సీటీసీ, ఎన్‌టీఈఎస్ వంటి అధికారిక యాప్‌లలో సరిచూసుకోవాలని రైల్వే అధికారులు సూచించారు.

# పద్మనాభ ద్వాదశి రోజున ఇలా వ్రతం చేస్తే కార్యసిద్ధి, శత్రుజయం ఖాయం!



శ్రీ మహావిష్ణువుకు అత్యంత ప్రీతికరమైన తిథి ద్వాదశి! ఏకాదశి మరుసటి రోజు వచ్చే ద్వాదశి తిథి రోజు ఏ పనిచేసినా శ్రీ మహావిష్ణువు అనుగ్రహంతో విజయం సిద్ధిస్తుందని పురాణోక్తి! ముఖ్యంగా ఏకాదశి ఉపవాస దీక్ష ఆచరించిన వారు ద్వాదశి పారణ చేస్తేనే ఏకాదశి వ్రత ఫలం సంపూర్ణంగా లభిస్తుంది. ఒక ఏడాదిలో 24 ద్వాదశులు ఉన్నప్పటికీ కొన్ని ద్వాదశి తిథులు మాత్రం చాలా విశిష్టమైనవి. ఈ క్రమంలో ఆశ్వయుజ శుద్ధ ద్వాదశి రోజు ఆచరించాల్సిన ఒక వ్రతం గురించి తెలుసుకుందాం.

### పద్మనాభ ద్వాదశి

ఆశ్వయుజ మాసానికి అధిపతి పద్మనాభుడు! ఈ మాసంలో వచ్చే ద్వాదశి రోజు శ్రీ మహావిష్ణువును పద్మనాభుని రూపంలో పూజిస్తాం కాబట్టి ఈ ద్వాదశికి పద్మనాభ ద్వాదశి అని పేరు వచ్చింది.

### పద్మనాభ ద్వాదశి ఎప్పుడు?

తెలుగు పంచాంగం ప్రకారం ఆశ్వయుజ శుద్ధ ద్వాదశిని పద్మనాభ ద్వాదశి అంటారు. ఈ ఏడాది అక్టోబర్ 23, శుక్రవారం ఆశ్వయుజ శుద్ధ ద్వాదశి కాబట్టి ఈ రోజునే పద్మనాభ ద్వాదశి వ్రతాన్ని ఆచరించాలని పంచాంగ కర్తలు సూచిస్తున్నారు. ఈ క్రమంలో అసలు పద్మనాభ ద్వాదశి వ్రతం విశిష్టత ఏమిటి? పూర్వం ఈ వ్రతాన్ని ఎవరు ఆచరించారు? ఈ వ్రతాన్ని ఎలా ఆచరించాలి? తదితర విషయాలు విపులంగా తెలుసుకుందాం.

### పద్మనాభ ద్వాదశి అంటే!

ఆశ్వయుజ శుద్ధ ద్వాదశిని పద్మనాభ ద్వాదశి అంటారు. ఈ రోజు శ్రీ మహా విష్ణువు అనంత పద్మనాభ స్వామిని పూజిస్తారు. వ్యాస మహర్షి రచించిన వరాహ పురాణంలో కూడా పద్మనాభ ద్వాదశి వ్రతం గురించిన ప్రస్తావన ఉంది. పాశాంకుశ ఏకాదశి మరుసటి రోజు జరుపుకునే పద్మనాభ ద్వాదశి వ్రతాన్ని భక్తి శ్రద్ధలతో ఆచరిస్తే కార్యసిద్ధి, శత్రుజయం ఉంటాయని పురాణ వచనం. పూర్వం పాండవులు ఈ వ్రతాన్ని ఆచరించి శత్రుజయం పొందారని పురాణాల ద్వారా తెలుస్తోంది.

### పద్మనాభ ద్వాదశి పూజా విధానం

పద్మనాభ ద్వాదశి రోజు శ్రీ మహావిష్ణువు స్వరూపమైన అనంత పద్మనాభ స్వామిని విశేషంగా పూజిస్తారు. ఈ రోజు సూర్యోదయానికి ముందే లేచి స్నాన సంధ్యావందనం, నిత్యానుష్ఠానం పూర్తి చేసుకోవాలి. అనంతరం పూజామందిరాన్ని శుభ్రం చేసుకొని లక్ష్మీనారాయణుల చిత్రపటాలను గంధం కుంకుమలతో అలంకరించాలి. ఆవు నేతితో దీపారాధన చేయాలి. అనంతరం లక్ష్మీ నారాయణులను సహస్రనామాలతో అర్చించాలి. వడపప్పు, పానకం, కొబ్బరికాయ, అరటిపండ్లు, పులిహోర, చక్రపొంగలి నైవేద్యంగా సమర్పించాలి. భాగవత కథలు, పద్మనాభ ద్వాదశి వ్రతకథ చదువుకోవాలి.

### పద్మనాభ ద్వాదశి వ్రతకథ

పూర్వం పాండవులు అరణ్యవాసం చేస్తున్న సమయంలో అనేక కష్టాలను అనుభవించాల్సి వచ్చింది. అనేక కఠిన పరిస్థితులు ఎదుర్కోవాల్సి వచ్చింది. అంతటి చక్రవర్తుల కూడా ఒక సమయంలో తిండి కూడా దొరక్క పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. అప్పుడు పాండవులు శ్రీకృష్ణుని ప్రార్థించి తమ కష్టాలు పోయే మార్గం చెప్పమని కోరారు. అప్పుడు శ్రీకృష్ణుడు ఆశ్వయుజ శుద్ధ ద్వాదశి రోజు వచ్చే పద్మనాభ ద్వాదశి రోజు భక్తి శ్రద్ధలతో శ్రీమహావిష్ణువును నియమ నిష్టలతో పూజిస్తే కష్టాలు తొలగి, కార్యసిద్ధి శత్రుజయం కలుగుతాయని చెప్పాడు.

### కష్టాల నుంచి బయటపడిన పాండవులు

శ్రీకృష్ణుడు చెప్పినట్లుగా పాండవులు ద్రౌపది సమేతంగా శాస్త్రోక్తంగా పద్మనాభ ద్వాదశి వ్రతాన్ని ఆచరించారు. అటు తర్వాత అరణ్య అజ్ఞాత వాసాలు పూర్తయ్యాక జరిగిన కురుక్షేత్ర సంగ్రామంలో పాండవులు కౌరవులపై విజయం సాధించి తమ రాజ్యాన్ని తిరిగి పొందారు. ఈ విధంగా పద్మనాభ ద్వాదశి వ్రతాన్ని ఆచరించి పాండవులు దరిద్రం నుంచి బయటపడి శత్రువులను జయించి తమ రాజ్యాన్ని తిరిగి పొందారు కాబట్టి ఆనాటి నుంచి కార్యసిద్ధి, శత్రుజయం కోరుకునేవారు పద్మనాభ ద్వాదశి వ్రతాన్ని ఆచరించడం ఆనవాయితీగా వస్తోంది.

### పద్మనాభ ద్వాదశి వ్రత ఫలం

భక్తిశ్రద్ధలతో పద్మనాభ ద్వాదశి వ్రతాన్ని ఆచరిస్తే చేపట్టిన పనుల్లో ఎదురవుతున్న ఆటంకాలు తొలగిపోయి కార్యసిద్ధి, శత్రుజయం కలుగుతాయి. మనం కూడా పద్మనాభ ద్వాదశి వ్రతాన్ని భక్తి శ్రద్ధలతో ఆచరిద్దాం. ఆ శ్రీమన్నారాయణుని అనుగ్రహాన్ని పొందుదాం. జై శ్రీమన్నారాయణ!

ముఖ్య గమనిక : పైన తెలిపిన వివరాలు కొందరు నిపుణులు, వివిధ శాస్త్రాల్లో పేర్కొన్న అంశాల ఆధారంగా అందించినవి మాత్రమే. వీటిలో అన్నిటికీ ఆధునిక శాస్త్రీయ ఆధారాలు

# మీ బెస్ట్ ఫ్రెండ్‌తో "బ్రేకప్" అయ్యిందా - ఇలా ట్రై చేస్తే ఆ పెయిన్ నుంచి బయటపడొచ్చు!



"బ్రేకప్" ఈ పేరు వినగానే అందరికీ గుర్తొచ్చేది లవర్స్. కానీ చిన్నప్పటి నుంచి మనతోటి ఉండి, మనకు వెన్నుముకగా నిలిచిన ప్రాణ స్నేహితుడితో విడిపోవడం కూడా బ్రేక ప్పే. పరిస్థితులు, అనుమానాలు, అపార్థాలు ఇలా కారణాలు ఏవైనా స్నేహితుల మధ్య దూరం కలిగించే బాధ వర్ణనాతీతం. లవ్? బ్రేకప్ కంటే ఫ్రెండ్స్ మధ్యలో ఏర్పడే బ్రేకప్? చాలా బాధకలిగిస్తుంది. ప్రేమలో విఫలమైతే ఓదార్చడానికి స్నేహితులు ఉంటారు. మరి ఫ్రెండిషిప్‌లోనే బ్రేకప్? ఏర్పడితే దాని నుంచి బయటపడటం అంత సులువు కాదు. అయితే కొన్ని చిట్కాలు ఈ బాధ నుంచి విముక్తి కలిగిస్తాయని చెబుతున్నారు నిపుణులు. అవేంటో ఇప్పుడు చూద్దాం.రియలైజ్ అవ్వాలి: బ్రేకప్? అయ్యిందని బాధపడుతూ కూర్చుంటే సమస్య తీరదంటున్నారు రిలేషన్‌షిప్ నిపుణులు. స్నేహబంధం విడిపోవడానికి అసలు కారణమేంటో గుర్తించాలంటున్నారు. ఈ క్రమంలోనే ఇద్దరూ విడిపోవడానికి తప్పు మీదా? లేదంటే మీ ఫ్రెండ్‌దా అనే విషయం ముందుగా తెలుసుకోవాలంటున్నారు. ఆ తర్వాత తప్పు మీవైపు ఉంటే క్షమాపణ కోరి, బంధాన్ని తిరిగి నిలబెట్టుకోవడం మంచిదంటున్నారు. అలాకాకుండా తప్పు తన వైపు ఉండి.. మీ నుంచి విడకోరుకుంటే మాత్రం బతిమాలాల్సిన పని లేదంటున్నారు నిపుణులు. ఈ విషయాన్ని గ్రహించి మనసుకు నచ్చచెప్పుకోమంటున్నారు. ఫలితంగా బాధను దూరం చేసుకుని సంతోషంగా ఉండొచ్చని చెబుతున్నారు.వాటిని డిలీట్ చేయండి: ఎంత మర్చిపోదామనుకున్నా, ఎంత వద్దనుకున్నా వాళ్లతో గడిపిన జ్ఞాపకాలన్నీ గుర్తుకు రావడం సహజం. ఇలాంటప్పుడు చాలా మంది ఆ జ్ఞాపకాల తాలూకు ఫొటోలు, వీడియోలు చూస్తుంటారు. అయితే దీనివల్ల బాధ రెట్టింపవడం తప్ప మరే ప్రయోజనం లేదంటున్నారు నిపుణులు. అందుకే వాటిని ఇంకా అట్టే పెట్టుకోకుండా డిలీట్ చేయడం వల్ల కొంతవరకు ప్రయో జనం ఉంటుందని వివరిస్తున్నారు. అలాగే మనసుకు బాధ కలిగినప్పుడు ఒంటరిగా ఉండకుండా మీ ఇంట్లో వాళ్లతో బాధను పంచుకోవడం, వాళ్లతో కాస్త సమయం గడపడం వంటివి చేస్తే కుంగిపోకుండా జాగ్రత్తపడచ్చని.. తద్వారా ఆ బాధను త్వరగా మర్చిపోయే అవకాశాలూ ఎక్కువుంటాయని చెబుతున్నారు.సెల్ఫ్? లవ్? ఎలాంటి బాధ నుంచైనా బయటపడేయగలదని చెబుతున్నారు నిపుణులు. అందుకే ఒంటరిగా ఫీలవకుండా మనకంటూ కాస్త సమయం కేటాయించుకోవడం, నచ్చిన పనులపై దృష్టి పెట్టడం చేయమంటున్నారు. దీని వల్ల కొంతవరకు ప్రయోజనం ఉంటుందని వివరిస్తున్నారు.బ్రేకప్ బాధ నుంచి విముక్తి పొందాలంటే వ్యాయామం చక్కటి ఔషధం అంటున్నారు నిపుణులు. ఎందుకంటే దీని వల్ల శరీరంలో ఫీల్‌గుడ్ హార్మోన్లు విడుదలై మానసిక ప్రశాంతతను అందిస్తాయని చెబుతున్నారు.

ఫ్రెండ్‌షిప్‌లో ఒక్కసారి విడిపోయినంత మాత్రాన ఇంకొకరితో స్నేహం చేయకూడదనుకోవడం పొరపాటు అంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో గత స్నేహంలో మీ తప్పులేవైనా ఉంటే సరిదిద్దుకొని, మరోసారి అవి రిపీట్? కాకుండా చూసుకోవడం మంచిదంటున్నారు. అలాగే పూర్వపు చేదు అనుభవాల గురించి మీ కొత్త స్నేహితులతో చెప్పడమూ తప్పు కాదని వివరిస్తున్నారు.

# కర్వా చౌత్ రోజు జల్లెడలో భర్త ముఖం ఎందుకు చూస్తారు?

తమ భర్త క్షేమం కోసం, శ్రేయస్సు కోసం మహిళలు నిష్టగా ఆచరించే వ్రతం కర్వా చౌత్! ఇందులో భాగంగా మహిళలు రోజంతా ఉపవాస దీక్ష చేపట్టి, నూతన వధువుల్లాగా ముస్తాబై, చంద్రోదయం తర్వాత పూజచేసి దీక్ష విరమిస్తారు. ఉత్తరభారతంలో విశిష్టంగా జరుపుకునే ఈ పండుగ ఎలా జరుపుకోవాలి? కర్వా చౌత్ విశిష్టత ఏమిటి? అనే అంశాల గురించి పూర్తిగా తెలుసుకుందాం.



విభిన్న సంస్కృతుల మేళవింపు మన భారతం మన దేశంలో ఏ పండగైనా ఆయా సంప్రదాయాల ప్రకారం ఒక్కో ప్రాంతంలో ఒక్కో విధంగా జరుపుకోవడం తెలిసిందే! కర్వా చౌత్ పండుగ కూడా అలాంటిదే! విభిన్న సంస్కృతుల మేళవింపు అయిన మన భారత దేశంలో వృత్తి రీత్యా ఒక ప్రాంతం వారు ఇంకో ప్రాంతంలో స్థిరపడడం చూస్తున్నాం. ఈ క్రమంలో ఇప్పుడు దక్షిణాదిన కూడా ఉత్తరాది సంప్రదాయం అధికంగా కనిపిస్తోంది. ముఖ్యంగా హోలీ, ధన్ తేరస్ వంటి పండుగలు అన్ని ప్రాంతాల్లో జరుపుకోవడం చూస్తూనే ఉన్నాం. ఈ సందర్భంగా ఉత్తర భారత దేశంలో విశిష్టంగా జరుపుకునే కర్వా చౌత్ పండుగ ఎప్పుడు? ఆ రోజు ఎలాంటి నియమాలు పాటించాలో చూద్దాం.

### కర్వా చౌత్ పండుగ ఎప్పుడు?

ఆశ్వయుజ బహుళ తదియ రోజున కర్వా చౌత్ పండుగ జరుపుకుంటారు. ఇదేరోజు దక్షిణాదిన ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో అట్లతద్ది పండుగ జరుపుకోవడం కాకతాళీయం. పండగ ఏదైనా, అవి ఆయా ప్రాంతాల సంస్కృతి సంప్రదాయాల్ని ప్రతిబింబిస్తాయి. ఈ ఏడాది అక్టోబర్ 28, బుధవారం ఆశ్వయుజ బహుళ తదియ. అందుకే ఈ రోజునే కర్వా చౌత్ పండుగ జరుపుకోవాలి. సాధారణంగా కొన్ని పండుగలు ఇంటిల్లిపాదీ, బంధువులతో కలిసి జరుపుకుంటారు. మరికొన్ని పండుగలు మహిళలు మాత్రమే జరుపుకుంటారు. ప్రత్యేకించి కర్వా చౌత్ వ్రతంలో భాగంగా మహిళలు పార్వతీ దేవిని భక్తి శ్రద్ధలతో పూజించి, నిష్టతో ఉపవాసం చేస్తారు. ఉత్తరాది మహిళలు ఈ పండుగను ఎంతో ఘనంగా జరుపుకుంటారు.

### చౌత్ మాత పూజ

కర్వా చౌత్ పండుగ సందర్భంగా మహిళలు తమ పసుపు కుంకుమలు చల్లగా చూడమని ప్రార్థిస్తూ పార్వతీదేవిని పూజిస్తారు. ఈ రోజు సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు నీరు కూడా తాగకుండా కఠిన ఉపవాస దీక్షను చేపడతారు. ఈ రోజు 'చౌత్ మాత'ను పూజించడం సంప్రదాయం. పార్వతిదేవికి ప్రతిరూపంగా భావించే చౌత్ మాతాకు ఈ రోజు విశేష పూజలు చేస్తారు.

### కర్వా చౌత్ వ్రతవిధానం

కర్వా చౌత్ వ్రతాన్ని ఆచరించే మహిళలు ఉదయాన్నే తలారా స్నానం చేసి ఒక కర్వాలో అంటే మట్టి పాత్రలో నీటిని తీసుకుని ఆ నీటితో పార్వతీదేవిని అభిషేకించి, పూజించి ఉపవాస దీక్షకు పూనుకుంటారు. ఇక సాయంత్రం సూర్యాస్తమయం తరువాత తిరిగి స్నానం చేసి పూజా కార్యక్రమాలు నిర్వహించి, కర్వా చౌత్ వ్రతకథను పఠిస్తారు. అటు తర్వాత జల్లెడలో చంద్రుని చూసి, ఆపై భర్త ముఖాన్ని తిలకిస్తారు. అనంతరం చంద్రునికి అర్ఘ్యం సమర్పించి, తమ భర్త చేతులతో నీళ్లు తాగి ఉపవాస దీక్ష విరమిస్తారు. ఇలా నియమనిష్టలతో, భక్తిశ్రద్ధలతో అమ్మవారిని ప్రసన్నం చేసుకోవడం వలన తమ సౌభాగ్యం శాస్వతంగా నిలుస్తుందని మహిళల విశ్వాసం.

### కోడలికి అత్తగారి సారె!

సాధారణంగా కొత్తగా పెళ్లైన అమ్మాయికి, గర్భవతిగా ఉన్న అమ్మాయికి పుట్టింటి వారు సారె అందించడం సంప్రదాయం. అయితే ఇందుకు భిన్నంగా కర్వా చౌత్ పండుగ సందర్భంగా అత్తగారు తన కోడలికి సారె అందించడం పంజాబ్, హరియాణా వంటి రాష్ట్రాల్లో కనిపిస్తుంది. ఈ సారెను అక్కడ 'సర్గి' అంటారు. కర్వా చౌత్ పండుగ రోజు వ్రతం ఆచరించే ముందు కోడలికి అత్తగారు ఈ సారెను అందిస్తారు. ఈ సారెలో అత్తగారు తన స్వహస్తాలతో తయారు చేసిన పిండి వంటలు, పళ్లు, డ్రై ఫ్రూట్స్, చీర, గాజులు, పసుపు, కుంకుమ వంటి సుమంగళి ద్రవ్యాలు ఉంటాయి. వీటన్నింటిని ఒక పెద్ద పళ్లెంలో ఉంచి అత్తగారు తన కోడలికి అందిస్తుంది. కోడలు అత్తగారికి నమస్కరించి ఈ సారెను స్వీకరిస్తుంది.

### అసలైన వేడుక సాయంత్రమే!

కర్వా చౌత్ వ్రతం రోజు సాయంత్రమయ్యేసరికి మహిళలంతా ఎరుపు రంగు వస్త్రాలు ధరించి ఒక్కచోటుకి చేరుతారు. కర్వా చౌత్ వ్రతం, పూజ పూర్తయ్యాక వ్రతకథను కూడా చదువుకుని ఒకరికొకరు పసుపు, కుంకుమ, బియ్యంతో, గాజులు, అద్దం వంటి వాటితో కూడిన పూజ థాలిని ఒకరికొకరు ఇచ్చి పుచ్చుకుంటారు. ఈ సందర్భంగా వారు పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ ఆనందంగా గడుపుతారు. ఇక రాత్రికి చంద్ర దర్శనం అయిన తర్వాత భర్త ముఖాన్ని జల్లెడలో చూసి, ఆయన చేతుల మీదుగా నీరు తాగి, అత్తగారు అందించిన సారెలోని పిండివంటలు ఆరగించి ఉపవాస దీక్షను విరమిస్తారు.

### రాజస్థాన్?లో 'బయా' సంప్రదాయం

కర్వా చౌత్ పండుగ సందర్భంగా రాజస్థాన్?లో ఓ ప్రత్యేక సంప్రదాయాన్ని పాటిస్తారు. అదేంటంటే ఈ రోజున తల్లులు వివాహమైన తమ కూతురికి పుట్టింటి నుంచి ప్రత్యేక బహుమతులు పంపిస్తారు. ఈ సంప్రదాయాన్ని 'బయా' అంటారు. ఈ సంప్రదాయంలో భాగంగా పెళ్లైన తమ ఆడపిల్లలకు కొత్త బట్టలు, పిండి వంటలు, పసుపు కుంకుమలు, గాజులు, మెట్టెలు, పువ్వులు వంటి వస్తువులు అందిస్తారు. వారి వారి తాహతకు తగినట్లు వెండి బంగారు ఆభరణాలు కూడా ఇచ్చే వారుంటారు. ఈ విధంగా 'బయా' పేరుతో ఈ ప్రత్యేక బహుమతులను తమ కుమార్తెలకు అందిస్తూ వారి సౌభాగ్యం కలకాలం నిలవాలని కోరుకుంటారు.

### కలిసికట్టుగా ఉపవాసం

గుజరాత్ రాష్ట్రంలో కర్వా చౌత్ పండుగ సందర్భంగా మహిళలంతా ఒక్కచోట చేరి సామూహిక ఉపవాస దీక్షలు చేపడతారు. ఈ సందర్భంగా మహిళలందరూ సమీపంలోని ఆలయానికి చేరుకుంటారు. అక్కడే ప్రత్యేక పూజలు చేసి, ఉపవాస దీక్ష చేస్తారు. భగవంతుని సమక్షంలో అందరూ కలిసి భజనలు, కీర్తనలు పాడుతూ అమ్మవారిని ప్రసన్నం చేసుకుంటారు. సాయంత్రం చంద్ర దర్శనం అయ్యాక జల్లెడలో భర్త ముఖాన్ని చూసి నీరు తాగి ఉపవాస దీక్షను విరమిస్తారు. ఇలా కలిసికట్టుగా పండుగ చేసుకోవడం వలన సామాజిక దృఢపడతాయని విశ్వాసం.

### వినూత్న సంప్రదాయం

ఇక హిమాచల్ ప్రదేశ్?లో ఓ వినూత్న సంప్రదాయం ఉంది. కర్వా చౌత్ పండుగ సందర్భంగా అక్కడి మహిళలు అందరూ ఒక్కచోట చేరి వారు స్వయంగా రాసి, బాణీ కట్టిన పాటలు పాడుకుంటూ, నృత్యాలు చేస్తూ ఆనందంగా గడుపుతారు. సాయంత్రం చంద్ర దర్శనం అయ్యాక జల్లెడలో భర్త ముఖాన్ని చూసి నీరు తాగి ఉపవాస దీక్షను విరమిస్తారు.

### రెట్టింపు సంతోషం

పండుగ అంటే కేవలం ఉపవాస దీక్షలు, దేవుని ఆరాధన మాత్రమే కాదు. వాటితో పాటుగా అందరూ కలిసి ఒక్కచోట చేరి ఉత్సాహంగా, ఆనందం గడపడం వలన పండుగ సంతోషం రెట్టింపవుతుంది.

### పంచుకుంటే పెరిగే ఆనందం

నిజానికి కర్వా చౌత్ పండుగ ఉత్తర భారతంలో పుట్టినా, క్రమంగా ఈ పండుగ దక్షిణాదికి

# మీకు "కర్లీ హెయిర్" ఉందా - జుట్టు ఊడిపోకూడదంటే ఈ జాగ్రత్తలు తప్పనిసరట!

ఒత్తుగా, మెలికలు తిరిగిన ఉంగరాల జుట్టు అంటే ఎవరికి ఇష్టం ఉండదు చెప్పండి. ముఖ్యంగా అమ్మాయిలు అయితే తెగ ఇష్టపడుతుంటారు. లేని వారు కూడా ప్రత్యేకంగా కర్లింగ్ చేయించుకుంటున్నారు. ఇంతవరకు బానే ఉన్నా ఈ తరహా శిరోజాలను సరిగా మెయింటెయిన్ చేయలేకపోతే వెంట్రుకలు తెగిపోవడమే కాకుండా, పొడిగా మారి రాలిపోయే ప్రమాదమూ ఉందని హెచ్చరిస్తున్నారు సౌందర్య నిపుణులు. అయితే అలాకాకుండా ఉండాలంటే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. అవేంటో ఈ స్టోరీలో చూద్దాం.కర్లీ హెయిర్ ఉన్నవారు జట్టు పొడిగా ఉన్నప్పుడు ఎట్టిపరిస్థితుల్లోనూ తల దువ్వకూడదని హెచ్చరిస్తున్నారు. తలస్నానం చేసిన వెంటనే కండిషనర్ లేదా సీరమ్ అప్లై చేసిన తర్వాత మాత్రమే చిక్కులు తీయాలని సూచిస్తున్నారు. లేదంటే జుట్టు ఒంపులు దెబ్బతినడమే కాకుండా పీచులా మారుతుందని హెచ్చరిస్తున్నారు.రింగుల జుట్టు ఉన్నవారు జుట్టు మొత్తాన్ని ఒకేసారి దువ్వకూడదని హెచ్చరిస్తున్నారు. జట్టును నాలుగైదు భాగాలుగా విభజించి, ఒక్కో భాగాన్ని నిదానంగా వేళ్లతోనో, వెడల్పాటి దువ్వెనతోనో దువ్వమని సలహా ఇస్తున్నారు. ఇలా చేయడం వల్ల వెంట్రుకలపై ఒత్తిడి పడదంటున్నారు. ఇక సన్నటి పళ్లు ఉండే సాధారణ దువ్వెనలు, బ్రష్‌లను ఉపయోగిస్తే జుట్టు మధ్యలోకి తెగిపోతుందని హెచ్చరిస్తున్నారు. అందుకే వెడల్పాటి పళ్లున్న చెక్క దువ్వెన, డిటాంగ్లింగ్ బ్రష్‌లను మాత్రమే ఎంచుకోవాలని.. లేదంటే వేళ్లతో చిక్కులు తీసుకోగలిగినా మంచిదంటున్నారు.

చాలా మంది తల పైభాగం నుంచి కిందకు గట్టిగా దువ్వడం వంటివి చేస్తుంటారు. కానీ ఇది సరైంది కాదంటున్నారు. దీనివల్ల చిక్కులన్నీ కిందకు చేరి, జుట్టు ఊడిపోతుందని హెచ్చరిస్తున్నారు. కాబట్టి, ముందుగా జుట్టు చివర్లలో ఉన్న చిక్కులను మెల్లగా తొలగించాలని.. ఆపై కొద్దికొద్దిగా పైకి వెళ్తూ కుదుళ్ల వరకు దువ్వుకోవాలని సూచిస్తున్నారు.ఈ జాగ్రత్తలు కూడా:కొంతమందికి రోజూ హెడ్ బాత్ చేయడం అలవాటు. ఉంగరాల జుట్టు ఉన్న వారూ ఇలాగే చేస్తుంటారు. అయితే ఇలా



రోజూ తలస్నానం చేయడం వల్ల జుట్టు మరింత పొడిబారుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కాబట్టి, నిపుణుల సలహా మేరకు వారానికి 2 లేదా 3 సార్లు మాత్రమే తలస్నానం చేయాలని సూచిస్తున్నారు.

కర్లీ హెయిర్ ఇతర రకాల జుట్టు కంటే పొడిగా ఉంటుంది. అయితే తేమగా ఉంచడానికి, జుట్టు చివర్లకు మాత్రమే కాకుండా, మొత్తానికి కండిషనర్ అప్లై చేసుకోవాలని సూచిస్తు న్నారు. ఇది జుట్టు పొడిబారిపోకుండా చేస్తుందంట ున్నారు. అలాగే తలస్నానానికి వేడి నీళ్లు కాకుండా గోరు వెచ్చటి నీళ్లు లేదా చల్లటి నీళు ఉపయోగించడం మేలని సూచిస్తున్నారు.

ఉంగరాల జుట్టు సంరక్షణ కోసం వారానికి తడి జుట్టుకు కండిషనర్ రాసి, అరచేతులతో కింద నుంచి పైకి మెల్లగా నొక్కడం వల్ల జుట్టు ఒంపులు స్పష్టంగా, అందంగా కనిపిస్తాయని.. దీన్నే స్క్రంచింగ్ పద్ధతి అని పిలుస్తార ంటున్నారు. అయితే రింగుల జుట్టుకు తేమ చాలా అవసరం అని, వీలైనంత వరకు సల్ఫేట్ లేని షాంపూలు, కండిషనర్లు ఉపయోగిస్తే శిరోజాలు ఆరోగ్యంగా, అందంగా మెరుస్తుం టాయని వివరిస్తున్నారు.

ఈ జాగ్రత్తలు కూడా:కొంతమందికి రోజూ హెడ్ బాత్ చేయడం అలవాటు. ఉంగరాల జుట్టు ఉన్న వారూ ఇలాగే చేస్తుంటారు. అయితే ఇలా రోజూ తలస్నానం చేయడం వల్ల జుట్టు మరింత పొడిబారుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నాకింద నుంచి పైకి మెల్లగా నొక్కడం వల్ల జుట్టు రు. కాబట్టి, నిపుణుల సలహా మేరకు వారానికి 2 లేదా 3 సార్లు మాత్రమే తలస్నానం చేయాలని సూచిస్తున్నారు. కర్లీ హెయిర్ ఇతర రకాల జుట్టు కంటే పొడిగా ఉంటుంది. అయితే తేమగా ఉంచడానికి, జుట్టు చివర్లకు మాత్రమే కాకుండా, మొత్తానికి కండిషనర్ అప్లై చేసుకోవాలని సూచిస్తు న్నారు. ఇది జుట్టు పొడిబారిపోకుండా చేస్తుందంట ున్నారు. అలాగేకింద నుంచి పైకి మెల్లగా నొక్కడం వల్ల జుట్టు తలస్నానానికి వేడి నీళ్లు కాకుండా గోరు వెచ్చటి నీళ్లు లేదా చల్లటి నీళు ఉపయోగించడం మేలని సూచిస్తున్నారు.

ఉంగరాల జుట్టు సంరక్షణ కోసం వారానికి మూడు సార్లు నూనె పెట్టుకోవడం మంచిదని వివరిస్తున్నారు నిపుణులు. ఈ నేపథ్యంలో నూనెను కుదుళ్లు, కేశాలకు అప్లై చేసి కాసేపు మసాజ్? చేయాలంటున్నారు.

# యాదాద్రి భువనగిరి జిల్లా లీగల్ మెట్రాలజీ ఇన్స్పెక్టర్ ఏసీబీకి చిక్కారు

- యాదాద్రి భువనగిరి జిల్లా లీగల్ మెట్రాలజీ ఇన్స్పెక్టర్ మరియు ఒక ప్రైవేట్ వ్యక్తి ఏసీబీ వలలో చిక్కుకున్నారు.



**తెలంగాణ, హైదరాబాద్ :** యాదాద్రి భువనగిరి జిల్లా లీగల్ మెట్రాలజీ ఇన్స్పెక్టర్ కె. వెంకటేశ్వర్లు లంచం డిమాండ్ చేసి స్వీకరిస్తుండగా నల్గొండ రేంజ్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఫిర్యాదుదారునికి "వెరిఫికేషన్ సర్టిఫికేట్" జారీ చేసినందుకు మరియు అతని పెట్రోల్ బంకుకు సంబంధించిన "డైలీ సేల్స్ రిజిస్టర్"ను అందజేసినందుకు ప్రతిఫలంగా, ఏ-2అయిన శ్రీ కసారం రవీందర్ (ప్రైవేట్ వ్యక్తి - పెట్రోల్ పంప్ టెక్నీషియన్) ద్వారా రూ. 20,000/- లంచాన్ని స్వీకరించారు. ఏ.ఓ-1 సూచన మేరకు, హైదరాబాద్‌లోని ఎల్.బి. నగర్ వద్ద ఏ-2 ఈ రూ. 20,000/- లంచాన్ని ఫిర్యాదుదారుని నుండి తీసుకున్నారు. ఇందులో రూ. 15,000/- ఏ.ఓ-1 కోసం, మరియు రూ. 5,000/- ఏ-2 తన సొంత వాటాగా ఉంచుకోవాలని నిర్ణయించుకున్నారు. ఏ-2 వద్ద నుండి ఈ లంచం సొమ్ము రూ. 20,000/-ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తద్వారా, ఏ.ఓ-1 తన విధులను అక్రమంగా, నిజాయితీ లేకుండా నిర్వహించి, అన్యాయమైన ప్రయోజనాన్ని పొందారు.కావున, ఏ.ఓ-1 మరియు ఏ-2లను జ్యుడీషియల్ రిమాండ్ నిమిత్తం నాంపల్లిలోని 'ఎస్.పి.ఇ. అండ్ ఏ.సి.బి. కేసుల ప్రత్యేక న్యాయస్థానం' ముందు హాజరుపరుస్తున్నారు. ఈ కేసుపై దర్యాప్తు కొనసాగుతోంది. భద్రతా కారణాల దృష్ట్యా ఫిర్యాదుదారుని వివరాలను గోప్యంగా ఉంచడమైనది.సెల్ ఫోన్ నంబర్ - 1064 (టోల్ ఫ్రీ నంబర్):ఏదైనా ప్రభుత్వ ఉద్యోగి లంచం డిమాండ్ చేసినట్లయితే, చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు ప్రజలు ఏ.సి.బి. టోల్ ఫ్రీ నంబర్ '1064'ను సంప్రదించవచ్చు. అలాగే, వాట్సాప్ (9440446106), ఫేస్‌బుక్ మరియు ఎక్స్ /గతంలో ట్విట్టర్ - వంటి సోషల్ మీడియా వేదికల ద్వారా కూడా తెలంగాణ ఏ.సి.బి.ని సంప్రదించవచ్చు. ప్రభుత్వ కార్యాలయాలు మరియు ప్రధాన బహిరంగ ప్రదేశాలలో ఏ.సి.బి.కి సంబంధించిన క్యూఆర్ కోడ్ అందుబాటులో ఉంటుంది. ఫిర్యాదుదారుని పేరు మరియు వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయి.

# ఏసీబీకి చిక్కిన మిర్‌చౌక్ ఇన్స్పెక్టర్ మరియు హోమ్ గార్డ్

- హైదరాబాద్‌లోని మిర్‌చౌక్ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఇన్స్పెక్టర్ మరియు హోమ్ గార్డ్ ఏసీబీ కి పట్టుబడ్డారు.




హైదరాబాద్‌లోని మిర్‌చౌక్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్, శ్రీ ఎం. కొండల్ రావు ఫిర్యాదుదారుని వద్ద రూ. 6,00,000 లంచం డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా, అదే పోలీస్ స్టేషన్‌కు చెందిన హోమ్ గార్డ్, శ్రీ అబిద్ అలీ ద్వారా రూ. 3,00,000 లంచం మొత్తాన్ని స్వీకరిస్తుండగా, ఏసీబీ (సిటీ రేంజ్-1 యూనిట్) అధికారులు వారిని పట్టుకున్నారు. అధికారికంగా సహాయం చేసినందుకు, అనగా, ఫిర్యాదుదారుని తండ్రిపై నమోదైన కేసును మూసివేయడం, బలవంతపు చర్యలను నివారించడం, మరియు భవిష్యత్తుకు మద్దతు ఇవ్వడం వంటి వాటి కోసం.స్వాధీనంలో నుండి రూ.3,00,000/- విలువైన కలుషితమైన లంచం స్వాధీనం చేసుకోబడింది. ఈ విధంగా,అక్రమ ప్రయోజనం పొందడానికి తమ విధులను సక్రమంగా మరియు నిజాయితీ లేకుండా నిర్వర్తించారు.అందువల్ల, అరెస్టు చేసి, జ్యుడిషియల్ రిమాండ్ కోసం నాంపల్లిలోని కేసుల గౌరవనీయ ప్రిన్సిపల్ స్పెషల్ జడ్జి ముందు హాజరుపరచడం జరుగుతోంది. కేసు దర్యాప్తులో ఉంది. భద్రతా కారణాల దృష్ట్యా ఫిర్యాదుదారుని వివరాలు గోప్యంగా ఉంచబడ్డాయి.

# ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల షెడ్యూల్ సవరణ... నవంబర్ 5న పోలింగ్.. 6న రీపోలింగ్.. 7న ఓట్ల లెక్కింపు,

**జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.లక్ష్మీశ.**



**విజయవాడ: అక్టోబర్ 28, 2026:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ సాధారణ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన షెడ్యూల్‌ను సవరించినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.లక్ష్మీశ ఒక ప్రకటనలో తెలిపారు.సవరించిన ఎన్నికల షెడ్యూల్ ప్రకారం....పోలింగ్ తేదీ నవంబర్ 5, 2026 (గురువారం), ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు, రీపోలింగ్ (అవసరమైన చోట) నవంబర్ 6, 2026 (శుక్రవారం) ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందన్నారు. అలాగే ఓట్ల లెక్కింపు నవంబర్ 7, 2026 (శనివారం), ఉదయం 8 గంటల నుంచి ఉంటుందని, ఓట్ల లెక్కింపు పూర్తయిన వెంటనే ఫలితాల ప్రకటన చేయడం జరుగుతుందన్నారు.పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల ఓట్ల లెక్కింపు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ ఒకే రోజున ఉండటంతో పోలీసు, పోలింగ్ సిబ్బంది మరియు ఇతర అవసరమైన వనరుల సమర్థ వినియోగం కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం ఈ షెడ్యూల్‌ను సవరించినట్లు తెలిపారు. సవరించిన షెడ్యూల్ ప్రకారం ఎన్నికల నిర్వహణకు సంబంధిత అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని, ఎన్నికల తేదీలపై ప్రజలకు విస్తృత ప్రచారం కల్పించాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

# జారాహిల్స్ పోలీస్ స్టేషన్ సబ్-ఇన్స్పెక్టర్ ఏసీబీకి చిక్కారు

- హైదరాబాద్ నగరం, బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌కు చెందిన సబ్-ఇన్స్పెక్టర్ ఏసీబీకి పట్టుబడ్డారు.



**తెలంగాణ, హైదరాబాద్ :** బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో సబ్-ఇన్స్పెక్టర్‌గా పనిచేస్తున్న కొట్టూరు విజయ్ అనే అధికారిపై నేరపూరిత దుష్ప్రవర్తనకు సంబంధించి కేసు నమోదైంది. కోర్టు ద్వారా బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌కు వచ్చిన క్రైమ్ నంబర్లు 524/2024 మరియు 525/2024 కేసులకు సంబంధించి, ఫిర్యాదుదారుడిని అరెస్టు చేయకుండా ఉండేందుకు, అలాగే సీఆర్‌పీసీ కింద నోటీసులు జారీ చేసి, వాటికి ఫిర్యాదుదారుడు ఇచ్చిన సమాధానాలను స్వీకరించేందుకు, మరియు భవిష్యత్తులో ఈ వ్యవహారానికి సంబంధించి ఎటువంటి కొత్త కేసులు నమోదు కాకుండా చూసేందుకు--- ఈ అధికారిక పనుల కోసం సబ్-ఇన్స్పెక్టర్ మొదట రూ. 10,00,000 (పది లక్షల రూపాయలు) లంచం డిమాండ్ చేశారు. ఆ తర్వాత చర్చల అనంతరం, లంచం మొత్తాన్ని రూ. 1,00,000 (ఒక లక్ష రూపాయలు)కు తగ్గించి, ఆ మొత్తాన్ని తీసుకునేందుకు అంగీకరించారు. ఈ విధంగా, సబ్-ఇన్స్పెక్టర్ తన అధికారిక విధులను నిర్వహించేటప్పుడు అక్రమంగా, నిజాయితీ లేకుండా వ్యవహరించి, తనకు అక్రమ ప్రయోజనం చేకూర్చుకోవాలని ప్రయత్నించారు.దీనితో, సదరు అధికారిని నాంపల్లిలోని ఎన్‌పీఈ ఏసీబీ కేసుల ప్రత్యేక న్యాయస్థానం ముందు హాజరుపరిచి, జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. ప్రస్తుతం ఈ కేసుపై విచారణ కొనసాగుతోంది. భద్రతా కారణాల దృష్ట్యా ఫిర్యాదుదారుడి వివరాలను గోప్యంగా ఉంచారు.సెల్ ఫోన్ నంబర్ - 1064 (టోల్ ఫ్రీ నంబర్):ఏదైనా ప్రభుత్వ ఉద్యోగి లంచం డిమాండ్ చేసినట్లయితే, ప్రజలు ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ '1064'కు కాల్ చేసి సమాచారం అందించాలని కోరడమైనది. దీని ద్వారా చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. తెలంగాణ ఏసీబీని సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లైన వాట్సాప్ (9440446106), ఫేస్‌బుక్ మరియు ఎక్స్ ట్విట్టర్ - ద్వారా సంప్రదించవచ్చు. అలాగే, ప్రభుత్వ కార్యాలయాల్లో మరియు ప్రముఖ బహిరంగ ప్రదేశాల్లో ఏసీబీకి సంబంధించిన క్యూఆర్ కోడ్ అందుబాటులో ఉంచబడింది. ఫిర్యాదుదారుని పేరు మరియు వివరాలు గోప్యంగా ఉంచబడతాయి.

# ఎన్నికల వ్యయ నిర్వహణ విభాగం తనిఖీ

**జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు బి.విజయ్ కుమార్**

- పారదర్శకంగా అధికారుల పనితీరు ఉండాలి



**విజయవాడ, అక్టోబర్ 28, 2026:** స్థానిక సంస్థలకు సంబంధించి జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు బి.విజయ్ కుమార్ బుధవారం విజయవాడ నగరపాలక సంస్థలోని పట్టణ స్థానిక సంస్థ ఎన్నికల వ్యయ నిర్వహణ విభాగాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోటీచేస్తున్న అభ్యర్థులు చేసిన ఖర్చుల వివరాలను నిర్వహిస్తున్న షాడో రిజిస్టర్లను పరిశీలించారు. అదేవిధంగా సభలు, ర్యాలీలు తదితర కార్యక్రమాలకు సంబంధించి వీడియో సర్వైలెన్స్ బృందం (వీఎస్‌టీ) సేకరించిన ఆధారాలను, సహాయ ఎన్నికల వ్యయ పరిశీలకుల పర్యవేక్షణలోని అకౌంటింగ్ బృందాల ఖర్చు లెక్కింపు కోసం ఉపయోగిస్తున్న తీరును ధ్రువీకరించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో విజయవాడ నగరపాలక సంస్థ సహాయ ఎన్నికల వ్యయ పరిశీలకులు చక్రవర్తి పాల్గొన్నారు. ఎన్నికల వ్యయ నిర్వహణపై సంబంధిత అధికారులు, సిబ్బందికి పరిశీలకులు తగిన సూచనలు జారీచేశారు. విభాగం పనితీరు సంతృప్తికరంగా ఉన్నట్లు ఆయన గుర్తించారు. స్థానిక సంస్థల ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా జరిగేలా ఎన్నికల వ్యయ పర్యవేక్షణ బృందాలు సమన్వయంతో, అప్రమత్తంగా విధులు నిర్వహించాలని వ్యయ పరిశీలకులు బి.విజయ్ కుమార్ ఈ సందర్భంగా సూచించారు.

# పునరావాస కేంద్రాల్లో సంతృప్తికర ఏర్పాట్లు

**నిరంతరం పర్యవేక్షించిన జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

- ఎవరికీ ఇబ్బంది లేకుండా సౌకర్యాల కల్పన



**విజయవాడ, అక్టోబర్ 28, 2026 :** ప్రజల ప్రాణ, ఆస్తి భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, అర్నబ్ తుపాను ప్రభావిత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో ప్రజలకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించినట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని వెల్లడించారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల్ కేంద్రంలో మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా 605 స్వర్ణ గ్రామాలు, స్వర్ణ వార్డుల పరిధిలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో మొత్తం 313 మంది ఆశ్రయం పొందుతున్నట్లు వెల్లడించారు. ఆయా కేంద్రాల్లో ప్రజలకు తాగునీరు, ఆహారం, పారిశుద్ధ్యం, విద్యుత్, వైద్య సేవలు తదితర మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. పునరావాస కేంద్రాల్లో పరిశుభ్రమైన వాతావరణాన్ని నిర్వహించాలని, ప్రజలకు అవసరమైన సౌకర్యాల కల్పనలో ఎలాంటి నిర్లక్ష్యం వహించకూడదని అధికారులకు సూచించారు. పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న వారికి ఉదయం అల్పాహారంతో పాటు మధ్యాహ్నం, రాత్రి భోజనం సక్రమంగా అందిస్తున్నారా లేదా అనే వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఆహారం, తాగునీరు పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, అవసరమైన వారికి సకాలంలో వైద్య సహాయం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, మహిళలు, అనారోగ్య సమస్యలున్న వారికి ప్రత్యేక శ్రద్ధతో సహాయ సహకారాలు అందించాలని సూచించారు. నగరంతో పాటు జిల్లాలోని ప్రభావిత ప్రాంతాల్లో అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. వివిధ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ స్పష్టం చేశారు.

# మరణంలోనూ మహాదానం.. 8 మందికి ప్రాణం పోసిన టీచర్ నీరజారెడ్డి




**రామగిరి, అక్టోబర్ 28 :** మరణం అనంతరం కూడా ఇతరుల జీవితాల్లో వెలుగులు నింపిన ఉపాధ్యాయురాలు నీరజ సేవాభావం అందరికి ఆదర్శంగా నిలుస్తోంది. తన జీవితంలో విద్యార్థులకు మార్గదర్శకంగా నిలిచిన ఆమె మరణాంతరం కూడా అవయవదానం ద్వారా ఎనిమిది మందికి ప్రాణదానం చేసింది. వివరాల్లోకి వెళితే చాద నీరజారెడ్డి నల్లగొండ జిల్లా కేంద్రంలోని వీటీ కాలనీలో నివాసం ఉంటున్నారు. ప్రస్తుతం యాదాద్రి భువనగిరి జిల్లాలోని చౌటుప్పల్ మండలంలోని దామోరా ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తుంది. గతంలో నల్లగొండ జిల్లాలోని కనగల్ మండలంలోని ఎంపీపీఎస్ రేగటే, నార్కట్‌పల్లి మండలంలోని అక్కెనపల్లిలో విధులు నిర్వహించారు. సోమవారం ఉదయం ఆకస్మాత్తుగా ఇంట్లో పడిపోవడంతో హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తీసుకు వెళ్లగా బ్రెయిన్ డెడ్‌గా వైద్యుల నిర్ధారణ చేశారు. విషయం తెలుసుకున్న అఖిల భారత శరీర అవయదాతల సంఘం జాతీయ కన్వీనర్, నల్లగొండ వాసి ఎల్వీ కుమార్ నీరజ భర్త గౌర్రె నర్సిరెడ్డి, కుటుంబ సభ్యులను సంప్రదించి అవయవాదనం గురించి వివరించి అంగీకరింపజేశారు.దీంతో వైద్యులు ఆమె శరీరం నుండి కీలకమైన పలు అవయవాలను సేకరించి ఇప్పటికే ఆయా అంశాలల్లో ఇబ్బంది పడుతున్న వారికి అందజేశారు. ఈ సందర్భంగా ఎల్వీ కుమార్ మాట్లాడుతూ కన్నబిడ్డను, తోడ బుట్టిన వారిని కొల్పోయిన బాధలోనూ సమాజం కోసం ఆలోచించి అవయదానం చేయడం అభినందనీయమన్నారు.విషయం తెలుసుకున్న అఖిల భారత శరీర అవయదాతల సంఘం జాతీయ కన్వీనర్, నల్లగొండ వాసి ఎల్వీ కుమార్ నీరజ భర్త గౌర్రె నర్సిరెడ్డి, కుటుంబ సభ్యులను సంప్రదించి అవయవాదనం గురించి వివరించి అంగీ కరింపజేశారు.దీంతో వైద్యులు ఆమె శరీరం నుండి కీలకమైన పలు అవయవాలను సేకరించి ఇప్పటికే ఆయా అంశాలల్లో ఇబ్బందిపడుతున్న వారికి అందజేశారు. అవయదానంపై ఉన్న మూఢ నమ్మకాలను పక్కన పెట్టి ప్రతి ఒక్కరు చైతన్యం కావాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఎల్వీ కుమార్ మాట్లాడుతూ కన్నబిడ్డను, తోడ బుట్టిన వారిని కొల్పోయిన బాధలోనూ సమాజం కోసం ఆలోచించి అవయదానం చేయడం అభినందనీయమన్నారు.విషయం తెలుసుకున్న అఖిల భారత శరీర అవయదాతల సంఘం జాతీయ కన్వీనర్, నల్లగొండ వాసి ఎల్వీ కుమార్ నీరజ భర్త గౌర్రె నర్సిరెడ్డి, కుటుంబ సభ్యులను సంప్రదించి అవయవాదనం గురించి వివరించి అంగీ కరింపజేశారు.దీంతో వైద్యులు ఆమె శరీరం నుండి కీలకమైన పలు అవయవాలను సేకరించి ఇప్పటికే ఆయా అంశాలల్లో ఇబ్బందిపడుతున్న వారికి అందజేశారు. అవయదానంపై ఉన్న మూఢ నమ్మకాలను పక్కన పెట్టి ప్రతి ఒక్కరు చైతన్యం కావాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఎల్వీ కుమార్ మాట్లాడుతూ కన్నబిడ్డను, ఈ కార్యక్రమంలో అఖిల భారత అవయదాతల సంఘం కో ఆర్డినేటర్ శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు అనిరుద్‌రెడ్డి, అంజయ్య, కేజీయ నాగేందర్, శ్యామ్ పాల్గొన్నారు.

# తుపాను అనంతర పరిస్థితులపై అధికార యంత్రాంగం అత్యంత అప్రమత్తంగా ఉండాలి: జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ ఆదేశం

- తుపాను ప్రభావం తగ్గుముఖం పట్టినప్పటికీ, అసలైన సవాలు ఇప్పుడే మొదలవుతోందని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అధికారులను హెచ్చరించారు.



**విజయవాడ: అక్టోబర్ 28,2026** నీటి నిల్వలు, పారిశుధ్య లోపం కారణంగా అంటువ్యాధులు, సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున జిల్లా యంత్రాంగం మొత్తం పూర్తి అప్రమత్తతో, యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. వివిధ కమిషనర్, డిపిఓ, డిఎంహెచ్ఓ, డిసిహెచ్ఎస్, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఓలు, సంబంధిత అధికారులతో నిర్వహించిన అత్యవసర టెలీకాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. రేపటిలోగా 100% పారిశుధ్య పనులు పూర్తి కావాలన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలనే తేడా లేకుండా ప్రతి గ్రామం, ప్రతి వార్డులో 24/7 ప్రాతిపదికన పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో వెంటనే బ్లీచింగ్ చల్లడం, మురుగునీటి కాలువలను క్లియర్ చేయడం వంటివి యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. మున్సిపాలిటీలు, గ్రామాల్లో ఏ ఒక్క ప్రాంతం కూడా మిగలకుండా దోమల నివారణకు పూర్తిస్థాయిలో ఫాగింగ్ నిర్వహించాలన్నారు. అన్ని తాగునీటి వనరులు, ఓవర్ హెడ్ ట్యాంకులను తక్షణమే శుభ్రం చేయించాలన్నారు. ప్రతి నీటి వనరు వద్ద నిర్బంధంగా క్లోరినేషన్ చేపట్టి, రాబోయే మూడు రోజుల పాటు నిరంతరం క్లోరిన్ పరీక్షలు నిర్వహించాలన్నారు. ఎక్కడా తాగునీరు కలుషితం కాకుండా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంల ద్వారా ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య సర్వే చేపట్టాలన్నారు. అతిసార (డయేరియా), డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల లక్షణాలు ఉన్నవారిని తక్షణమే గుర్తించాలన్నారు. ఎక్కడైనా చిన్నపాటి వ్యాప్తి లేదా కేసులు నమోదైనా వెంటనే అక్కడ ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రజలు కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని, తాజా వేడి ఆహారాన్ని తీసుకోవాలని, బయటి ఆహార పదార్థాలను తినవద్దని విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ఎల్లుండి నుంచి సామాజిక భద్రతా పెన్షన్ల పంపిణీ ప్రారంభం కానున్నందున, అధికారులు గ్రామాలకు వెళ్లే సమయానికి ఎక్కడా పారిశుధ్య లోపం, వ్యాధుల సమస్యలు లేదా వైద్య సేవలు అందలేదన్న ఫిర్యాదులు రాకూడదని పేర్కొన్నారు. రేపు సాయంత్రానికల్లా నిర్దేశించిన అన్ని రక్షణ చర్యలు, పారిశుధ్య పనులు 100% పూర్తయ్యేలా సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.

# అర్నబ్ తుపాను బీభత్సంకోస్తా తీరం అతలాకుతలం



**పశ్చిమగో దావరి** తీరం దాటిన అర్నబ్ తుపాను బీభత్సం సృష్టిస్తున్నది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కోస్తా తీరాన్ని అతలాకుతలం చేస్తున్నది. పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురం సమీపంలో తీరం దాటిన ఈ తుపాను ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాలు చిగురుటాకులా వణికిపోతున్నాయి. భారీ నుంచి అతిభారీ వర్షాలు, ప్రచండ గాలులతో జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. ముఖ్యంగా ఉత్తరాంధ్ర, ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాలపై తుపాను తీవ్ర ప్రభావం చూపుతున్నది.లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రహదారులన్నీ నదులను తలపిస్తున్నాయి. వేలాది ఎకరాల్లో పంటలు నీట మునిగి రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తుపాను కారణంగా ఉత్తరాంధ్ర జిల్లాలు జలదిగ్బంధనంలో చిక్కుకున్నాయి. బుధవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న కుండపోత వర్షాలతో వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. విజయనగరం జిల్లా గరివిడిలో రాష్ట్రంలోనే అత్యధికంగా 26 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.అనకాపల్లి, శృంగవరపుకోట, వేపాడ, చీపురుపల్లిలో 25 సెంటీమీటర్లు, భీమునిపట్నం, ఎలమంచిలి, మెంటాడలో 24 సెంటీమీటర్ల చొప్పున వర్షం కురిసింది. విశాఖపట్నం, విజయనగరం పట్టణంలో 21-22 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. విజయనగరం జిల్లాలో సువర్ణముఖి, గోస్తనీ, చంపావతి నదులు ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో సమీప గ్రామాలు నీట మునిగాయి. సాలూరు బస్టాండ్ పూర్తిగా నీటిలో చిక్కుకుంది. బలమైన ఈదురుగాలులకు భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి.నర్సాపురం వద్ద తుపాను తీరం దాటే సమయంలో పెనుగాలులు వీయడంతో అనేక ప్రాంతాల్లో చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. ఆచంట, పెనుగొండ మండలాల్లో పలు ఇళ్లపై చెట్లు కూలాయి. దాంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కోనసీమ, కాకినాడ, అల్లూరి జిల్లాల్లోనూ పలు రహదారులు జలమయమయ్యాయి. కోతకు సిద్ధంగా ఉన్న వరిపంట నీట మునగడంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. భూపతిపాలెం, వట్టిగెడ్డ వంటి జలాశయాలు నిండుకుండలా మారాయి.

# ప్రకటనల పాలసీ ఫ్లాప్



**అక్టోబరు 27 :** నగరంలో ఎకడ ప్రకట నలు ఉండాలి? వేటికి అనుమతులు ఇవ్వాలి? అనే అంశాలను ఈ కమిటీయే తేలుస్తుంది. ఈ అధికారిక ఉత్తర్వులు కాగితాలకే పరిమితం కావడం..క్షేత్రస్థాయిలో వందల సంఖ్యలో అక్రమ హోర్డింగ్‌లు, లాలీపాప్స్ బోర్డులు, భారీ కాంటిలివర్లు అనధికారికంగా ఉండడం.రోజుకో కొత్త ఏరియాలో అక్రమ ప్రకటనల బోర్డులు వెలుస్తుండడం ప్రభుత్వ పనితీరుకు అద్దం పడుతున్నది. ముఖ్యంగా ముఖ్యనేత అనుచరులు, ఓ యువ ఎమ్మెల్సీ ఈ ప్రకటనల బోర్డుల వెనుక అన్నీ తానై నడిపిస్తున్నట్లు ప్రచారం ఉంది.ఏళ్ల తరబడి ఒకే స్థానంలో ఉంటున్న ఓ అధికారిణి సైతం చక్రం తిప్పుతూ అందినంత దండుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. జీహెచ్ఎంసీ ప్రకటన విభాగంలో అధికారుల నిర్లక్ష్యం, అవినీతి అక్రమాలు ఏ స్థాయిలో జరుగుతున్నాయో అర్థమవుతుంది.

# చిన్నారులకు ఏది ఇష్టం... ఏది కష్టం...?

నెలల వయసు నుంచి స్కూల్ వయస్సు వరకు పిల్లలకు పోషకాహారం చాలా అవసరం. కొన్ని రకాల పదార్థాలంటేనే చిన్నారులకు మక్కువ. కొన్ని అంటే మొహం తిప్పుకుంటారు. ఇక్కడ ఏదన్నది కాదు ముఖ్యం వారికి అందాల్సిన పోషకాలు అందుతున్నాయా? లేదా? అన్నది తల్లిదండ్రులు చూసుకోవాల్సిన అంశం. ఈ నేపథ్యంలో ఏ వయసులో ఏ ఆహారం అందించొచ్చన్నది, పోషకాహార, వైద్య నిపుణుల సూచనలు ఎలా ఉన్నాయన్నది తెలుసుకుందాం.

**పసిపిల్లలు**

వీరికి ఈ వయసులో తల్లిపాలు లేదంటే ఫార్ములా మిల్క్ లేదంటే రెండూ కలిపి ఇవ్వొచ్చు. దాదాపుగా అన్ని పోషకాలు తల్లి పాల నుంచి అందుతాయి. కానీ, విటమిన్ డి తగినంత అందదు. అందుకే వీరిని ప్రతీ రోజూ సూర్యోదయం సమయంలో కొంత సమయం పాటు ఎండలో ఉంచితే విటమిన్ డి అందు తుంది. లేదంటే విటమిన్ డి చుక్కల మందు రూపంలో అందించాలి. అలానే ఐరన్ కూడా వీరికి తగినంత అందదు. అందుకే వైద్యులు ఐరన్, జింక్, విటమిన్స్ కూడిన డ్రాప్స్ ను సూచిస్తుంటారు. పిల్లలకు పాలిచ్చే తల్లులు పూర్తి పోషకాహారాన్ని తీసుకోవడంపై శ్రద్ధ పెట్టాలి. ఎందుకంటే వారి నుంచే పిల్లలకు పోషకాలు అందాలి కనుక. తగిన పోషకాహారం తీసుకోవడం వల్ల బ్రెస్ట్ మిల్క్ తగినంత ఉత్పత్తి ఉంటుందని ఎన్నో పరిశోధనలు చెబుతున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ మార్గదర్శకాల మేరకు శిశువులకు ఆరు నెలల వరకు తల్లిపాలు మినహా మరేమీ ఇవ్వకూడదు. పిల్లలకు రెండో ఏడాది ముగిసే వరకు బ్రెస్ట్ ఫీడింగ్ ను కొనసాగించాలి. ఆరు నెలల వయసులో శిశువులు ఘన ఆహారాన్ని తీసుకునేందుకు సిద్ధంగా ఉంటారు. కనుక వారికి రైస్, ఉడికించిన పండ్లు, కూరగాయలు ఇవ్వాలి. ఏడాది వయసుకు వచ్చిన తర్వాత సాధారణంగా ఇంట్లో తినే ఆహార పదార్థాలను ఒక్కొక్కటి యాడ్ చేయాలి. పిల్లలకు ఈ వయసు నుంచే రుచి తెలుస్తుంది. మంచి ఆహార అలవాట్లకు పునాది పడేది ఇప్పుడే. కొన్నింటి విషయంలో మొహం తిప్పుకుంటుంటే వాటిని పక్కన పెట్టేయకండి. అలా చేస్తే అది జీవితాంతం నిషేధ పదార్థంగా ఉండిపోవచ్చు. ఒకవేళ ఏదైనా ఆహార పదార్థం సరిపడదం లేదని భావిస్తే పిల్లల వైద్య నిపుణులకు తెలియజేస్తే వారు తగిన సూచనలు చేస్తారు.

**ఎంత మేర?**

పిల్లలు ఆకలి ఉన్నంత మేర తింటారు. కొంత తిన్న తర్వాత వద్దు అని ముఖం తిప్పుకుంటున్నారంటే వారి కడుపునిండినట్టుగానే అర్థం చేసుకోవాలి. పిల్లలు పెరిగేకొద్దీ వారిలో ఆకలి కూడా అలానే పెరగడం సహజంగానే జరుగుతుంది. ఒకవేళ పిల్లలు సరిగా ఆహారం తినడం లేదని మీరు గమనిస్తే ఆ విషయాన్ని పోషకాహార నిపుణుల దృష్టికి తీసుకెళ్లాలి. అలాగే, బరువు తగ్గుతూ ఉన్నా ఉపేక్షించ కుండా వైద్య నిపుణుల సలహా తీసుకోవడం తప్పనిసరి.

**అన్ని రుచులు**

కొత్త ఆహార పదార్థాలను రుచి చూసేలా చిన్నారులను ప్రోత్సహించాలి. పండ్లు, ఆకు కూరలు, గుడ్లు, కూరగాయలు, యోగర్ట్ లేదా పెరుగు ఇవి చాలా కీలకం. వీటిని పిల్లలు అవాయిడ్ చేయకుండా చూసుకుంటే చాలు. ఏడాది వయసు నుంచి పిల్లలు తోటి కుటుంబ సభ్యులు తినే వాటినే అనుసరిస్తుంటారు. కనుక కుటుంబ సభ్యుల ఆహార అలవాట్లు వారిపై ప్రభావం చూపిస్తాయి. శిశువుల ఆహారం విషయంలో జాతీయ శిశు సంక్షేమ శాఖ మార్గదర్శకాల కోసం ఈ లింక్ ను సందర్శించొచ్చు.

**ఏడాది తర్వాత...**

ఎదిగే వయసు కనుక పాలు సరిపడా ఉండేలా చూసుకోవాలి. తల్లిపాలే సరిపోవు కనుక విడిగా పాలు కూడా ఇవ్వాల్సి ఉంటుంది. ఎముకలు, దంతాలకు క్యాల్షియం చాలా అవసరం. శరీర నిర్మాణంలో కండరాలతోపాటు ఎముకలకూ అంతే ప్రాధాన్యం ఉంటుంది. ఒకవేళ పాలతో అలర్జీ ఉండి, పిల్లలు తీసుకోకపోతే సోయా మిల్క్, క్యాల్షియంతో కూడిన పండ్ల రసం, రైస్, ఓట్ మీల్ ఇవ్వాలి. ఈ వయసులో వైద్యులు క్యాల్షియం సప్లిమెంట్లను కూడా సూచించొచ్చు. అలాగే, పీచు పదార్థం చాలా అవసరం. ఇచ్చే ఆహారంలో ఇది తగినంత ఉండాలి.

**తక్కువ ఫ్యాట్**

పిల్లలకు ఫ్యాట్ అవసరమే కానీ పరిమితి దాట కూడదు. అందుకే తక్కువ ఫ్యాట్ ఉన్న ఆహారం ఇస్తే సరిపోతుంది. అలాగే, తక్కువ శాచురేటెడ్ ఫ్యాట్,ట్రాన్స్ ఫ్యాట్ ఉండేలా శ్రద్ధ వహించాలి.

**ఐదేళ్ల తర్వాత శారీరక వృద్ధి**

పిల్లలకు ఐదేళ్ల వయసు నాటికి వారిలో మెదడు పూర్తిగా అభివృద్ధి చెందుతుంది. ఐదో ఏట నుంచి వారిలో అసలైన శారీరక వృద్ధి మొదలవుతుంది. ఇందుకోసం వారిలో తగినంత రక్త సరఫరా జరిగేందుకు వీలుగా ఐరన్ సప్లిమెంట్లను ఇవ్వాలి. కానీ, తల్లిదండ్రులు నేడు సహజ ఆహారానికి బదులు ప్రాసెస్డ్ ఆహార పదార్థాలైన బిస్కట్లు, శాండ్ విచ్ లు, నూడుల్స్ (ఇవన్నీ ప్రాసెస్ చేసినవి, వేయించినవి), కాండీలు, చాక్లెట్లు ఇవ్వడం జరుగుతోంది. వీటి వల్ల



ట్రాన్స్ ఫ్యాట్ పిల్లలకు ఎక్కువ అందుతుంది. ఫలితంగా వారి శారీరక వృద్ధికి తీవ్ర హాని కలుగుతోందని ప్రముఖపోషకాహార నిపుణులు డాక్టర్ సువర్ణ పాఠక్ తెలిపారు. అలాగే, పిల్లలకు సరైన విటమిన్స్, ముఖ్యమైన పోషకాలు అందవు. ఇది కూడా వారిలో గ్యాస్ట్రో ఇంటెస్టినల్, పేగు సంబంధిత సమస్యలకు దారి తీస్తుంది. సాధారణంగా పిల్లల్లో విటమిన్ డి3 (ఎముకలకు),బి3(నరాలకు),బి12 (కండరాలకు),ఐరన్(రక్తానికి)చాలా అవసరం. పిల్లలు ఎదిగే క్రమంలో వారికి విటమిన్లు, మినరల్స్ తో కూడిన ఆహారం అందించే శ్రద్ధ తీసుకోవాలి. కనీస పోషకాలైన క్యాల్షియం, ప్రొటీన్స్, ఐరన్, విటమిన్స్ తో కూడిన సమతులాహారాన్ని అందించాలని డాక్టర్ సువర్ణ పాఠక్ సూచన.

**హెల్తీ బ్రేక్ ఫాస్ట్**

నేటి కాలం పిల్లలకు స్కూల్, క్రీడలు, ట్యూషన్స్, అదనపు ప్రావీణ్యాల్లో శిక్షణ వంటి వాటితో వారిలో ఉన్న శక్తి అంతా ఆవిరైపోతోంది. అందుకే ఈ అంశాలన్నింటినీ దృష్టిలో ఉంచుకుని పోషకాహార నిపుణులు డాక్టర్ గీతా ధర్మట్టి పలు రకాల ఆహార మెనూలను తెలియజేస్తున్నారు. 1.బ్రెడ్ స్లయిస్, దోశ, అటుకులు, అన్ని రకాల అల్పాహారాలు. 2.పాలు,పాల పదార్థాలు, గుడ్లు, సోయా మిల్క్. గుడ్లు ఏ రూపంలో అయినా తీసుకోవచ్చు. పాలు రోజూ 150 ఎంఎల్.పెరుగు రోజూ 100 గ్రాములు. పనీర్, చీజ్3. పండ్లు, కూరగాయలు. రుతువుల వారీగా అందుబాటులో ఉండే పండ్లు, యాపిల్, బెర్రీస్, క్యారట్, పచ్చి బఠానీలు తీసుకోవాలి.

**అల్పాహారం ఆప్షన్స్**

మిల్క్ షేక్, పండ్లు లేదా పాలతో కార్న్ ఫ్లేక్స్ లేదా ఓట్స్ కలిపి తీసుకోవచ్చు. అటుకులను కూరగాయలతో కలిపి తీసుకోవచ్చు. ఆమ్లెట్, చపాతీ కలిపి తీసుకోవచ్చు. ఉడికించిన గుడ్డు తినిపించొచ్చు. ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచన ప్రకారం పిల్లలు రోజులో నాలుగు సార్లు ఫుల్ మీల్స్ తీసుకోవాల్సి ఉంటుంది. ఈ ఆహారం కూడా తాజా పండ్ల రసాలు, ప్రొబయోటిక్ పెరుగు, కూరగాయలు (రసాలు, ఉడకబెట్టిన రూపంలో) కలిపి తీసుకోవాల్సి ఉంటుంది. అలాగే,చపాతీలు,పరాటాలు కూడా భాగం చేసుకోవాలి. మొలకెత్తిన ధాన్యం, బీన్స్ ను కూడా తీసుకోవడం వల్ల పోషకాహార బలం లభిస్తుంది. వ్యాధి నిరోధక శక్తి మెరుగుపడుతుంది.

**ధాన్యాలు(గ్రెయిన్స్)**

ఆహారంలో ధాన్యాలు తప్పనిసరి.వీటిలో పోషకాలు, శక్తి అన్నవి పిల్లల ఎదుగుదలకు ఉపయోగపడతాయి.తృణ ధాన్యాలతోపాటు, బ్రెడ్స్, ఓట్స్, బియ్యం తీసుకోవాలి. శుద్ధి చేసిన ఆహార పదార్థాలు, అధికంగా షుగర్ ఉన్నవి, శాచురేటెడ్ ఫ్యాట్ అధికంగా ఉన్నవి, ఉప్పు, లేదా సోడియం, కేక్స్, బిస్కట్లకు దూరంగా ఉండాలి.

**పండ్లు, కూరగాయలు**

వీటితో నీరు, విటమిన్స్, మినరల్స్, పీచు (ఫైబర్) తగినంత లభిస్తాయి. చిన్నారులు ఐదు భాగాల పండ్లు, కూరగాయలను ఒక రోజులో తీసుకోవాలి.

**ఫ్యాట్స్, నూనెలు**

చిన్న పిల్లలు, టీనేజీ వయసులో ఉన్నవారికి కొవ్వులు, నూనె పదార్థాలు ఎంతో అవసరం. చిన్నారుల మానసిక వృద్ధికి ఇవి తోడ్పడతాయి. కొవ్వు అన్నది మన శరీరంలో ఇంధనంలా పనిచేస్తుంది. ఫ్యాట్ లో కరిగే విటమిన్ ఎ, డీ, ఈ, కే లను శరీరం గ్రహించేలా చేయగలదు. కొవ్వుతో కూడిన పదార్థాలు అధికంగా తీసుకుంటే బరువు పెరగడం, స్థూలకాయం, గుండె జబ్బులు తదితర ప్రమాదాలుంటాయి. అందుకే వీటిని తగినంత మోతాదులో తీసుకుంటే ఆరోగ్య ప్రయోజనాలు పొందొచ్చు. నట్స్, అవొకాడో, కార్న్ ఆయిల్, సోయాబీన్ ఆయిల్, ఆలివ్ ఆయిల్, కనోలా ఆయిల్ ను ఇందుకు ఎంచుకోవచ్చు.

**పాలు, పాల పదార్థాలు**

పాలు, పాల పదార్థాలు ఎన్నో పోషకాలకు నెలవు. వీటిలో విటమిన్ ఎ, డి, బి1, బి2, బి12 విటమిన్లు, మినరల్స్,ముఖ్యంగా క్యాల్షియం సమృద్ధిగా లభిస్తాయి. చిన్నారులు, యుక్త వయసులోకి వచ్చిన వారికి పాలు చాలా అవసరం. ఎముకల వృద్ధికి అవసరమైన క్యాల్షియం అందుతుంది.

**మాంసం, బీన్స్**

మాంసం,పౌల్ట్రీ,చేపలు,బీన్స్, బఠానీలు, గుడ్లు, విత్తనాలు ఎన్నో పోషకాలకు నెలవు. ఆరోగ్యకరమైన ఆహారంలో వీటికి చోటుండాలి. మన శరీరంలో వివిధ రకాల పనులకు అవసరం. మాంసం కూడా విటమిన్ 12, ఐరన్ నిల్వలకు కేంద్రం. ఐరన్ అధికంగా ఉండడంతో అనీమియా నిరోధించడానికి సహాయపడుతుంది. ఎక్కువ మంది పిల్లల్లో కనిపించేది ఇదే. రక్త హీనత కారణంగా నీరసంగా, పాలిపోయినట్టు కనిపిస్తారు. శాకాహారులైతే మాంసానికి ప్రత్యామ్నాయంగా సోయా,బీన్స్,గుడ్లు, పాలు, జున్ను, పెరుగు,పుట్టగొడుగులు,నట్స్,సీడ్స్ను వాడుకోవచ్చు.

**ఎంత మేర పాలు అవసరం?**

2-3 ఏళ్ల మధ్య చిన్నారులకు రెండు కప్పుల పాలు (480 ఎంఎల్) ఇవ్వాలి. 4-8 ఏళ్ల పిల్లలకు రెండున్నర కప్పులు (600 ఎంఎల్) ఇవ్వాలి. 9 ఏళ్ల దాటిన వారికి మూడు కప్పులు (720 ఎంఎల్) ఇవ్వాలని డాక్టర్ దేవయాని బెనర్జీ సూచించారు. కొవ్వు తీసిన పాలు, 1 శాతం ఫ్యాట్ ఉన్న పాలను ఉపయోగించడం మంచిదని ఆమె సూచించారు.

**అనారోగ్యంతో ఉన్నప్పుడు...**

అనారోగ్యంతో ఉన్నప్పుడు కడుపు మాడ్చుకూడదు. శక్తితో కూడిన ధాన్యాలు, పాలు, ఉడికించిన కూరగాయలు కొంచెం చొప్పున ఎక్కువ సార్లు అందించాలి.పుష్కలంగా నీరు,ద్రవ పదార్థాలు ఇవ్వాలి.డీహైడ్రేషన్ రాకుండా అవసరమైతే ఓరల్ రీహైడ్రేషన్ ద్రావకాన్ని తాగించాలి.

**పోషకాహారంతో కూడిన భోజన నమూనా**

ఉదయం నిద్ర నుంచి లేచిన తర్వాత ఒక గ్లాస్ గోరు వెచ్చని, ఫ్యాట్ తక్కువగా ఉన్న పాలు
అల్పాహారం కింద కోడిగుడ్డు ఆమ్లెట్, ఉల్లిగడ్డలు, టమాటా, పాల కూర, ముడి ధాన్యాలు, యాపిల్.ఉదయం 11 గంటల సమయంలో ఫ్రూట్ సలాడ్, తక్కువ ఫ్యాట్ ఉన్న యోగర్ట్ మధ్యాహ్నం భోజనం కింద రైస్, పండ్ల రసం. మాంసాహారులైతే లీన్ చికెన్. సాయంత్రం పాలకూర, పుట్టగొడుగుల కట్ లెట్. బాదం గింజలతో తాజా పండ్ల రసం (యాపిల్ లేదా జామ లేదా నిమ్మ) రాత్రి భోజనం కింద మల్టీ గ్రెయిన్ (ఒకటికి మించిన ధాన్యాలతో పట్టించిన పిండి) పుల్కాలు, పప్పు, పనీర్, పుట్టగొడుగులతో కూడిన కూర తీసుకోవాలి. నిద్రకు ముందు గ్లాస్ గోరువెచ్చని పాలు తాగాలి.

**గోధుమలు వద్దు**

చిన్నారులకు గోధుమలతో కూడిన ఆహారం ఇవ్వడం సరికాదని డాక్టర్ కాశిష్ ఎ చాబ్రియా అభిప్రాయం. దీనిలో గ్లూటెన్ ఉండడం వల్ల పేగులను జిగటలా మార్చి ఆహారాన్ని సరిగా ముందుకు పోనివ్వదని వివరించారు.చాలా మంది పిల్లలకు గ్లూటెన్ పడదు కనుక, దాన్ని డైట్ నుంచి మినహాయించడం మంచిదంటున్నారు.

**శారీరక కదలికలు**

పిల్లలకు రోజువారీ శారీరక శ్రమ అవసరం. బలమైన ఎముకలు, తగినంత కండరాల బలం కోసం శారీరక కదలికలు ఉండేలా చూడాలి. నడక, పరుగు, ఇతర క్రీడలు ఉపయోగపడతాయి. ఈ విషయంలో తల్లిదండ్రులే పిల్లలకు మార్గదర్శకం. కనుక వారు చేయడం ద్వారా పిల్లలను ప్రోత్సహించొచ్చు.

**వేటిలో ఏ పోషకాలు**

పిల్లలకు సమతుల పోషకాహారం ఎంతో ప్రాధాన్యమని ఇక్కడ చెప్పుకున్నాం. అవేంటన్న సందేహం రావచ్చు. కనుక పోషకాలు ఏవి, ఎందులోఅవి లభ్యమవుతాయన్నది తెలుసుకోవచ్చు.

**ప్రొటీన్స్**

శరరీంలో కణాల నిర్మాణానికి ప్రొటీన్లు అవసరం. ఆహారాన్ని శక్తిగా మార్చేందుకు, ఇన్ఫెక్షన్ పై పోరాడేందుకు, ఆక్సిజన్ ను సరఫరా చేసేందుకు ప్రొటీన్లు అవసరం. మాంసం, పౌల్ట్రీ, చేపలు, గుడ్లు, నట్స్ (బాదం, ఆక్రూట్ తదితర), బీన్స్, పాల ఉత్పత్తుల్లో ప్రొటీన్ పుష్కలంగా ఉంటుంది.

**కార్బోహైడ్రేట్స్**

శరీరానికి శక్తినందించే కీలక వనరులు ఇవి. కొవ్వు, ప్రొటీన్లను శరీర కణజాల నిర్మాణానికి ఉపయోగించేందుకు ఇవి అవసరం. చక్కెరలు, గంజి, పీచు పదార్థాలు ఇలా భిన్న ఆహార పదార్థాల్లో కార్బొహైడ్రేట్స్ తగినంత ఉంటాయి. చిన్నారులకు మాత్రం చక్కెరలు కాకుండా, ఇతర రూపాల్లో ఇవి అందేలా శ్రద్ధ తీసుకోవాలి. బ్రెడ్స్, ధాన్యాలు, బియ్యం, ఆలుగడ్డల్లో కార్బొహైడ్రేట్లు పుష్కలం.

**ఫ్యాట్స్**

కొవ్వు పదార్థాలు పిల్లలకు అధికంగా ఇవ్వకూడదు. కానీ, తగినంత మోతాదు అవసరమే. కొన్ని రకాల పోషకాలను శరీరం తగిన విధంగా వినియోగించుకునేందుకు ఇవి అవసరమవుతాయి. కొవ్వులు అధికంగా ఉండే వాటిలో హెూల్ మిల్క్ పదార్థాలు, వంట నూనెలు, మాంసం, చేపలు, నట్స్.

**క్యాల్షియం**

ఎముకలు, దంతాలకు అవసరమైన మూలకం క్యాల్షియం. నరాలకు, రక్తం గడ్డ కట్టేందుకూ, కండరాలకు, గుండె పనితీరుకూ క్యాల్షియం అవసరమవుతుంది. పాలు, పెరుగు, ఐస్ క్రీమ్, గుడ్డు పచ్చసొన, క్యాబేజీ, పాలకూర తదితర పదార్థాల్లో క్యాల్షియం తగినంత లభిస్తుంది.

# 12 జ్యోతిర్లింగాలు ఎక్కడున్నాయో తెలుసా..? వాటి ప్రత్యేకత ఏంటి..?



శివరాత్రి సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో శివుని పూజలో పాల్గొంటారు. ఉపవాసం చేసి, రాత్రి జాగరణ చేస్తారు. ఈ సందర్భంలో 12 జ్యోతిర్లింగాల గురించి తెలుసుకోవడం ఎంతో ముఖ్యమైనది. భారతదేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న ఈ జ్యోతిర్లింగాలకు ప్రతి ఒక్కదానికి విశేషమైన ప్రత్యేకత ఉంది. జ్యోతిర్లింగాలు శివుని కాంతి రూపం అని చెబుతారు. ఈ 12 జ్యోతిర్లింగాలపై శివుని ప్రత్యేక ఆశీస్సులు ఉంటాయని అక్కడ పూజలు చేసిన వారికి శివుని కృప లభిస్తుందని భక్తులు నమ్ముతారు.

**సోమనాథ జ్యోతిర్లింగం..** గుజరాత్ లోని సౌరాష్ట్రంలో సోమనాథ జ్యోతిర్లింగం మొదటి జ్యోతిర్లింగంగా గుర్తించబడింది. ఇది శివుని ప్రధాన పూజా స్థలాలలో ఒకటి.

**మల్లికార్జున జ్యోతిర్లింగం..** శ్రీశైలం పర్వతంపై కృష్ణానది ఒడ్డున మల్లికార్జున జ్యోతిర్లింగం ఉంది.ఇది ఆంధ్రప్రదేశ్ లో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం.

**మహాకాలేశ్వర జ్యోతిర్లింగం..** ఉజ్జయినిలో ఉన్న మహాకాలేశ్వర జ్యోతిర్లింగం దక్షిణాభిముఖంగా ఉన్న ఏకైక జ్యోతిర్లింగంగా ప్రసిద్ధి పొందింది. ఇది మధ్యప్రదేశ్ లో ఉంది.

**ఓంకారేశ్వర జ్యోతిర్లింగం..** ఓంకారేశ్వర జ్యోతిర్లింగం నర్మదా నది ఒడ్డున ఇండోర్ సమీపంలోని మాల్వా ప్రాంతంలో ఉంది.

**భీమాశంకర జ్యోతిర్లింగం..** మహారాష్ట్రలోని పూణే సమీపంలోని సహ్యాద్రి పర్వత శ్రేణులపై ఉన్న భీమాశంకర జ్యోతిర్లింగం కూడా ప్రధానంగా గుర్తించబడింది.

**కేదారనాథ జ్యోతిర్లింగం..** హిమాలయాల్లో కేదార్ పర్వతంపై ఉన్న కేదారనాథ జ్యోతిర్లింగం ఉత్తరాఖండ్ లో ప్రసిద్ధి చెందింది. ఇది అత్యంత పవిత్రమైన పుణ్యక్షేత్రాలలో ఒకటిగా భావిస్తారు.

**కాశీ విశ్వనాథ జ్యోతిర్లింగం..** ఉత్తరప్రదేశ్ లోని వారణాసిలో ఉన్న కాశీ విశ్వనాథ జ్యోతిర్లింగం పవిత్ర కాశీలో ప్రసిద్ధి చెందినది. ఇది శివుని అతి ముఖ్యమైన పూజా స్థలాలలో ఒకటి.

**త్రయంబకేశ్వర జ్యోతిర్లింగం..** మహారాష్ట్రలోని నాసిక్ జిల్లాలో గోదావరి నది ఒడ్డున ఉన్న త్రయంబకేశ్వర జ్యోతిర్లింగం ఎంతో విశిష్టమైనది.

**వైద్యనాథ జ్యోతిర్లింగం..** జార?ండ్ లోని దేవఘర్లో ఉన్న వైద్యనాథ జ్యోతిర్లింగం మత విశ్వాసాల ప్రకారం చితాభూమి అని పిలువబడింది. ఇది ప్రధాన జ్యోతిర్లింగాలలో ఒకటి.

**నాగేశ్వర జ్యోతిర్లింగం..** గుజరాత్ లో ద్వారకా పురి సమీపంలో ఉన్న నాగేశ్వర జ్యోతిర్లింగం శివుని ఇష్ట ప్రకారం ప్రసిద్ధి చెందింది.

**రామేశ్వర జ్యోతిర్లింగం..** తమిళనాడులోని రామనాథంలో ఉన్న రామేశ్వర జ్యోతిర్లింగం 11వ జ్యోతిర్లింగంగా గౌరవించబడింది.

**ఘృష్ణేశ్వర జ్యోతిర్లింగం..** మహారాష్ట్రలోని సంభాజీనగర్ లో దౌలతాబాద్ సమీపంలో ఉన్న ఘృష్ణేశ్వర జ్యోతిర్లింగం శివుని 12వ జ్యోతిర్లింగం.

# ఔషధ గుణాల రోజా....ఆరోగ్యానికి రాజా

చూడగానే ఎంతో అందంగా కన్పించే రోజా పూలకు ఎన్నో ఔషధ గుణాలున్నాయి. అవి అందానికే కాదు ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు. రోజా రేకులను తినడం వల్ల పలు రకాల ఆరోగ్య ప్రయోజనాలున్నాయి. అవేంటో ఒకసారి చూద్దాం...

**వీర్యవృద్ధి :** రోజా రేకులు మీ శృంగార జీవితానికి చాలా దోహదం చేస్తాయి. శాస్త్రీయ పరిశోధనల ప్రకారం, రోజా రేకులను రోజూ గుప్పెడు తింటూ వస్తే అవి మన శరీరంలోని దోషాలను పోగొడుతాయి. తద్వారా రక్తశుద్ధి జరుగుతుంది. అంతేకాక సహజంగానే వీటికి వీర్యవృద్ధిని కలిగించే గుణముంది.

**మొటిమలు, నల్లమచ్చలు మటుమాయం :** యుక్త వయసులో హార్మోన్ల ప్రభావంతో యువతీ యువకులకు మొహంపై వచ్చే మొటిమలు, తద్వారా ఏర్పడే నల్లమచ్చలను పోగొట్టడంలో రోజా రేకులు సమర్థవంతంగా పనిచేస్తాయి. రేకులను నీటిలో బాగా మరిగించాలి. తర్వాత వాటిని బయటకు తీసి ముద్దగా నూరాలి. దీనికి



ముల్తానీ మట్టి కలిపి మిశ్రమంగా చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని వారంలో ఒక్కసారి మీ మొహంపై రాసుకుంటే సత్ఫలితం ఉంటుంది. క్రమేపీ నల్లమచ్చలు తగ్గిపోవడం మీరు గుర్తించవచ్చు. అంతేనా...రోజా రేకులు మీ మొహ చర్మాన్ని ఆరోగ్యవంతంగా కూడా ఉంచడంలో ఇవెంతగానో దోహదపడతాయి.

**రోజా రేకుల కషాయం :** రోజా రేకులతో తయారు చేసే కషాయం కూడా ఆరోగ్యానికి మంచిదే. మార్కెట్లలో లభించే ఔషధాల కంటే కూడా ఇది బాగా పనిచేస్తుంది. మీ చర్మానికి మెరుపును అందిస్తుంది. చర్మంపై ప్రధానంగా మొహంపై మొటిమల వల్ల ఏర్పడిన కూపములను ఇది తగ్గిస్తుంది. దీనిని మీరు మీ ఇంట్లోనే స్వయంగా తయారు చేసుకోవచ్చు. మీకు కావాల్సిందల్లా రోజా రేకులు, నీరు మాత్రమే.

**మనసుకు ప్రశాంతత :** రోజా పూల నుండి వచ్చే సువాసనను ఆస్వాదించడం వల్ల మీకు శారీరకంగానే కాక మీ మనసుకు కూడా ప్రశాంతత చేకూరుతుంది. ఒత్తిడి నుండి ఉపశమనం పొందడానికి దోహదపడుతుంది. వేడి నీటిలో రోజా రేకులతో పాటు కొంత బాత్ సాల్ట్ని కలిపాలి. ఈ మిశ్రమాన్ని ఒక పద్ధతి ప్రకారం, మీరు గనుక పీల్చితే తప్పకుండా ఉపశమనం లభించి, చురుగ్గా మారుతారు.

**నాజూకుతనానికి :** రోజా రేకుల్లో ఉండే పదార్థాలు నాజూకుతనానికి బాగా ఉపయోగపడుతాయి. కొద్దిగా మెంతులు, రోజా రేకులు కలిపి చేసుకున్న పేస్టును తినడం లేదా రోజా రేకులతో కాచిన కషాయాన్ని తాగినా మీరు సన్నబడతారు. అంతేకాక రోజా రేకులు జీవక్రియను మెరుగుపరుస్తాయి. తద్వారా మీరు సన్నబడే అవకాశముంటుంది.

# ఓటీపీలు చెప్పకపోయినా.. మీ బ్యాంకు ఖాతా హ్యాక్.. అర్జెంటుగా ఈ టిప్స్ తెలుసుకోకపోతే డేంజర్..

సైబర్ నేరగాళ్లు మీ బ్యాంకు అకౌంట్లో డబ్బు కొట్టేయడానికి సరికొత్త మార్గాలు వెతుక్కుంటు న్నారు. ఇప్పుడు వాళ్లకు మీ మనీ కాజేయడానికి మీ మొబైల్కు వచ్చే ఓటీపీలు, ఏటీఎం పిన్లు కూడా అవసరం లేదు. ఇటీవల కాలంలో ఈ కేటుగాళ్లు మీకు బ్యాంకుల నుంచి వచ్చినట్లుగా నకిలీ మెసేజ్లు పంపిస్తున్నారు. మీరు పొరపాటున ఆ లింకులపై క్లిక్ చేశారో అంతే సంగతులు, మీ ఖాతాలోని డబ్బు క్షణాల్లో మాయం అవుతుంది.ఆమెకు మీరు ఒక బహుమతి గెలుచుకున్నారని మెసేజ్ వచ్చింది. కానీ ఆ మెసేజ్లో ఉన్న ఒక చిన్న తప్పును ఆమె గమనించింది. అనుమానం రావడంతో ఆ మోసం నుంచి ఆమె తప్పించుకోగలిగింది. కానీ అందరికీ ఆమెలాంటి పరిశీలన ఓపిక తెలివి ఉండకపోవచ్చు. సురక్షితంగా ఉండాలంటే ఏం చేయాలి.. ఎవరైనా తెలియని వ్యక్తులు ఫోన్ చేసినా, మెసేజ్లు పంపినా చాలా జాగ్రత్తగా ఉండాలి. మీ వ్యక్తిగత వివరాలు, బ్యాంకు అకౌంట్ డీటెయిల్స్ లాంటివి ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరితోనూ షేర్ చేసుకోవద్దు. అది ఎంత నమ్మకంగా అనిపించినా తొందరపడొద్దు. డిస్కౌంట్లు, వోచర్లు, క్యాష్ రివార్డులు అంటూ ఆఫర్లు ఇచ్చే లింకులపై అస్సలు క్లిక్ చేయవద్దు.అవి మిమ్మల్ని ట్రాప్ చేయడానికే అని గుర్తుంచుకోవాలి. యాప్స్ డౌన్లోడ్ చేసుకునేటప్పుడు నమ్మకమైన ప్లే స్టోర్ లేదా




యాప్ స్టోర్ వంటి వాటి నుంచే చేసుకోవాలి. ఎక్కడ పడితే అక్కడ దొరికే యాప్స్ అస్సలు వద్దు. ఎందుకంటే ఆ యాప్లు మీ ఫోన్ కెమెరా, ఫొటో గ్యాలరీ వంటి వాటికి యాక్సెస్ తీసుకుంటాయి.వాటితో స్కామర్లు కేవైసీ మోసాలు చేస్తారు. ఒకవేళ మీకు ఏదైనా అనుమానాస్పదమైన ఫోన్ కాల్ వస్తే, వెంటనే స్పందించవద్దు. ముందు ఆ విషయాన్ని అధి కారిక మార్గాల ద్వారా క్రాస్ చెక్ చేసుకోవాలి. అవసరమైతే వస్తే అధికారులకు ఫోన్ చేయాలి. అప్పుడే మోసాల బారిన పడకుండా సురక్షితం గా ఉండగలరు. కాల్ మెర్జింగ్ స్కామ్ ఈ ట్రిక్లో స్కామర్ మీకు ఫోన్ చేస్తాడు. తెలిసిన వ్యక్తిలా మాట్లాడుతూ ఏదో ఒక ఈవెంట్ కవర్ చేయమని అడుగుతాడు. మీరు మాట్లాడుతుండగానే మరో నంబర్ నుంచి మీకు కాల్ వస్తుంది. అప్పుడు స్కామర్ రెండో కాల్ ఏదో వీఐపీ నుంచి అని నమ్మించి, రెండు కాల్స్ను మెర్జ్ చేయమని అడుగుతాడు. మీరు మెర్జ్ చేయగానే, హ్యాకర్ మీ మాటలు వింటూ ఉంటాడు. మీరు బ్యాంకు నుంచి గానీ, వాట్సాప్, ఫేస్బుక్ వంటి యాప్ల నుంచి గానీ వచ్చే ఓటీపీలను చెప్పేస్తే అవి వాళ్లకు తెలిసిపోతాయి. అంతే, మీ అకౌంట్లు హ్యాక్ చేసి డబ్బు కొట్టేస్తారు. మీ ఫ్రెండ్కి ఫ్రెండ్ని అని కూడా చెప్తారు జాగ్రత్త. మాల్వేర్ స్కామ్ హ్యాకర్లు ఆండ్రాయిడ్ అప్లికేషన్ ప్యాకేజీ ఫైల్స్లో, రిమోట్ యాక్సెస్ ట్రోజన్లు )లో మాల్వేర్ను దాచిపెడతారు. ఈ మాల్వేర్తో స్కామర్లు మీ ఫోన్ను మీకు తెలియకుండానే కంట్రోల్ చేయగలరు. ఉదాహరణకు, గతేడాది మే 21న హసన్ సబ్-డివిజన్కు చెందిన ఒక డీఎస్పీ ఏకంగా రూ.15.98 లక్షలు పోగొట్టుకున్నారు. ఆయన ఒక నేషనలైజ్డ్ బ్యాంకు నుంచి వచ్చినట్లుగా ఉన్న మెసేజ్లోని లింక్ ద్వారా ఒక యాప్ ఇన్స్టాల్ చేసుకు న్నారు. ఆ లింక్లో మాల్వేర్ ఉండటంతో, హ్యాకర్లు ఆయన ఫోన్లోకి ఈజీగా ఎంటర్ అయిపోయారు.

# మూడు ఆసియా పారా గేమ్స్ స్వర్ణాలు సాధించిన నీరజ్ యాదవ్ మృతి

## డోపింగ్ సస్పెన్షన్‌తో ఇటీవల పోటీలకు దూరం.. మృతిపై దర్యాప్తు



**న్యూఢిల్లీ, అక్టోబర్ 28:** భారత పారా క్రీడా రంగంలో విషాదం చోటుచేసుకుంది. మూడుసార్లు ఆసియా పారా గేమ్స్‌లో స్వర్ణ పతకాలు సాధించిన ప్రముఖ పారా అథ్లెట్ నీరజ్ యాదవ్ మృతి చెందారు. ఆయన తన నివాసంలో విషం తీసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రాథమిక సమాచారం. ఈ విషయాన్ని భారత పారా అథ్లెటిక్స్ జట్టు ప్రధాన కోచ్ ఎన్. సత్యనారాయణ ధ్రువీకరించారు. ఆయన మృతదేహానికి ఢిల్లీలోని ఆసుపత్రిలో శవపరీక్ష నిర్వహించేందుకు తరలించినట్లు సమాచారం.**క్రీడా జీవితంలో ఎన్నో విజయాలు**ఉత్తరప్రదేశ్‌కు చెందిన నీరజ్ యాదవ్ చిన్నతనంలోనే పోలియో బారినపడినప్పటికీ, క్రీడలపై ఆసక్తితో ముందుకు సాగారు. తొలుత వీల్‌చైర్ టెన్నిస్‌లో పాల్గొన్న ఆయన, 2015లో పారా అథ్లెటిక్స్ వైపు అడుగులు వేశారు. జావెలిన్ త్రో, డిస్కస్ త్రో, షాట్‌పుట్ విభాగాల్లో ప్రతిభ చాటారు. 2015లో ఢిల్లీలో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో మూడు విభాగాల్లో స్వర్ణ పతకాలు సాధించి గుర్తింపు పొందారు. 2018లో ఇండోనేషియాలో జరిగిన ఆసియా పారా గేమ్స్‌లో పురుషుల ఎఫ్55 జావెలిన్ త్రో విభాగంలో స్వర్ణ పతకం సాధించడంతో పాటు ఆసియా రికార్డు నెలకొల్పారు. అనంతరం 2023లో చైనాలోని హాంగ్‌జౌలో జరిగిన ఆసియా పారా గేమ్స్‌లో జావెలిన్ త్రో, డిస్కస్ త్రో విభాగాల్లో మరో రెండు స్వర్ణ పతకాలను గెలుచుకున్నారు. దీంతో ఆసియా పారా గేమ్స్‌లో ఆయన సాధించిన స్వర్ణ పతకాల సంఖ్య మూడుకు చేరింది.**డోపింగ్ కేసుతో నిలిచిన క్రీడా ప్రయాణం**2023లో జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ నిర్వహించిన పరీక్షలో ఆయన నమూనాలో నిషేధిత పదార్థం ఉన్నట్లు తేలడంతో డోపింగ్ వ్యవహారం తెరపైకి వచ్చింది. ఈ పరీక్ష ఫలితాలను నీరజ్ యాదవ్ సవాలు చేసినట్లు వార్తా కథనాలు పేర్కొన్నాయి. ఈ వ్యవహారంలో ఆయనపై తాత్కాలిక సస్పెన్షన్ విధించారు. దీంతో ఈ ఏడాది అక్టోబర్‌లో జరిగిన ఐచినగోయా ఆసియా పారా గేమ్స్‌లో ఆయన పాల్గొనలేకపోయారు. పోటీలకు దూరం కావడం వల్ల ఆయన తీవ్ర మానసిక ఒత్తిడికి గురై ఉండవచ్చని కోచ్ అభిప్రాయపడినట్లు వార్తా కథనాలు వెల్లడించాయి. అయితే, నీరజ్ యాదవ్ మృతికి ఇదే కారణమని నిర్ధారించే అధికారిక సమాచారం ఇంకా వెలువడలేదు.**కారణాలపై కొనసాగుతున్న ఉత్కంఠ**నీరజ్ యాదవ్ మృతికి సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఘటనకు దారితీసిన పరిస్థితులు, ఇతర అంశాలపై అధికారులు దర్యాప్తు చేయనున్నారు. చిన్నతనంలో ఎదురైన శారీరక సవాళ్లను అధిగమించి అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన అథ్లెట్ మృతి భారత పారా క్రీడా రంగంలో విషాదాన్ని నింపింది.

# టీమిండియా చాలా ప్రమాదకరమైన జట్టు!



## అందుకే మా జట్టును ప్రశంసించా.. వెస్టిండీస్ కోచ్ డారెన్ శామీ

**హైదరాబాద్, అక్టోబర్ 28:** న్యూజిలాండ్‌తో జరుగుతున్న టీ20 సిరీస్‌లో టీమిండియా దూకుడైన ఆటతీరుపై వెస్టిండీస్ జట్టు ప్రధాన కోచ్ డారెన్ శామీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. భారత్ అత్యంత ప్రమాదకరమైన జట్టని, అలాంటి జట్టుతో భారత్‌లోనే తలపడి తమ జట్టు సాధించిన ఫలితం గొప్పదని పేర్కొన్నాడు. న్యూజిలాండ్‌తో జరిగిన మూడో టీ20లో భారత బ్యాటర్లు చెలరేగిన తీరు తన అభిప్రాయాన్ని మరోసారి గుర్తు చేసిందని సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా స్పందించాడు.**బౌలర్లకు సవాలుగా పరిస్థితులు**చిన్న బౌండరీలు, బ్యాటింగ్‌కు అనుకూలమైన పిచ్‌లు, తడి బంతితో బౌలింగ్ చేయాల్సిన పరిస్థితులు బ్యాటర్లకు కలిసొస్తాయని శామీ పేర్కొన్నాడు. ఇలాంటి పరిస్థితుల్లో టీమిండియాను ఎదుర్కోవడం ఎంత కష్టమో తాజా మ్యాచ్ మరోసారి నిరూపించిందని తెలిపాడు. ఇటీవల భారత్‌తో జరిగిన ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ వర్షం కారణంగా చివరి మ్యాచ్ రద్దు కావడంతో 22తో ముగిసింది. ఈ నేపథ్యంలో తమ జట్టు ప్రదర్శనను ప్రశంసించడంలో తప్పేమీ లేదని శామీ వ్యాఖ్యల సారాంశం.**అభిషేక్ శర్మ విధ్వంసకర ఇన్నింగ్స్**న్యూజిలాండ్‌తో వెల్లింగ్టన్‌లో జరిగిన మూడో టీ20లో భారత్ అద్భుత విజయాన్ని అందుకుంది. 199 పరుగుల లక్ష్యాన్ని కేవలం 13.2 ఓవర్లలోనే ఛేదించి ఆరు వికెట్ల తేడాతో గెలిచింది. యువ బ్యాటర్ అభిషేక్ శర్మ కేవలం 38 బంతుల్లోనే 113 పరుగులు చేసి ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడ్డాడు. మరో ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ 19 బంతుల్లో 45 పరుగులు సాధించి జట్టు విజయానికి కీలక సహకారం అందించాడు. వీరిద్దరూ కలిసి 7.1 ఓవర్లలోనే 133 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు.**భారత్ జోరుకు కివీస్ కళ్లెం వేయగలదా?**ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భారత్ 30 ఆధిక్యాన్ని సాధించి సిరీస్‌ను కైవసం చేసుకుంది. వరుస విజయాలతో భారత జట్టు దూకుడు ప్రదర్శిస్తుండగా, మిగిలిన మ్యాచ్‌ల్లోనైనా గెలిచి పరువు నిలబెట్టుకోవాలని న్యూజిలాండ్ భావిస్తోంది. మరోవైపు, భారత్‌తో జరిగిన సిరీస్‌లో తమ జట్టు చూపిన పోరాటాన్ని సమర్థించుకునేలా శామీ వ్యాఖ్యలు చేశాడు. ఆధునిక టీ20 క్రికెట్‌లో బ్యాటర్ల దూకుడు, మైదాన పరిస్థితులు బౌలర్లకు ఎలాంటి సవాళ్లు విసురుతున్నాయో ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి.



# పాక్ గడ్డపై చరిత్ర సృష్టించిన లంక బౌలర్!

## 30 ఏళ్ల రికార్డు బద్దలు.. ఐదు వికెట్లతో దిల్షాన్ మదుషంక సంచలనం

**లాహోర్, అక్టోబర్ 28:** శ్రీలంక యువ పేసర్ దిల్షాన్ మదుషంక పాకిస్థాన్ గడ్డపై చరిత్ర సృష్టించాడు. వన్డే ముక్కోణపు సిరీస్‌లో భాగంగా పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో అద్భుత బౌలింగ్‌తో అదరగొట్టాడు. 8.3 ఓవర్లలో 34 పరుగులు మాత్రమే ఇచ్చి ఐదు వికెట్లు పడగొట్టాడు. దీంతో పాకిస్థాన్ గడ్డపై ఆతిథ్య జట్టుపై అత్యుత్తమ బౌలింగ్ గణాంకాలు నమోదు చేసిన విదేశీ పేసర్‌గా రికార్డు సాధించాడు. ఈ క్రమంలో న్యూజిలాండ్ బౌలర్ క్రిస్ హారిస్ పేరిట ఉన్న 30 ఏళ్ల రికార్డును అధిగమించాడు.**పాక్ బ్యాటింగ్ పతనం** లాహోర్‌లోని గడాఫీ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ శ్రీలంక బౌలర్ల ధాటికి 25.3 ఓవర్లలో 110 పరుగులకే ఆలౌటైంది. బాబర్ ఆజమ్ 29 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. మిగతా బ్యాటర్లు పెద్దగా రాణించలేకపోయారు. మదుషంక ఫఖర్ జమాన్, సాద్ బేగ్, అరాఫత్ మిన్హాస్, షాహీన్ షా అఫ్రిది, హారీస్ రవూఫ్‌లను పెవిలియన్‌కు పంపాడు. అతడి ధాటికి పాక్ బ్యాటింగ్ కుప్పకూలింది.**క్రిస్ హారిస్ రికార్డు బద్దలు**1996లో న్యూజిలాండ్ బౌలర్ క్రిస్ హారిస్ పాకిస్థాన్‌పై 42 పరుగులిచ్చి ఐదు వికెట్లు పడగొట్టాడు. అప్పటి నుంచి కొనసాగుతున్న రికార్డును మదుషంక 5/34 గణాంకాలతో తిరగరాశాడు. పాకిస్థాన్ గడ్డపై ఆతిథ్య జట్టుపై విదేశీ పేసర్లు సాధించిన అత్యుత్తమ బౌలింగ్ ప్రదర్శనగా ఇది నిలిచింది.**శ్రీలంక ఘన విజయం**బౌలింగ్‌లో సత్తా చాటిన శ్రీలంక, బ్యాటింగ్‌లోనూ అదరగొట్టింది. 111 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని 18.1 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి ఛేదించింది. కమిందు మెండిస్ అజేయంగా 62 పరుగులు చేయగా, పావన్ రత్నాయకే 23 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. దీంతో శ్రీలంక ఎనిమిది వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి ముక్కోణపు సిరీస్ ఫైనల్‌కు అర్హత సాధించింది. అద్భుత బౌలింగ్ ప్రదర్శన చేసిన మదుషంకకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది.

# రాణించిన అభిరథ్, రాహుల్

## పంజాబ్‌పై హైదరాబాద్ దీటైన పోరు.. తొలి ఇన్నింగ్స్‌లో 193/2



**హైదరాబాద్, అక్టోబర్ 28:** రంజీ ట్రోఫీ మూడో రౌండ్ పోటీల్లో భాగంగా పంజాబ్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు దీటుగా బదులిస్తోంది. పంజాబ్ తొలి ఇన్నింగ్స్‌లో 431 పరుగులకు ఆలౌట్ కాగా, రెండో రోజు ఆట ముగిసే సమయానికి హైదరాబాద్ 54 ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 193 పరుగులు చేసింది. అభిరథ్ రెడ్డి, రాహుల్ రాదేశ్ అర్ధశతకాలతో రాణించి జట్టును పోటీలో నిలిపారు.**సెంచరీకి మూడు పరుగుల దూరంలో అభిరథ్** హైదరాబాద్ ఓపెనర్ అభిరథ్ రెడ్డి అద్భుత బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. 140 బంతులు ఎదుర్కొని 12 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 97 పరుగులు సాధించాడు. సెంచరీకి కేవలం మూడు పరుగుల దూరంలో ఉండగా ఉమేశ్ యాదవ్ బౌలింగ్‌లో వికెట్ కీపర్ సలీల్ అరోరాకు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. మరోవైపు రాహుల్ రాదేశ్ నిలకడగా ఆడుతూ 154 బంతుల్లో తొమ్మిది ఫోర్లతో 72 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు.**రెండో వికెట్‌కు కీలక భాగస్వామ్యం**తొలి వికెట్‌గా తన్మయ్ అగర్వాల్ రెండు పరుగులకే ఔటవడంతో హైదరాబాద్ 15 పరుగుల వద్ద వికెట్ కోల్పోయింది. ఆ తర్వాత అభిరథ్, రాహుల్ కలిసి పంజాబ్ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్నారు.

రెండో వికెట్‌కు 154 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి జట్టుకు బలమైన పునాది వేశారు. ఆట ముగిసే సమయానికి రాహుల్‌తో పాటు కొడిమెల హిమతేజ ఎనిమిది పరుగులతో క్రీజులో ఉన్నాడు.**సాలిల్ అరోరా శతకం.. పంజాబ్ భారీ స్కోరు**అంతకుముందు పంజాబ్ వికెట్ కీపర్ బ్యాటర్ సాలిల్ అరోరా 268 బంతుల్లో 11 ఫోర్లు, నాలుగు సిక్సర్లతో 151 పరుగులు చేసి జట్టుకు భారీ స్కోరు అందించాడు. ఉమేశ్ యాదవ్ 37 పరుగులతో అజేయంగా నిలిచాడు. చివరి వికెట్‌కు వీరిద్దరూ 116 పరుగులు జోడించడం విశేషం. హైదరాబాద్ బౌలర్లలో కెప్టెన్ సీవీ మిలింద్ నాలుగు వికెట్లు, రక్షణ్ రెడ్డి మూడు వికెట్లు పడగొట్టారు.రెండో రోజు ఆట ముగిసే సమయానికి హైదరాబాద్ ఇంకా 238 పరుగుల వెనుకంజలో ఉంది. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించాలంటే మూడో రోజు హైదరాబాద్ బ్యాటర్లు మరింత బాధ్యతగా ఆడాల్సి ఉంది.

# వైష్ణవి శర్మ సంచలనం.. ఐదు వికెట్లతో అదరగొట్టింది!

## జింబాబ్వే బ్యాటింగ్ పతనం.. భారత మహిళల జట్టు క్లీన్‌స్వీప్‌పై కన్ను




**వడోదర, అక్టోబర్ 28:** భారత మహిళల క్రికెట్‌లో యువ స్పిన్నర్ వైష్ణవి శర్మ అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకుంది. జింబాబ్వేతో జరుగుతున్న మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా బుధవారం జరిగిన చివరి వన్డేలో ఐదు వికెట్లు పడగొట్టి ప్రత్యర్థి జట్టు పతనాన్ని శాసించింది. ఆమె ధాటికి జింబాబ్వే మహిళల జట్టు 39.5 ఓవర్లలో 131 పరుగులకే కుప్పకూలింది. వైష్ణవి 39 పరుగులిచ్చి ఐదు వికెట్లు తీసుకుంది. అంతర్జాతీయ వన్డే క్రికెట్‌లో ఆమెకు ఇదే తొలి ఐదు వికెట్ల ఘనత కావడం విశేషం.**వరుసగా వికెట్లు తీసి.. ప్రత్యర్థికి షాక్**ఎడమచేతి వాటం స్పిన్నర్ వైష్ణవి తన బౌలింగ్‌తో జింబాబ్వే బ్యాటర్లను తీవ్రంగా ఇబ్బంది పెట్టింది. బెలవ్డ్ బిజా (1), మోడెస్టర్ ముపాచిక్వా (37), చిడెజా ధురురు, మిషెల్ మవుంగా, న్యాషా గ్వాంజురాలను పెవిలియన్‌కు పంపింది. దీంతో జింబాబ్వే భారీ స్కోరు సాధించే అవకాశాలు దెబ్బతిన్నాయి. భారత బౌలర్లలో నయాలి సత్ఘరే, క్రాంతి గౌడ్ చెరో రెండు వికెట్లు పడగొట్టి తమ వంతు సహకారం అందించారు.**రెండో వన్డేలోనూ మెరిసిన వైష్ణవి**ఈ సిరీస్‌లో వైష్ణవి నిలకడైన ప్రదర్శన చేస్తోంది. రెండో వన్డేలోనూ నాలుగు వికెట్లు తీసి జింబాబ్వే బ్యాటింగ్ లైనప్‌ను దెబ్బతీసింది. ఆ మ్యాచ్‌లో భారత జట్టు 121 పరుగుల తేడాతో విజయం సాధించి మూడు వన్డేల సిరీస్‌లో 20తో తిరుగులేని ఆధిక్యాన్ని సాధించింది. చివరి వన్డేలోనూ వైష్ణవి ఐదు వికెట్లతో చెలరేగడంతో భారత బౌలింగ్ బలం మరోసారి బయటపడింది.**క్లీన్‌స్వీప్‌కు భారత్ సిద్ధం** మూడో వన్డేలో జింబాబ్వేను 131 పరుగులకే పరిమితం చేయడంతో భారత్ ముందు 132 పరుగుల లక్ష్యం నిలిచింది. ఈ మ్యాచ్‌లోనూ విజయం సాధిస్తే మూడు వన్డేల సిరీస్‌ను 30తో క్లీన్‌స్వీప్ చేసినట్లవుతుంది. యువ బౌలర్ వైష్ణవి శర్మ ప్రదర్శన భారత మహిళల జట్టుకు మరింత ఆత్మవిశ్వాసాన్ని అందించింది.

# ఏఐ ప్రమాదకరం : డీప్ ఫేక్ వీడియోలపై కృతి సనన్ పోరాటం



ప్రముఖ బాలీవుడ్ నటి కృతి సనన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) దుర్వినియోగంపై న్యాయపోరాటానికి దిగారు. తన వ్యక్తిత్వ, ప్రచార హక్కులను (పర్సనాలిటీ అండ్ పబ్లిసిటీ రైట్స్) కాపాడాలంటూ ఆమె ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఏఐ టెక్నాలజీని ఉపయోగించి తన అనుమతి లేకుండా డీప్‌ఫేక్ వీడియోలు, ఫేక్ ఎండార్స్‌మెంట్లు సృష్టించకుండా అడ్డుకోవాలని ఆమె కోరారు.

ఈ పిటిషన్‌పై జస్టిస్ పురుషైంద్ర కుమార్ కౌరవ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. వ్యక్తిత్వ హక్కులకు సంబంధించిన అంశాలపై మరిన్ని వివరాలు, గత తీర్పులను సమర్పించాలని కృతి తరఫు న్యాయవాదులను ఆదేశిస్తూ, తదుపరి విచారణను రేపటికి వాయిదా వేసింది.

ఇటీవల ఒక కార్యక్రమంలో మాట్లాడిన కృతి సనన్, ఏఐ టెక్నాలజీ తనను తీవ్రంగా భయపెడుతోందని వ్యాఖ్యానించారు. "ఏఐ ఒక పదునైన కత్తి లాంటిది, అది ఎంత పదునుగా ఉంటే అంత ప్రమాదకరం" అని ఆమె అన్నారు. సోషల్ మీడియాలో ఏఐ ద్వారా సృష్టించిన తన ఫొటోలను రిపోర్ట్ చేయడానికి సరైన నిబంధనలు కూడా లేవని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే ఆమె కోర్టును ఆశ్రయించడం ప్రాధాన్యత సంతరించుకుంది.



# నవీన్ చంద్ర హీరోగా నటిస్తున్న 51వ సినిమా షూటింగ్ పూర్తి



విలక్షణ నటుడు నవీన్ చంద్ర హీరోగా నటిస్తున్న కొత్త సినిమా షూటింగ్ పూర్తయింది. ఆయన కెరీర్‌లో ఇది 51వ చిత్రం కావడంతో, తాత్కాలికంగా 'ఎన్‌సీ 51' అనే టైటిల్‌తో ఈ ప్రాజెక్ట్‌ను పిలుస్తున్నారు. ఆర్.పి. బాల దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ చెన్నైలో ముగిసింది. ఈ విషయాన్ని నవీన్ చంద్ర స్వయంగా సోషల్ మీడియా ద్వారా వెల్లడించాడు.


ఈ చిత్రంలో నవీన్ చంద్ర సరసన హరిప్రియ రోషిణి హీరోయిన్‌గా నటిస్తుండగా, బాల శరవణన్, కాళీ వెంకట్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఓ వినూత్నమైన కథాంశంతో ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచేలా ఈ సినిమాను రూపొందిస్తున్నట్లు చిత్ర యూనిట్ తెలిపింది.దర్శకుడు ఆర్.పి. బాల ఈ చిత్రానికి నిర్మాతగా కూడా వ్యవహరిస్తుండగా, ప్రముఖ సినిమాటోగ్రాఫర్ పి.జి. ముత్తయ్య మరో నిర్మాతగా ఉంటూ సినిమాకు ఛాయాగ్రహణం అందిస్తున్నారు. శక్తి బాలాజీ సంగీతం, అజయ్ మనోజ్ ఎడిటింగ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.ప్రస్తుతం సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయి. త్వరలోనే అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి సినిమాను థియేటర్లలో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. అధికారిక టైటిల్, ఫస్ట్ లుక్ వివరాలను త్వరలో ప్రకటించనున్నారు.

# 'దొంగ నా కొడుకు' నుంచి 'ఓ మై గాడ్' సాంగ్ రిలీజ్!




పాన్ ఇండియా నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై వస్తున్న వినూత్న చిత్రం 'దొంగ నా కొడుకు'. మౌళి తనూజ్ ప్రశాంత్ హీరోగా నటిస్తున్న ఈ క్రైమ్ కామెడీ సినిమాకు శ్రీను కంబాల దర్శకుడిగా పరిచయమవుతున్నారు. నవంబర్ 13న ఈ చిత్రం థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో సినిమాపై అంచనాలను పెంచేలా మేకర్స్ మ్యూజికల్ ప్రమోషన్స్‌ను ప్రారంభిస్తూ తాజాగా 'ఓ మై గాడ్' ఫస్ట్ సింగిల్‌ను విడుదల చేశారు. ఆ విశేషాలు ఇప్పుడు చూద్దాం! రామ్ మిరియాల ఎనర్జిటిక్ వాయిస్‌తో మ్యాజిక్: సింజిత్ ఎర్రమిల్లి స్వరపరిచిన 'ఓ మై గాడ్' పాట రొమాంటిక్‌గా, జోష్ నింపేలా ఉంది. ఆకట్టుకునే మ్యూజిక్, కొత్త తరహా బీట్స్ ఈ పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఇక సింగర్ రామ్ మిరియాల తనదైన ఎనర్జీ, ప్రత్యేకమైన వాయిస్‌తో ఈ పాటకు మరింత జోష్ తీసుకొచ్చారు. ఆయన డైనమిక్ వోకల్స్ పాటను మరో లెవెల్‌కి తీసుకెళ్లాయని చెప్పవచ్చు. భాస్కరభట్ల చక్కటి సాహిత్యం: ప్రేమలో పడిన హీరో తన మనసులోని ఫిలింగ్స్ భాస్కరభట్ల సాహిత్యం ద్వారా అందంగా పలికించారు. తన జీవితంలోకి ప్రేయసి వచ్చిన తర్వాత ఎలాంటి మార్పులు చోటుచేసుకున్నాయి, ఆమెతో గడిపే ప్రతి క్షణం ఎందుకు ప్రత్యేకంగా అనిపిస్తుందో ఈ పాటలో చూపించారు. ప్రేమలో కలిగే కొత్త ఉత్సాహం, అనుభూతులను ఈ పాట ఆకట్టుకునేలా రాసారు.అదిరిపోయే కొరియోగ్రఫీ: ఈ పాటకు ఆట సందీప్ అందించిన కొరియోగ్రఫీ చాలా అందంగా ఉంది. హీరో మౌళి తనూజ్ ప్రశాంత్ తన ఎనర్జిటిక్ డ్యాన్స్‌తో ఆకట్టుకోగా, హీరోయిన్ సుష్మిత శెట్టితో ఆయన ఆన్‌స్క్రీన్ కెమిస్ట్రీ ఎంతో క్యూట్‌గా ఉంది. ఇక యూత్‌ఫుల్ రొమాంటిక్ వైబ్‌తో సాగిన ఈ పాట మ్యూజిక్ లవర్స్‌ను ఆకట్టుకుంటోంది. ప్రస్తుతం సోషల్ మీడియాలోనూ ఈ సాంగ్ ట్రెండ్ అవుతోంది. భారీ తారాగణం.. త్వరలోనే రిలీజ్: ఇప్పటికే ఫస్ట్ లుక్ పోస్టర్, టీజర్‌తో మంచి బజ్ క్రియేట్ చేసిన మూవీ ఇప్పుడు ఈ మెలోడీ సాంగ్‌తో సినిమా ప్రమోషన్లను జోరుగా కొనసాగిస్తోంది. ఈ చిత్రంలో అలీ, రజిత, రఘుబాబు, ప్రియా, గుండు సుదర్శన్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇక నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు.

# లాస్ ఏంజిల్స్‌లో 'రామాయణ' స్పెషల్ స్క్రీనింగ్..




భారత సినీ పరిశ్రమలోనే అత్యంత భారీ బడ్జెట్‌తో, ఎన్నో అంచనాల నడుమ తెరకెక్కుతున్న చిత్రం 'రామాయణ'. నితేశ్ తివారీ దర్శకత్వంలో, రణ్‌బీర్ కపూర్, సాయిపల్లవి, యశ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమా కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

నవంబర్ 5న దీపావళి కానుకగా మొదటి భాగం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న నేపథ్యంలో చిత్ర బృందం అక్టోబర్ 27న లాస్ ఏంజిల్స్‌లో ఒక ప్రత్యేక ప్రీమియర్ షోను ఏర్పాటు చేసింది. ఈ ప్రదర్శన అనంతరం సినిమాపై తొలి రివ్యూలు సోషల్ మీడియాలో వచ్చేశాయి.

సినిమా చూసిన వారిలో చాలామంది దీన్ని ఒక అద్భుతమైన దృశ్యకావ్యంగా అభివర్ణించారు. విజువల్స్, సంగీతం, యాక్షన్ సన్నివేశాలు కనీవినీ ఎరుగని రీతిలో ఉన్నాయని కొనియాడారు. ఒక నెటిజన్ రాస్తూ.. "'రామాయణ: రైజ్ ఆఫ్ ఏ లెజెండ్' అద్భుతంగా ఉంది. విజువల్స్, నృత్యాలు, సంగీతం, యాక్షన్ అన్నీ భారీ స్థాయిలో ఉన్నాయి. రణ్‌బీర్ కపూర్ నటన అమోఘం, యశ్ చాలా ఆకర్షణీయంగా కనిపించారు. ఈ ఏడాది అత్యంత గొప్ప సినిమాటిక్ అనుభవాలలో ఇదొకటి" అని పోస్ట్ చేశారు.మరొకరు "వచ్చే వారం బాక్సాఫీస్ వద్ద విధ్వంసం ఖాయం. బ్లాక్‌బస్టర్ గ్యారెంటీ! నటీనటులందరూ అద్భుతంగా నటించారు" అంటూ ప్రశంసించారు. ముఖ్యంగా శ్రీరాముడి పాత్రలో రణ్‌బీర్ కపూర్ నటనకు ప్రేక్షకులు భావోద్వేగానికి గురయ్యారని పలువురు పేర్కొన్నారు. "రామాయణ చిత్రం ప్రేక్షకులను కంటతడి పెట్టించింది. రణ్‌బీర్ ఒక అసాధారణ నటుడు. మేం గెలిచేశాం!" అంటూ ఒక అభిమాని తన ఆనందాన్ని పంచుకున్నారు. ఈ ప్రత్యేక ప్రదర్శనకు నిర్మాత నమిత్ మల్హోత్రా, దర్శకుడు నితేశ్ తివారీ దంపతులు, రణ్‌బీర్ కపూర్, యశ్, సాయిపల్లవి వంటి తారలందరూ సంప్రదాయ దుస్తుల్లో హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

కాగా, సినిమాలో ఆత్మ లోపించిందని, దైవిక భావన లేదని, సంగీతం ఆశించిన స్థాయిలో లేదని కొందరు అభిప్రాయపడ్డారు.ఈ సినిమాను రెండు భాగాలుగా, సుమారు రూ.4000 కోట్ల భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నట్లు నిర్మాత నమిత్ మల్హోత్రా గతంలో వెల్లడించారు. "ఏడెనిమిదేళ్ల క్రితం ఈ ప్రాజెక్ట్ మొదలుపెట్టినప్పుడు అందరూ నన్ను పిచ్చివాడిలా చూశారు. ప్రపంచంలోనే గొప్ప ఇతిహాసాన్ని ప్రపంచ ప్రేక్షకుల ముందుకు తీసుకెళుతున్నాం. హాలీవుడ్ సినిమాలతో పోలిస్తే మేం చాలా అద్భుతంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాం" అని ఆయన తెలిపారు.

మొత్తం మీద 'రామాయణ' చిత్రం అద్భుతమైన విజువల్స్, నటీనటుల ప్రతిభతో ప్రశంసలు అందుకుంటోంది. ఈ స్పందనల నడుమ నవంబర్ 5న విడుదల కానున్న ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఎలాంటి అద్భుతాలు సృష్టిస్తుందో వేచి చూడాలి.

## సందీప్ కిషన్ 'పవర్ పేట'..

# 'పడమటి వీధి జానకి'గా రితికా నాయక్..



యంగ్ హీరో సందీప్ కిషన్ నటిస్తున్న ఆసక్తికర చిత్రం 'పవర్ పేట'. ఈ సినిమా నుంచి హీరోయిన్ రితికా నాయక్ పుట్టినరోజు (అక్టోబర్ 27) సందర్భంగా ఆమె పాత్రను పరిచయం చేస్తూ చిత్రబృందం ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. ఇందులో ఆమెను 'పడమటి వీధి జానకి' అనే విభిన్నమైన పేరుతో పరిచయం చేశారు.విడుదలైన పోస్టర్‌లో రితికా నాయక్ ఎంతో సాంప్రదాయబద్ధంగా, హోమ్లీ లుక్‌లో ఆకట్టుకుంటున్నారు. క్రీమ్ కలర్ హాఫ్ శారీ, పింక్ దుపట్టా, స్లీవ్‌లెస్ బ్లౌజ్‌తో పాటు సాంప్రదాయ ఆభరణాలు ధరించి, పాతకాలం నాటి ఇంట్లో హుందాగా కూర్చుని కనిపించారు. ఈ లుక్ ఆమె పాత్రపై ఆసక్తిని రేకెత్తిస్తోంది. అయితే, పోస్టర్‌లో డీగ్లామర్‌గా కనిపిస్తున్నప్పటికీ, సినిమాలో ఆమె కొన్ని గ్లామరస్ సన్నివేశాల్లో కూడా నటిస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా వర్షంలో కొన్ని సీన్లు ఉన్నాయని ప్రచారం జరుగుతోంది. రాజకీయం, ప్రేమ, అధికార పోరాటం వంటి అంశాల నేపథ్యంలో ఈ సినిమాను టాలెంటెడ్ డైరెక్టర్ కృష్ణ చైతన్య తెరకెక్కిస్తున్నారు. సందీప్ కిషన్ ఇందులో 'సేనాపతి రవి' అనే పవర్‌ఫుల్ పాత్రలో నటిస్తున్నారు. మణిశర్మ సంగీతం అందిస్తుండగా, 70ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి నిర్మిస్తున్నారు. ఇప్పటికే సినిమా షూటింగ్ 60 శాతం పూర్తయింది.'మిరాయ్', 'కొరియన్ కనకరాజు' వంటి విజయాలతో మంచి ఫామ్‌లో ఉన్న రితికా నాయక్ ఈ చిత్రంలో కథానాయికగా ఎంపిక కావడం విశేషం. గతంలో ఈ ప్రాజెక్ట్ పలువురు హీరోల వద్దకు వెళ్లినప్పటికీ, చివరికి సందీప్ కిషన్‌తో ఖరారైంది. తాజాగా విడుదలైన 'పడమటి వీధి జానకి' గ్లింప్స్ సినిమాపై అంచనాలను పెంచింది. సందీప్, రితికా మధ్య కెమిస్ట్రీ ఎలా ఉండబోతుందోనని ప్రేక్షకులు ఎదురుచూస్తున్నారు.